ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 4 సంచిక - 10 జూలై 2023 కృష్ణ పేజీలు 68 వెల రూ. 20



# మహాకవి శ్రీశ్రీకి 40వ వర్ధంతి నివాళ్ళు



మహాకవి శ్రీశ్రీ 40వ వర్ధంతి సందర్భంగా **15.6.2023** వ తేదీన రాష్ట్రంలో పలుచోట్ల ఆయన విగ్రహానికి నివాళ్ళు అర్పించారు. విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలో ఉన్న శ్రీశ్రీ విగ్రహానికి పూలమాలలు వేసి, జోహార్లు అర్పించారు. శ్రీశ్రీ గీతాలను ఆలాపించారు. మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులు పెచ్చుమీరుతున్న ఈ తరుణంలో శ్రీశ్రీ సాహిత్య స్ఫూర్తి నేడు మరింత అవసరంగా ఉందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరసం, సాహితీ స్రవంతి, విరసం, జనసాహితి, శ్రీశ్రీ సాహిత్య నిధి తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సత్యరంజన్, సత్యాజీ, శమంతకమణి, కె లక్ష్మయ్య (సాహితీ స్రవంతి); గుండు నారాయణ రావు, (జాషువా సాంస్కృతిక వేదిక), క్రాంతి (ఎంబి విజ్ఞాన కేంద్రం), పరుచూరి అజయ్ కుమార్, కొప్పర్తి రాంబాబు (అరసం), దివికుమార్ (జనసాహితి), అరసవిల్లి కృష్ణ (విరసం), గోళ్ళ నారాయణరావు (ఆంధ్ర ఆర్ట్స్ అకాడెమీ), శ్రీశ్రీ విశ్వేశ్వరరావు (శ్రీశ్రీ ప్రింటర్స్), సింగంపల్లి అశోక్‌కుమార్ (శ్రీశ్రీ సాహిత్య నిధి) తదితరులు పాల్గొన్నారు. ఆరోజు సాయంత్రం ఘంటసాల సంగీత కళాశాల వేదికపై ఎక్స్ రే సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో శ్రీశ్రీ పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. విశాఖపట్నంలో సాహితీ స్రవంతి, ప్రజానాట్యమండలి కార్యకర్తలు శ్రీశ్రీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళ్ళర్పించారు.







సాహిత్య ప్రస్థానం

జులై 2023

సంపుటి : 4 సంచిక : 10

# స్వేచ్ఛకు సంకెళ్లు

**భా**రత ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల అమెరికాలో పర్యటించిన సందర్భంలో ట్విటర్ అధినేత ఎలన్‌మస్క్ భేటీ అయ్యారు. రైతాంగ ఆందోళన సందర్భంలో ట్విటర్‌పై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించిన విషయమై మీడియా ప్రశ్నించినపుడు ఆయన పరోక్షంగా అంగీకరిస్తూ ... ఆయా దేశాల్లో వుండే చట్టాల ప్రకారమే తాము పనిచేస్తామని దాటవేశారు. శ్వేత సౌధంలో మోడీ మొదటిసారి ఒక మీడియా గోష్టిలో మాట్లాడినప్పుడు – భారత దేశంలో మైనారిటీల హక్కుల గురించి అడిగినందుకు వాల్‌స్ట్రీట్ జనరల్ విలేకరి సిద్ధికిని ట్రోలర్లు చుట్టుముట్టారు. ఆఖరుకు అమెరికా మాజీ అధ్యక్షుడు బారక్ ఒబామా కూడా ఈ విషయమై వ్యాఖ్యానించినందుకు ఆయనపై మత కోణంలో దాడి చేశారు కేంద్ర నేతలు. ఇవన్నీ ప్రపంచవ్యాపితంగా భారతదేశ ప్రతిష్టకు కళంకం తెచ్చాయి. తెలంగాణలో ప్రగతిశీల మేధావి హరగోపాల్‌తో సహా వందమందికి పైగా ప్రముఖులపై ఉపా చట్టం కింద కేసు నమోదైన సంగతి ఆలస్యంగా బయటకు రాగా, నిరసనల తర్వాత ప్రభుత్వం ఉపసంహరించుకోవలసి వచ్చింది. తులసి చందు అనే మహిళా జర్నలిస్టు సోషల్ మీడియాలో వాస్తవాలు వెల్లడిస్తున్నందుకు గాను ట్రోల్స్‌కు గురై కేసు పెట్టాల్సి వచ్చింది. ఆమెకు మీడియా లోకం, ప్రజాస్వామ్య వాదులు సంఘీభావం ప్రకటించడంతో ఎదురుదాడి మొదలెట్టారు. అభివృద్ధి నిరోధకులు, మత ఛాందసులు దేశంలోనే గాక వెలుపల కూడా ప్రగతిశీల వాదులపై ఎలా వేటసాగిస్తున్నది తెలిపే ఉదంతాలివి. ఈ రోజు ఎవరిని లక్ష్యంగా చేసుకున్నారనేది ఒకటైతే... ఈ ధోరణి వారికే పరిమితం కాదని కూడా చెబుతున్న పరిస్థితులివి. ప్రగతిశీల కవులు, రచయితలు, కార్యకర్తలు తదితరులు అందరినీ ఈ వేధింపులు వెన్నాడుతున్నాయి. హక్కులకు ఉరివేస్తున్నాయి. కలాలు గళాలు ఖండించాల్సిన పోకడలివి. భవిష్యత్తుకు తీవ్ర హెచ్చరికల వంటివి.

■

ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
సత్యాజీ

సంపాదకవర్గం
కె.సత్యరంజన్ • కెంగార మోహన్ • వొరప్రసాద్
• చీకటి దివాకర్ • గనారా • కుమార స్వామి
మేనేజర్ : కె.లక్ష్మయ్య

బొమ్మలు
తుంబలి శివాజి
చిదంబరం

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు


నీ సిగ్గు చిమిడిపోనూ : వి.రెడ్డెప్ప రెడ్డి ............ 5
కెప్టెన్ అశోక్ : మల్లారెడ్డి మురళీ మోహన్ 20
మా ఊరి పీకే : అద్దేపల్లి ప్రభు .......... 30
పెళ్లిపిలుపు : ప్రగతి .................... 48
నివారణ : అవ్వారు శ్రీధర్‌బాబు ..... 51


## కవితలు


జల్లు కుర్తంది! : మహేష్ వేల్పుల ........... 8
ఆమెలో ఆకాశం : సునీత గంగవరపు ......... 9
రావణుని ప్రశ్న : అను : వెన్నా వల్లభరావు 9
జీవించాలంటే ... : శీలా సుభద్రాదేవి .......... 13
మెట్ట కథ : జి.వెంకట కృష్ణ ........... 14
దు:ఖపు సంధ్యలో ... : సిరికి స్వామినాయుడు ..... 15
మా ఇంటెదుటి ఊర బావి : తవ్వా ఓబుల్ రెడ్డి ........ 19
ఇరుకుగూళ్లు : డా. పి.విజయలక్ష్మి పండిట్ 22
మూసేసిన రైల్వే స్టేషన్ : గిరిప్రసాద్ చెలమల్లు ...... 22
దారిదీపం : దిలీప్ . వి ................ 25
కొత్త అడుగులు : మామిడిశెట్టి శ్రీనివాసరావు 25
మన కంటే అవే నయం : డా. ఉదారి నారాయణ.... 26
ఆశయ కాంతిరేఖలు : ఎన్. లహరి ............... 29
తూకం : పద్మావతి రాంభక్త .......... 29
నా కవిత్వం : డా.వి.రాజేంద్ర ప్రసాద్ ... 39
నేరమయ నిర్లక్ష్యం : కలమట దాసుబాబు ... 40
చిరునవ్వు దారుల్లో ... : ఈతకోట సుబ్బారావు ... 46
ఇది రక్త సమ్మిశ్రిత యుగం: డాక్టర్ కత్తి పద్మారావు ..... 47
కవి – పుస్తకం : ఎస్.హనుమంతరావు ... 52
వానా .. స్వాగతం! : కోటం చంద్రశేఖర్ ....... 61


## వ్యాసాలు


విజ్ఞాన ప్రదాత కొమర్రాజు లక్ష్మణరావు
– ఆచార్య వెలమల సిమ్మన్న ...... 10
కేతు విశ్వనాథ రెడ్డి తొలి కథలు
– కె.పి.అశోక్ కుమార్ ............ 16
ఇష్టంగా నెరవేర్చిన బాధ్యత .. కాళ్లకూరి నాటకత్రయ విశ్లేషణ
– రెంటాల శ్రీ వెంకటేశ్వరరరావు 23
సహజ పరిమళాలు వెదజల్లిన మట్టిబండి
– పింగళి భాగ్యలక్ష్మి ............. 27
బహుముఖ గ్లోబల్‌లో అస్తిత్వ అన్వేషణే అంతర్థిత
– డా. ఎ.రవీంద్రబాబు ............ 34
ముఖాముఖి : స్త్రీవాదం బహుముఖాలుగా విస్తరిస్తోంది
– ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా .. 37
ఏటి జేడెల్లో పురిటి జాడలు
– ఎమ్వీ రామిరెడ్డి ................... 41
వర్తమానం: అప్రకటిత 'ఎమర్జెన్సీ'పై ఐక్య పోరాటం
– తెలకపల్లి రవి .................... 44
సాహితీ ప్రజ్ఞ ................................................ 53
బాలల సినిమాలపై బహు విలువైన పుస్తకం
– సమ్మెట ఉమాదేవి ............... 54
కాలం వెంట నడిచిన కవి తుమ్మల
– డా. డి.ఉదయ కుమారి ........ 56
మనకు తెలిసీ తెలియనట్టుండే జీవితాల కథలు
– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు .. 58
డైరీ ............................................... **62**



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

# నీ సిగ్గు చిమిడిపోనూ ...



- వంకిరెడ్డి రెడ్డెప్ప రెడ్డి
94400 44922

శారదా వైద్య కళాశాల, ప్రసూతి విభాగం, సెమినార్ హాలు. హాలుకు మూడు వైపులా గుండ్రంగా మెట్టుమెట్టు పైకెగ బాకినట్లున్న రెండువందల పైగా సీట్లు. నాలుగో వైపు మూలన సర్జరీ టేబుల్. టేబులుకు ఇరువైపులా ఇద్దరు డాక్టర్లు. డాక్టర్లకు సాయం చేసేందుకు ఇద్దరు నర్సులు. టేబులుపై శవాకారంలో పడుకోబెట్టిన ఓ నిండు గర్భిణీ. ఆ టేబులుపై పడ్డ చిన్న దోమ, సన్న పిన్ను, రక్తపు మరక, ఏదైనా సరే, హాలులో ఉండే అందరికీ కనబడేట్లు వెలుగుతున్న నియాన్ లైట్లు. లైట్ బ్లూ రంగులో వెలిగిపోతున్న హాలు గోడలు, అదే రంగులో ఉన్న డాక్టర్లు, నర్సుల గౌన్లు. టేబుల్ పక్కన మూడు ట్రేలు. ఒక దానిలో రకరకాల సర్జరీ ఇనుస్ట్రుమెంట్స్. మరో ట్రేలో గ్లోవులు, కాటన్, అంటి బయోటిక్ మరియు మత్తు మందులు. మూడో ట్రేలో ఆక్సిజెన్ సరపరా పైపులు. మొత్తం మీద స్పిరిట్ వాసనతో నిండిన వైద్య ప్రపంచం.

మామూలుగా ప్రసవ విభాగం థియేటర్లు రెండో అంతస్తులో ఉంటాయి. ఈ రోజు జరగబోయేది ప్రత్యేక ప్రసవం కాబట్టి మూడవ అంతస్తులో ఉండే సెమినార్ హాలులో నిర్వహించడం జరుగుతున్నది. టేబులుపై జరగబోయే కార్యక్రమాన్ని రికార్డు చేయడానికి ఇద్దరు వీడియోగ్రాఫర్లు కెమెరాలు సరిచేసుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ఆ వీడియోలు ఉపయోగించి పాఠాలు చెప్పవచ్చునని కాలేజీ యాజమాన్యమే ఆ రికార్డింగ్ చేయిస్తూ ఉంది. టేబులుపై పడుకోబెట్టిన గర్భిణీ ఆ వీడియోగ్రాఫర్లు చెప్పినట్లు కాళ్ళు వెడల్పుగా జరపలేదు. శవం ముఖంలో నవ్వు తెప్పించాలనుకున్నట్లుగా సాగింది వారి ప్రయత్నం.

నూరుమంది జూనియర్ డాక్టర్లు బిలబిలమంటూ హాల్లోకి వచ్చారు. వాళ్ళందరిలోనూ టేబుల్ మీద ఏం జరుగుతుందో చూడాలనే తహతహ. ఆ హాలులో ఎక్కడ కూర్చుంటే ప్రసవ ప్రక్రియ సంపూర్తిగా కనపడుతుందోననే అంచనాతో అనువైన సీటు ఎంచుకుని జూనియర్ డాక్టర్లు కూర్చున్నారు. ఎంబిబిఎస్ చివరి సంవత్సరం, చివరి సెమిస్టరు. ప్రసవ ప్రక్రియను గురించి ప్రాక్టికల్ పరీక్షలు రాబోయే నెలలోనే ఉన్నాయి. ఇంతకుముందు నాలుగైదు చూసినా అవన్నీ సిజేరియన్ ప్రసవాలే. ప్రసూతి సబ్జెక్టు పాఠాలు విన్నాక వారంతా ఇప్పుడు చూడబోయేదే ప్రత్యక్ష సహజ ప్రసవ ప్రక్రియ.

హాలులో ఎనిమిది ఏసీ మెషీన్లు పని చేస్తున్నాయి. టేబులుపై పడుకోబెట్టిన ఆ గర్భిణీకి తప్ప హాలులో ఉన్న వారందరికీ ఏ సీ మెషీన్లు పంచే చల్లగాలి అనుభవంలోకి వస్తున్నది. చల్లగాలి అనుభవించలేకపోవడమే కాక, ఆ గర్భిణీ మనసు రగులుతున్న బొగ్గులమూటులా కుమిలికుమిలి కుసిలికుసిలి మండుతున్నది. కారణం లేకపోలేదు. ఆసుపత్రి వారిచ్చిన గౌను ఆమెకు నడుమునుంచి వెనక్కి లాగబడి ఉంది. ఆమెను మోకాళ్ళు మడిచి పెట్టుకుని ఉండమన్నారు డాక్టర్లు. ఆమె తొడలు, స్త్రీత్వం ఆ హాలులో ఉన్న అందరికీ కనబడుతున్నాయి. అక్కడున్న నర్సుకు పాపమనిపించిందో లేక చూస్తున్న తనకే సిగ్గనిపించిందో, గర్భిణీ తొడల మధ్య గుడ్డను కొద్దిగా ముందుకు సర్దింది.

పాడెపై పడుకోబెట్టిన శవానికి బట్టూడినా, జుట్టూడినా సర్దుకోదు. ఎవరైనా సర్దినా కాదనదు. తొడలమధ్య గుడ్డ సర్దినా గర్భిణీ ఏ చలనం లేకుండా పడుకుండిపోయింది.

ఆమెకు ప్రసవ వేదన మొదలైంది. టేబులుకు ఎడమవైపున ఉన్న పురుష డాక్టర్ టేబులుపై పడుకున్న గర్భిణీని చూపిస్తూ గర్భంలో ఉండే ప్రతి అవయవం గురించి, స్త్రీత్వం సంకోచ వ్యాకోచాల గురించి వివరిస్తున్నాడు. ఎడమ వైపునున్న మహిళా డాక్టర్ తనకు ఎడమ వైపున వేలాడదీసిన చార్టులో ఆయా భాగాలను ఓ పాయింటర్ లైట్ సాయంతో చూపిస్తున్నది. మధ్యలో విద్యార్థులు అడుగుతున్న ప్రశ్నలకు డాక్టర్లు జవాబులు చెబుతున్నారు. టేబుల్ పైనున్న గర్భిణీ అటు విద్యార్థులకు, ఇటు డాక్టర్లకు ఓ లైవ్ మోడల్ లాగా మిగిలింది.

డాక్టర్ల పని వాళ్ళు చేసుకుపోతుంటే, నర్సులు తమ పని చేస్తున్నారు. 'పుష్ పుష్' అంటూ గర్భిణీని ప్రోత్సహిస్తున్నారు. ఎంత ప్రయత్నించినా కడుపులో బిడ్డను ఆమె బయటకు తోయలేకున్నది. అటు కడుపులోని కండరాలు, ఇటు మనస్సు బిడ్డను బయటకు తోయాలన్న ఆమె ప్రయత్నాలకు సహ కరించడం లేదు.

ప్రసవంకోసం వేచి చూడ్డం మొదలై అప్పటికి మూడు గంటలైంది. 'పుష్ పుష్' అనడం ఆగలేదు. డాక్టర్లకు, నర్సులకు ఓర్పు నశించింది. తన శరీరాన్ని చూసేవాళ్లకు అప్పగించేసింది. వాళ్ళు ఆమెను బూతులు తిట్టడం మొదలెట్టారు. ఆమె కళ్ళపై కుడిరెట్ట అడ్డం పెట్టుకుని సిగ్గుపడుతున్నదని అనుకున్నారు నర్సులు. "కళ్ళపైనుంచి చేయి తీసి టేబులును ఊతంగా పట్టుకుని బిడ్డను బయటకు తొయ్యి" అంటున్న నర్సుల మాట వినబడనట్లు తాత్కాలికంగా చెవిటిదైపోయిందామె.

"మొగోని పక్కన పడుకున్నబుడు లేని సిగ్గు ఇబ్బుడెందుకు మే? బిడ్డను తొయ్యే నీ పాసుగాలా. తెల్లారినుంచి నిలబడి నిలబడి నిలువుగాళ్ళు పడ్డాయి" అంటూ గట్టిగానే అంగలారు స్తున్నారు నర్సులు. ఈ మాటలేవీ టేబులుపై పడుకున్న ఆమె మనస్సును తాకడం లేదు. ఇంతమంది స్త్రీ పురుషులు తన స్త్రీత్వాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నారన్న దుగ్ధ ఆమెను దహిస్తూ ఉంది. ఇలా కాన్పు జరగడానికి ఒప్పుకున్నందుకు వైద్య కళాశాల వాళ్ళు ఆమెకు ఐదువేలిచ్చారు. ఇంకో ఐదువేలు కాన్పు జరిగాక ఇస్తారు. అందుకే వొళ్ళు అప్పగించేసింది.

కాన్పు అయ్యాక తల్లి బిడ్డలను టేబుల్ నుంచి స్ట్రెచర్ పైకి మార్చిన నర్సు మేరీ, "ఆడదన్నాక ప్రసవం తప్పుతుందా! నీ కన్నీళ్లు చెరువునీళ్ళ మాదిరి పారి టేబులుపై వేసిన బెడ్ షీట్ పూర్తిగా తడిసిపోయిందే." అనడం దూదిపెట్టిన ఆ తల్లి చెవులకు వినబడలేదు.

❖ ❖ ❖

మల్లి, సిగ్గు తోబుట్టువులు.

చిన్న పిల్లగా ఉన్నపుడే, మల్లిని చూసి ఎవరైనా "ఈ పిల్ల ఎవరిబిడ్డ, బో ముద్దుగా ఉందే?" అంటే సిగ్గుపడి పారిపోయేది. "సొట్టలు బడే ఆ బుగ్గల్జూడు" అన్నా, "దొండపండ్ల మాద్రిగా ఉండే ఆ పెదాల్జూడు" అన్నా, "చేప్పిల్లల మాదిరుండే ఆ కండ్లుజూడు" అన్నా సిగ్గుపడేది. "ఈ పిల్లకేం సిగ్గబ్బ, దీని సిగ్గు చిమడా!" అంటే ఇంకా సిగ్గుపడేది. మల్లితో పాటు ఆ పిల్ల శరీర భాగాలపై ఉండే నగానట్రా కూడా సిగ్గుపడే బాపతే కాబోలు. బంగారు వర్ణంలో మెరిసే తన పాదాల ముందు వెండి కాలిపట్టీలు వెలవెలబోయేవి. తన రెండున్నర మూర్ల నాజూకైన జడ ముందు తురిమిన మల్లెలు గుర్తింపుకు నోచుకోకపోయేవి. ముక్కు, చెవులు, కనులు, మెడ అందంగా ఉండటంతో రెండుపేటల గొలుసు, కమ్మలు, ముక్కుపుల్లలు కూడా తేలిపోయేవి.

మల్లికి పదనాలుగో ఏటే శివయ్యతో పెళ్లయింది. పెళ్ళైన సంవత్సరానికే తల్లిదండ్రులు పెట్టిన బంగారు మొత్తం మొగుడు అమ్మేసి తాగి తందనాలాడితే, ఎవరైనా ఆ వివరం అడుగు తారేమోనని భయపడి, ఏం జవాబు చెప్పాలో తెలియక సిగ్గుపడేది. "ఇరవై ఏండ్లు కూడా అయినట్లుగాలే, అబ్బుడే ముగ్గురు బిడ్డలా? బిడ్డలు కనేపనిలో పాలుమాలినట్లే లేదు గదమ్మీ!" అన్నా సిగ్గుపడేది. "ముగ్గుర్నీ ఆడబిడ్లనే కన్నావు. ఈ సారన్న మొగబిడ్డను కని వంశిగాన్ని నిలబెడతావో లేదో!" అంటూ అత్తామామా సతాయిస్తే, ఆడబిడ్డలు పుట్టడంలో తన తప్పుందేమోననుకుని సిగ్గుపడేది.

సేద్యంలోకి పోయినా అంతే! మునంలో ముందుబడి మడి నాటినా, కలుపుతీసినా, "ఏమ్మే మా అందరికంటే ముందు బోతావుండావు, మునం ముగించుకొని బొయి మొగునిపక్క పండుకునేకి తొందరగా ఉండాదా?" అంటూ తోటి కూలోల్లు తనపై బురదనీళ్ళు జల్లి ఎగతాళి చేస్తే సిగ్గుపడేది. "ముగ్గురు బిడ్డలైన ఇంగా సిగ్గుపడతావెందుకు మే" అంటే ఇంకా సిగ్గుపడేది.

అలాంటి సిగ్గుల మల్లి ఆసుపత్రిలో ఇచ్చే డబ్బుతో నెలపాటు ముగ్గురు పిల్లలకింత గంజిపోయొచ్చని సిగ్గుపడుతూనే ఆ టేబులుపై ప్రసవానికి ఒప్పుకుంది. అంతమంది ఆడామగ కళ్ళప్పగించి చూస్తుండగా, శవంలా వివస్త్రగా పడుకుని, ప్రసవవేదన అనుభవిస్తూ, చెయ్యి కళ్ళకు అడ్డం పెట్టుకుని సిగ్గు నటిస్తూ, నిశ్శబ్దంగా రోదిస్తూ, కన్నీటి చెలమతో చెంపలను తడుపుకుంటూ తన కర్తవ్యాన్ని పూర్తి చేసిందామె.

❖ ❖ ❖

తప్పతాగి మత్తెక్కి రోడ్డెక్కిన మల్లి మొగుణ్ణి అటుగా వెళు_న్న లారీ మింగేసింది. కేసు మాఫీ చేసుకోవడానికి లారీ వాడు ఇచ్చిన డబ్బులు, మొగుడికి అప్పుకు పోసిన సారాకొట్టోడు, కేసు వ్యవహారం నడిపిన పోలీసోళ్ళు పంచుకోగా, మిగిలిన యాభైవేలు "ఈ వయసులో ఇదే మాకు దిక్కు" అంటూ అత్తామామలు బ్యాంకులో వేసుకున్నారు. నాలుగోబిడ్డ కడుపులో పడ్డ సందర్భమది. తమ కడుపాత్రం సాధించుకోలేని అత్తామామలకు కోడలు, మనమరాళ్ళు భారమయ్యారు. 'యాడన్నా బడి సావండి' అంటూ అత్త అన్నపుడు గుండె భారమై పిల్లల్ని చంపి తనూ చావాలనుకుంది మల్లి.

అదే సమయంలో ముగ్గురు సన్న బిడ్డలను, ఆర్నెల్ల కడుపుతో ఉన్న తనను కాపాడుకుంటానంటూ దూరపు బంధువు, వరసకు అన్న అయ్యే వెంకటేసు కలిశాడు. "నువ్వు నా చెల్లెల్లాంటి దాని"వన్నాడు. "మెడికల్ కాలేజీలో స్వీపరుగా ఉద్యోగం ఏయిస్తా"నంటే– అంతకంటే భాగ్యమా అనుకుంది. మెడికల్ కాలేజీ రోడ్డు పక్కనే చిన్న గుడిసె ఖాళీగా ఉందంటే అక్కడికి చేరిపోయింది. 'వెంకటేసు దేవుడి లాంటోడు' అనుకుంది మల్లి. కడుపుతో ఉన్న ముగ్గురి బిడ్డల తల్లి లేచిపోయిందని చెప్పుకుంటున్నారని తెలిసి సిగ్గుపడింది.

"విధవ పెన్షన్ రావడానికి ఇంకో మూడు నెలలైనా పడుతుందక్కా" అంది వాలంటీర్. పిల్లలను అంగన్‌వాడిలో చేర్చుకోమంటే "ఆధార్ కార్డులో అడ్రస్ ఇక్కడిది కాదు కదక్కా" అంది అంగనవాడి టీచర్. ముగ్గురు బిడ్డలు, గర్భిణీ అయిన తను ఈ మూన్నెళ్ళు ఎలా బతకాలో తెలీక లెక్కలు వేయడం మానేసింది మల్లి.

పేరుకు మెడికల్ కాలేజీయే, కానీ కాలేజి ఉండేది చిన్న మండల హెడ్ క్వార్టర్స్. ఆ చిన్న టౌనుకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఈ కాలేజీ. పేషంట్లు మాత్రం ఉండరు. పురుడు కోసం వచ్చే పేషంట్లు అసలు ఉండరు. పురుడు అంటే గర్భిణీతో పాటు మరో ఇద్దరైన ఆసుపత్రి వద్దకు తోడు వెళతారు. కాలేజీ ఆసుపత్రిలో రూము తీసుకుంటే రోజుకు మూడువేలు అదనంగా ఖర్చు. టౌనులో ఉండి చూసుకుందామంటే కాలేజీ ఐదు కిలోమీటర్ల దూరమాయే. అందుకే పురుడు కోసం ఆ ఆసుపత్రికి ఎవరూ రారు. పేషంట్లు లేకపోతే ఎలా అని కాలేజీ వారే కొంతమంది నిండు గర్భిణీలను ఎదురు డబ్బిచ్చి పిలిపించుకుని పురుడు పోసి ప్రాక్టికల్స్ అయ్యాయనిపిస్తారు.

మెడికల్ కాలేజీ పెద్ద ఆసుపత్రిలో పురుడు పోసుకుంటే తల్లీబిడ్డా క్షేమంగా ఉంటారని మల్లిని నమ్మించాడు వెంకటేసు. ఆ ఆసుపత్రిలో పురుడు పోసుకుంటే పదివేల రూపాయలు ఇస్తారని, చిన్న డాక్టర్ల నుంచి పెద్ద డాక్టర్ల దాకా బాగోగులు చూసుకుంటారని చెప్పాడు. వాళ్ళిచ్చే పదివేలతో కుటుంబం రెన్నెళ్ళు గడుస్తుందని చెప్పాడు. రెండురోజులుగా తినేకి లేక సగం కడుపుతో పడుకుంటున్న బిడ్డల్ని తలుచుకుని ... అలా అంతమంది ఆడామగ చూస్తుండగా డెలివరీ చేసుకునేందుకు మల్లి ఒప్పుకుంది.

కాలేజీ వాళ్ళిచ్చిన ఇరవై వేలల్లో, పదివేలు వెంకటేసు నొక్కేసి పదివేలే మల్లికి ఇచ్చాడు. "ఇరవై వేలు తీసుకొని ముక్కడానికి ఏం నొప్పి?" అన్న నర్సు మేరీ మాటలతో వెంకటేసు పదివేలు నొక్కేసిన సంగతి తెలిసింది. వెంకటేసు ఆ డబ్బు తీసుకోవడం చూశానని కూడా చెప్పింది ఆ నర్సు. వీడు తడిగుడ్డతో గొంతు కోసేవాడే అనుకుంది మల్లి. మానం నలుగురికి జూపితే వచ్చిన డబ్బులో కూడా భాగం తీసుకున్న వెంకటేసును చూస్తుంటే గుండె రగిలిపోయింది.

వెంకటేసు అదే ప్రైవేటు మెడికల్ కాలేజీలో అటెండర్. పదివేలు జీతం. తాగుడు విషయంలో వీడూ శివయ్యకు తక్కువేం కాదని వారంలోపే మల్లికి తెలిసింది. చెల్లెల్లాంటి దానివి అన్నోడు కాన్పు జరిగిన నెల తరువాత 'నీళ్ళకోసం' అంటూ ఓ నడిరాత్రి తడికె తోసుకుని లోపలికొచ్చాడు. పక్కలో పడుకున్నాడు. 'చీ తూ పో' అంటే, 'డెలివరీ అబ్బుడు నూరుమంది నీ మానం చూడంగాలేంది నా దగ్గిర సిగ్గెందుకే' అనగానే గుండె కోసినట్లనిపించింది మల్లికి. అయినా ఎవరూ లేని నాకు, నా బిడ్డలకూ 'వీడయినా దిక్కేలే' అనుకుని పక్కన చోటిచ్చింది. "ఇది ఏదో ఒకరోజు జరిగేదేలే" అని సర్దుకుంది.

❖ ❖ ❖

ఆర్నెల్లు అలా గడిచిపోయాయి. ఆ రోజు రాత్రి పిల్లలు నలుగురూ 'నేను నేను' అంటూ తల్లి పక్కన పడుకుందుకు పోరి పోరి అలసి నిద్రబోయారు. పెద్దబిడ్డ అలిగి గుడిసెలోనే మూలన ముడుక్కుంది.

నడిజాము తర్వాత ఎక్కడో అలికిడి కావడంతో మల్లికి మెలకువొచ్చింది. మూలన పడుకున్న పెద్దబిడ్డ కోసం వెతికింది. బయట జాలారిలో పెద్దబిడ్డ చేతిని గుంజుతున్నాడు వెంకటేసు. 'కాలుముడికి పోవాలంటే తోడు వస్తిమ్మే' అనేసి గుడిసె లోపలికి పోయాడు. 'తోడొచ్చాడా, తోడేల్లా వచ్చాడా' గుర్తించలేని తల్లి కాదు మల్లి. గుండె మండిపోయింది. ఒంటరి ఆడదాన్ని ఏం చేయలేనని అలవాటు పడ్డ ఏడుపును ఆశ్రయించింది. బిడ్డలను ముందు కడతేర్చి తను కడతేరి పోవాలనుకుంది. కొంతలో కొంత మార్పుగా బిడ్డలేమి పాపం చేశారనుకుంది.

ఆ రోజు నుంచి కంటికి కునుకులేకుండా పెద్దకూతురికి కాపలా కాస్తూ ఉంది మల్లి. పదోరోజు పక్కలోకొచ్చాడు

వెంకటేసు. నడిజాముకాడ కాలు మీదేశాడు. దిండుకింద దాచి ఉంచిన నాలుగంగుళాల స్కాల్పెల్ చేతిలోకి తీసుకుంది. ఊహించని వేగంతో వెంకటేసు మగతనాన్ని కోసేసింది. వాడి బట్టలంత రక్తమే! మల్లి చేతిలో తెగిపోయిన తన మగతనం కనిపించాక గాని వాడికి నొప్పి తెలియలేదు.

విషయం తెలిస్తే వీధిలో జనాలకు ఏమని చెప్పాలో తెలియక, గట్టిగా ఏడ్చే అవకాశం లేక, మనసులోనే లబోదిబో మనుకుంటూ రోడ్డు వెంబడి పరిగెత్తాడు వెంకటేసు. స్కాల్పెల్ బ్లేడుతో కొస్తే సెప్టిక్ కాదని మల్లి తెలుసుకుంది. ఎక్కడదాక కోసేస్తే ప్రాణాపాయం లేదో అంతే కచ్చితంగా కోసింది.

అవకాశం దొరికినప్పుడల్లా ఆసుపత్రిలో స్కాల్పెల్ బ్లేడుతో పాటు మరెన్నో సర్జికల్ ఇనుస్ట్రుమెంట్స్ దొంగతనంగా వెంకటేసే తెచ్చి మల్లి ఇంట్లో దాస్తుంటాడు. టౌన్లో ఉండే చిన్న ఆసుపత్రుల్లో సగంరేటుకు అమ్ముకోవడానికి అలవాటుపడ్డాడు.

ముందురోజు మెడికల్ కాలేజీకి వెళ్లి 'సాయిబులోల్లకు మగతనం కోస్తారంట' గదా అంటూ మొదలెట్టి, ఏ మాత్రం కొస్తే చావడో తెలుసుకొని వచ్చింది మల్లి. మగ శరీరం, ఆడ మనసు కలిగిన ఎందరో మగతనం కోసేయించుకుంటారని కూడా తెలుసుకుంది. ఆ తెలివే ఇప్పుడు వాడింది. ఆ తెలివి చెప్పిన నర్సు మేరీకి మనస్సులోనే కృతజ్ఞత చెప్పుకుంది.

మొగుడు శివయ్య రోజూ తాగి చంపాడు. అత్తామామ తనను తనబిడ్డలను ఆకలికి చావమని చంపారు. వెంకటేసు తన మానాన్ని ఆసుపత్రికి అమ్మి, తనతో పడక పంచుకుని, తన కూతుర్ని చెరచబోయి చంపాడు. "ఇందరు ఇన్నిసార్లు ఒగాడదాన్ని చంపగా లేంది, వెంకటేసుగాడి మగతనాన్ని ఒక్కసారి చంపితే ఏమవుతుంది?" అనుకుంది మల్లి. ఆ ధైర్యంతోటే అనుకున్న పని చేసింది.

వెంకటేసు ఎక్కడో బతికే ఉంటాడు, తనకేమి జరిగిందో, ఎందుకు జరిగిందో చెప్పుకోలేక చస్తూ బతుకుతుంటాడు, కేసైతే పెట్టడు. పోలీసులు తన వెంటబడే అవకాశం లేదు. ఆ నమ్మకం తోటే, "ఇకనుంచైనా నన్ను, నా బిడ్డల్ని మానంగా బతకనీ సామీ" అనుకుంటూ తూర్పు తిరిగి దండం పెట్టుకుంది మల్లి. ఆ తరువాతెప్పుడూ ఆమె సిగ్గుపడలేదు, బిడ్డలతో సహా చావాలనుకోలేదు. 'చంపైన బతుకుతా'ననుకుంది. ■


## సాహిత్య ప్రస్థానం

విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక

**చందాదారులుగా చేరండి ..**

**మీ మిత్రులను చేర్పించండి ..!**

**వివరాలకు 94900 99057 ను సంప్రదించండి.**


# జల్లు కుర్తంది

**ఆ**నకాలం అత్తే
మనసు చిత్తు పడవయితది
ఎండిన చేతులకు పని మొలకలత్తయి
దుక్కి దూప తీర్సుకుంటది..

గదంతా ఒక్కరోకు ఇంకొరోకు
గుబులు దినం పొద్దువద్దది
పొక్కిలైన పెంకుల గుండా
సుట్టం ఇంట్ల జొరవవద్దది..

పది దిక్కుల జల్లు వద్దంటే
నాలుగు దిక్కుల జేరి పెయ్యి దాసుకుంటాం
ఇల్లులెక్కనే గుండె జల్లడయితది
గప్పుడు, గూడు జారిన పిట్టలెక్క
దుఃఖం రాగం ఎత్తుకుంటది..

ఇల్లు పాడుగాను !
పొక్కల బడ్డ చెత్రియింది
నాలుగు గిన్నెలన్న లేవాయే
రెండు దిక్కులన్నా కుర్సే కాడ పెట్టేటోన్ని
బురద బురదయింది
ఎట్ల ముడ్సకపందుము
మనసు ఎట్ల నిమ్మలమయితది !!

హమ్మయ్య... ఆనైతే ఎల్సింది
ఇరామం అనుకుంటే !
మట్టి గోడ కూలి
మా గుండెను పూడ్చింది
అయ్యో భగవంతా !
బతుకు మీదనే పిడుగు వద్దందే !
గా పొద్దున కాళ్ళు మెక్కిన
తెల్లబట్టలోడు రాని వాని మీద ఈ మట్టెత్తి పోత్త !

గాలికి కొట్టకపోయిన
రేకులెక్క కాలే కడపు కొట్టుకుపోతే మంచిగుండు
గా పోట్వలు ఇడియోలు
తీసేటోల్లు జర మా ఇంటినీ సూపెట్టుర్రి
గప్పుడైనా, పెద్ద సారూ
డబుల్ బెడ్రూం ఇల్లు కట్టిత్తడెమో !
అసుంట పోయొత్త పొట్టి బర్రె, పల్ల బర్రె
మచ్చులావు, ఎల్లెద్దు ఆనకు తడ్షి
ఎట్లున్నయో బిడ్డలు..


– మహేష్ వేల్పుల
99518 79504



## ఆమెలో ఆకాశం

ఆకాశం వైపు
మళ్లీ చూసిందామె
గడ్డ కట్టిన చెలికాని
హృదిలా ఉందది
ఏ ఊసులూ ఆమె కోసం వర్షించలేదు
మేఘాలతో ఏ సందేశాన్ని
ఆమెకు చేరవేయలేదు


కాగితం మీద
సగం కవిత
పదాల కోసం దిగులుగా వెతుక్కుంటుంది
వాక్యాలు కొన్ని ముక్కలవుతూ
మళ్లీ మళ్లీ అతుక్కుంటున్న అలజడి !

అర్ధాకలితో..
నిద్ర పట్టని పసిబిడ్డ
తల్లి గుండెలవైపు
ఆశగా చూస్తోంది
మాటలు రాని భాషతో
మెత్తగా తడుముతుంది

ఎన్నో సంగతులు
ఆమె గది చుట్టూ
తడబడుతూ తిరుగుతున్నాయి
చెప్పేందుకు.. వినేందుకు
ఎవరూ లేని శూన్యం
ఆమె మది ముంగిట మంట పెట్టి చలి
కాచుకుంటోంది

ఆమె మళ్లీ
ఆకాశం వైపు చూసింది
గాఢనిద్రలో వున్న ఆకాశం
ఆమె ఉనికి ని
విస్మరిస్తో..వెక్కిరిస్తోంది

**- సునీత గంగవరపు**
**94940 84576**



## రావణుని ప్రశ్న

హిందీ మూలం : **అజ్ఞాత కవి**
అనువాదం : **వెన్నా వల్లభరావు**
**94903 37978**

**రా**వణుడు అవ్వటం మాత్రం
అంత తేలికా...?
రావణునిలో అహంకారముంటే,
పశ్చాత్తాపం కూడా ఉంది
రావణునిలో కామం ఉంటే,
సంయమనం కూడా ఉంది!
రావణునిలో సీతని అపహరించే
దుర్గుణం ఉంటే,
ఆమె ఆమోదం లేకుండా
పరస్త్రీని తాకకూడదన్న
సంకల్పం కూడా ఉంది!
సీత సజీవంగా రామునికి దక్కటానికి
రాముని శక్తి కారణమైతే,
ఆమె పరమ పవిత్రంగా దక్కటంలో
రావణుడు తనకు తాను గీసుకున్న సరిహద్దు రేఖ ఉంది.

ఓ రామా!
మీ యుగంలోని రావణుడు
చాలా మంచివాడు.
పదికి పది తలల్ని
'బహిరంగంగా'నే అట్టిపెట్టుకున్నాడు...
ఇప్పుడు
శతకంఠులు, సహస్రకంఠులు ఎందరో...
లాఘవంగా వాటిని దాచిపెట్టుకుంటూ...
నిలువునా దహించుకుపోతున్న రావణుడు
ఎదురుగా నిలుచున్న గుంపుని
పదే పదే ఏమని ప్రశ్నిస్తున్నాడో
మీరెప్పుడైనా గ్రహించారా...?
'మీలో రాముడెవరైనా ఉన్నారా?' అని. ■



# విజ్ఞాన ప్రదాత కొమర్రాజు లక్ష్మణరావు

- ఆచార్య వెలమల సిమ్మన్న
94406 41617

**"ఆంధ్ర వాఙ్మయాభివృద్ధికి, ఆంధ్రదేశ చరిత్ర ప్రకాశమునకై, ఆంధ్ర విజ్ఞాన పోషణమునకై నిరంతర కృషి సల్పి, ఆంధ్ర ప్రత్యేక వ్యక్తిత్వ సాధనమునకై, తుదకు జీవితమునే ధారపోసిన యాంధ్రుడు కొమర్రాజు వేంకటలక్ష్మణరావు గారు"**
**– రాళ్ళపల్లి గోపాలకృష్ణమాచార్యులు**

తెలుగు సాహిత్యంలో పరిశోధనకు ప్రారంభకులు, మార్గ దర్శకులు ఎందరో వున్నారు, వారిలో విశిష్ట వ్యక్తి కొమర్రాజు వేంకట లక్ష్మణరావు (18-05-1876, 13-07-1923). తొలితరం పరిశోధనా రంగంలో చెప్పుకోదగ్గ విశేషమైన కృషి చేసిన ప్రముఖులు కొమర్రాజు. వీరి కృషి అపారమైంది. భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, శాస్త్ర విజ్ఞానం మొదలైన రంగాల్లో గ్రంథాల్ని, వ్యాసాల్ని, రాసి విజ్ఞానాన్ని సమాజానికి అందించిన విజ్ఞాన ప్రదాత ఆయన. వీరు ఎన్నో మంచి వ్యాసాలు రాసి పేరు తెచ్చుకున్నారు. వీరి పరిశోధనా వ్యాసాల్ని చారిత్రక, శాసన, భాష, సాహిత్య, శాస్త్ర సంబంధ వ్యాసాలుగా వర్గీకరించవచ్చు. ఆయన రాసిన ఒక్కొక్క వ్యాసం ఒక్కొక్క గ్రంథంగా మనం పరిగణించవచ్చు. అంతపెద్ద వ్యాసాలు అంత గొప్ప వ్యాసాలు అవి.

**1. చారిత్రక పరిశోధన వ్యాసాలు :**

లక్ష్మణరావు గారు ఆఫ్ఘనిస్తానం, అశోకవర్ధనుడు, అనపోతారెడ్డి, అనవేమారెడ్డి, అధర్వణాచార్యుడు, అనంతామాత్యుడు అన్నయ్య (తెనాలి) అబ్బయామాత్యుడు అప్పకవి, ఆంధ్ర బ్రాహ్మణులలోని నియోగి వైదిక భేదకాల నిర్ణయం, శ్రీనాథుని గ్రంథ కాల నిర్ణయం, కృష్ణరాయలు కొన్ని దిగ్విజయ యాత్రలు, చాళుక్యులు దక్షిణాత్యులే, ఏకశిలానగరమోరుగల్లే, మొదలైన చారిత్రక పరిశోధన వ్యాసాలు రాసి చారిత్రక పరిశోధకులుగా విఖ్యాతి గడించారు.

'ఆఫ్ఘనిస్తాన్' వ్యాసంలో అనేక చారిత్రక అంశాల్ని వివరించారు.'అశోక వర్ధనుడు' వ్యాసంలో కళింగ దిగ్విజయం, బౌద్ధమతావలంబనం, బౌద్ధ భిక్షువుల పరిషత్తు, రాజ్య విస్తారం, శిలాశాసనం, భూతదయ, సత్యప్రియత్వం, కట్టడాలు, అశోకుని స్వభావం గూర్చి తెలియజేశారు. అన పోతారెడ్డి వేయించిన మోటుపల్లి శాసనం ఆధారంగా అతని కాలం నాటి సాంఘిక పరిస్థితుల్ని కొమర్రాజు చాలా చక్కగా విపులీకరించారు.

'అధర్వణాచార్యుడు' వ్యాసంలో అధర్వణుడు 13వ శతాబ్దం తర్వాత వాడని నిర్ధారించారు. 'అనంతామాత్యుడు' వ్యాసంలో అనంతుడు తిక్కనను ఏవిధంగా అనుకరించారో భోజరాజీయం గ్రంథాన్ని బట్టి నిరూపించారు. వివరణాత్మక వ్యాసం 'అప్పకవి'. శ్రీనాథుడు రాసిన 'హరవిలాసం' కావ్యం ఆధారంగా, ఆయన రాసిన ఇతర కావ్యాల రచనా కాలాన్ని నిర్ణయించారు 'శ్రీనాథుని గ్రంథముల కాల నిర్ణయం' వ్యాసంలో. ఆముక్త మాల్యద రచనకు క్రీ.శ.1519 ఫిబ్రవరి 11వ తేదీన అంకు రార్పణ జరిగినట్టు 'కృష్ణరాయలు – కొన్ని దిగ్విజయ యాత్రలు' వ్యాసంలో తెలియజేశారు.

కొమర్రాజు అగ్రశ్రేణికి చెందిన చరిత్ర పరిశోధకులని చెప్పడానికి మరో నిదర్శనం 'చాళుక్యులు దాక్షిణాత్యులే' అనే వ్యాసం. చాళుక్యుల గూర్చి ఇంత పరిశోధనాత్మకమైన వ్యాసాన్ని కొమర్రాజుకి ముందు ఎవ్వరూ రాయలేదు. ఆయన శాసన పరిశోధకులు కాబట్టి రాయగలిగారు. దక్షిణ దేశచరిత్రను పరిశోధించడానికి పూనుకున్నవారిలో లక్ష్మణరావు సుప్రసిద్ధులు.

చాళుక్యుల ఉత్తరాపథం నుండి దక్షిణాపథానికి వచ్చారని కొందరు చెప్పారు. చాళుక్యులు చంద్రవంశపు క్షత్రియులని కొందరు పరిశోధకులు అన్నారు. కొమర్రాజు ఈ రెండు వాదనల్ని ఖండించారు. చారిత్రకంగా నిజాన్ని నిరూపించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం. **అసలు విషయం ఏమంటే రావుగారు తాను చనిపోయిన రోజు మధ్యాహ్నమే ఈ వ్యాసాన్ని ముగించారు. వీరు రాసిన చిట్ట చివరి వ్యాసం ఇదే.** చివరి శ్వాస వరకు ఆయన చరిత్ర రచన విడిచిపెట్టలేదు. పోతన ఒంటిమెట్ట వాదాన్ని, వావికొలను సుబ్బారావు గారి వాదాన్ని ఖండించి అది తప్పు అని చెప్పి, ఓరుగల్లు సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు కొమర్రాజు. వీరి చారిత్రక పరిశోధన ఒక మహోజ్జ్వల ఘట్టం. తెలుగు వారికి ఆదర్శం.

**2. భాషా పరిశోధన వ్యాసాలు :** అచ్చ తెలుగు, అక్షరములు, అక్షర సమామ్నాయం, అరవము నుండి తెలుగు పుట్టినదా? తెలుగు నుండి అరవము పుట్టినదా? కానే కాదు, త్రిలింగము నుండి తెలుగు పుట్టేనా? లేక తెలుగు నుండి త్రిలింగము పుట్టేనా? ద్రావిడ భాషలలోని ఉత్తమ పురుష వాచక సర్వనామం మొదలైన భాషావ్యాసాలు రాసి, భాషా పరిశోధకులుగా పేరు తెచ్చుకున్నారు కొమర్రాజు. ఈ వ్యాసాల్లో ఎన్నో కొత్త అంశాల్ని బయటపెట్టారు.

**3. శాసన పరిశోధన వ్యాసాలు :** శాసన పరిశోధనలో ఆరితేరిన దిట్ట కొమర్రాజు. వీరు ఎన్నో శాసనాల్ని లోతుగా పరిశీలించి, పరిష్కరించారు. పండరంగ అద్దంకి శాసనం, శివస్కందవర్మ కంతేరు తామ్ర శాసనం, రెండో పులకేశి కొప్పరపు తామ్ర శాసనం, చాళుక్య భీముని అత్తిలి తామ్ర శాసనం, మూడవ మాధవర్మ తామ్ర శాసనం, సోమలదేవి ద్రాక్షారామ పద్యశాసనం, శ్రీరంగ రాయల ఆనెగొంది రజత శాసనం, యుద్ధమల్లుడి బెజవాడ శాసనం మొదలైన ఎన్నో శాసనాల్ని విశ్లేషించి, తులనాత్మకంగా పరిశీలించి, శాసన పరిశోధకులుగా పేరు ప్రఖ్యాతలు గడించారు.

**4. సాహిత్య పరిశోధన వ్యాసాలు :** 'శివతత్త్వసారం' పీఠిక, అభిజ్ఞాన శాకుంతలం, శృంగారం – పూర్వలాక్షణికుల, అలంకారములు, లలితకళలు, అభినయం … ఇవన్నీ ఉత్తమ శ్రేణి సాహిత్య సంబంధ వ్యాసాలు.

తెలుగులో మొట్టమొదటి శతకం 'శివతత్త్వ సారం'. దీన్ని మల్లికార్జున పండితారాధ్యుడు రాశాడు. ఈ గ్రంథాన్ని మొట్ట మొదటిసారిగా పరిష్కరించి, ప్రకటించింది రావు గారే. 40 పేజీల పెద్ద పీఠిక రాశారు. మొదటి శతకాన్ని వెలుగులోకి తెచ్చి, దాని ప్రాధాన్యతను పండిత లోకానికి తెలియజేసిన ఉత్తమ పరిశోధకులు కొమర్రాజు.

సాహిత్య విలువల్ని మాత్రమే పరిష్కరించాలనే దృక్పథం లోనే కాక, ఆ కాలం నాటి దేశకాల పరిస్థితుల్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలనే లక్ష్యంతో ఈ గ్రంథాన్ని పరిష్కరించారు. ఇందులో చారిత్రక ప్రమాణాలు చోటు చేసుకున్నాయి. మల్లికార్జున పండితుని కాలాన్ని నిర్ణయించడం లోనైతేనేమి, అతని వంశ వృక్షాల్ని పేర్కొనడంలోనైతేనేమి, ఆ కాలం నాటి తెలుగుదేశ సాంఘిక పరిస్థితుల్ని, మతపరమైన విషయాల్ని వివరించడంలోనైతేనేమి… ఒక విశిష్ట మార్గాన్ని కొమర్రాజు అనుసరించారు.

'అభిజ్ఞాన శాకుంతలం' వ్యాసంలో వివిధ పాఠాల తారతమ్య పరిశీలన, కథాగమనం, భారతకథతో సంబంధం, ఔచిత్యం, రసపోషణ, వర్ణనలు, పాత్రచిత్రణ, టీకాలు, భాషాంతరాలుగా వర్గీకరించి పరిశీలించారు. మహాభారత కథ కంటే శాకుంతల వృత్తాంతం, కాళిదాసు చేతిలో ఔచిత్య వంతంగా తీర్చబడింది. మహాభారతంలో దుష్యంతుడు శకుంతలను కుటీరంలో చూసి, మోహించి, శకుంతలకు పుట్టిన కుమారునికి రాజ్యాన్ని ఇస్తానని ఆశ చూపి, గాంధర్వ వివాహం చేసుకుంటాడు. ఇక్కడ దుష్యంతుడు కుమారుని రాజ్యాభిషిక్తున్ని చేస్తానని చెప్పిన ఆశ, అంతగా ఔచిత్యంగా లేదు. అలాగే శకుంతల తన కుమారుడిని పట్టాభిషిక్తుని చేయమని అడగడం సహజంగా లేదు. అంతేకాదు ప్రేమానురాగాలకు పూర్తిగా విరుద్ధం. కాళిదాసు ఈ అనౌచిత్యాన్ని చక్కగా సరిదిద్దాడు. తన నాటకంలో శకుంతలకు దుష్యంతునికి మధ్య పుట్టిన అనురాగం పరస్పర ప్రేరేపితమైనట్టుగా రాశారని కొమర్రాజు కొనియాడారు.

'అధర్వణవేదం'పై రాసిన వ్యాసం, రావు గారి ప్రతిభను చాటి చెప్తుతుంది. కొమర్రాజు శృంగార రసంపై వ్యాసం రాశారు. దానిపై ఎన్నో చర్చలు, వాదోపవాదాలు జరిగాయి. శృంగార వర్ణనలు కావ్యాల్లో వుండాలని వాదించే వారి వాదనలకు సమాధానంగా కొమర్రాజు ఈ వ్యాసం రాశారు. భరతుడు, జగన్నాథ పండిత రాయలు, విశ్వనాథుడు, మమ్మటుడు, క్షేమేంద్రుడు మొదలైన వారి సిద్ధాంతాల్ని వివరిస్తూ శృంగార వర్ణనల పరిమితిని సూచించారు లక్ష్మణరావు గారు. శృంగారమనే పేరుతో సంభోగ వర్ణనలు చేయరాదని హెచ్చరించారు. పచ్చి శృంగారాన్ని వర్ణిస్తూ, కొందరు సమాజంలో అనీతిని సృష్టిస్తున్నారని ఆవేదన చెందారు.

'అలంకారములు' వ్యాసంలో అలంకారికుల వేరు వేరు సంప్రదాయాలు, అలంకారములకు గలభేదం, ధ్వనికి అలంకారానికి మధ్య గల తేడా, అలంకారాల చరిత్ర, అలంకారాల సంఖ్య, అలంకారాల విభజన, శబ్దార్థాలంకారాల

యోగ్యత, అనే శీర్షికలుగా వర్గీకరించి చర్చించారు. ప్రాశ్చాత్య గ్రంథాల్ని కుష్ణంగా పరిశీలించి 'లలితకళలు' అనే వ్యాసం రాశారు. లోతైన ఆలోచనలతో, తారతమ్య పరిశీలనతో, నిశితమైన దృష్టితో ఈ వ్యాసాన్ని రాశారు.

**5. శాస్త్ర సంబంధ వ్యాసాలు :** కొమర్రాజు రాసిన శాస్త్ర సంబంధమైన వ్యాసాల్లో గణిత శాస్త్రానికి, జ్యోతిష్య శాస్త్రానికి, తర్క శాస్త్రానికి, అర్థశాస్త్రానికి, ప్రకృతి శాస్త్రాలకు చెందినవి ఉన్నాయి.

**గణితశాస్త్రం :** అంకశ్రేఢులు, అనేక వర్ణ సమీకరణం, ఈ రెండు వ్యాసాలు గణిత శాస్త్రాలకు సంబంధించినవి. ఈ వ్యాసంలో కూడిక, తీసివేత, హెచ్చవేత, భాగాహారం, వీటి గూర్చి వివరించారు. ఏకవర్ణ సమీకరణంలో తెలియని వర్ణం ఒక్కటే వుంటుంది. అనేక వర్ణ సమీకరణంలో తెలియని వర్ణాలు అంటే సంఖ్యలు ఒకటికి మించి వుంటాయి. వాటిని సూత్రబద్ధంగా సాధించవలసి వుంటుంది అని విశదీకరించారు. భాస్కరాచార్యుడు చెప్పిన సిద్ధాంతాల్ని సులభమైన పద్ధతిలో వ్యాసరూపంలో కొమర్రాజు మనకు అందించారు.

**జ్యోతిష్య శాస్త్రం :** పంచాంగం, అధిక మాసం, రాజరాజు కాలమున తెలుగుదేశము నందు సౌరమాన వ్యవహారముండెనా? మొదలైన వ్యాసాలు జ్యోతిష్య శాస్త్రానికి సంబంధించినవి. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాల్ని పంచాంగాల గూర్చి కొమర్రాజు శాస్త్రీయ పద్ధతిలో వివరించారు. మనదేశంలో పంచాంగాల్ని గురించే పద్ధతి ఏర్పడి చాలా కాలమైంది. కాబట్టి దాన్ని ఆధునిక దృష్టితో సంస్కరించాల్సి వుందని అభిప్రాయపడ్డారు. 'అధికమాసం' వ్యాసంలో పంచాంగాలను అనుసరించి అధికమాసం అంటే ఏమిటో, అది ఎలా వస్తుందో తెలియజేశారు. మన పంచాంగం లెక్కల ప్రకారం ఒక్కొక్కసారి సంవత్సరానికి 13 మాసాలు వస్తాయి. అప్పుడు అదనంగా వచ్చిన మాసాన్ని అధికమాసం అంటారు. ఏ చాంద్రమాసంలో సంక్రాంతి వుండదో, అది అధిక మాసం. 'రాజరాజు నరేంద్రుడు' వ్యాసంలో రాజరాజు ఎప్పుడు పట్టాభిషిక్తుడయ్యాడో కొమర్రాజు చెప్పారు. ఈ వ్యాసంలో లోతైన పరిశోధన ఉంది. ప్రముఖుల ప్రశంసల్ని అందుకుంది,

**తర్కశాస్త్రం :** లక్ష్మణరావు గారు తర్కశాస్త్రంలో నిష్ణాతుడు. 'అనుమానం' అనే వ్యాసం తర్కశాస్త్రానికి సంబంధించింది. హిందూ తర్కశాస్త్రం గూర్చి, పాశ్చాత్య తర్కశాస్త్రాల గూర్చి, ఈ వ్యాసంలో చర్చించారు. తర్కశాస్త్రంలో 'అనుమానం' అనేది రెండో ప్రమాణం. ప్రమాణాలు నాలుగు 1. ప్రత్యక్షం 2. అనుమానం 3. ఉపమానం 4. శబ్దం. 'ప్రమ' అంటే యదార్థానుభవం. దీన్నే నిజమైన జ్ఞానం అని అంటారు. 'ప్రమ'కు కారణం ప్రమాణం. ఎక్కడో దూరంగా కన్పించే పొగను బట్టి అక్కడ అగ్ని వుందని అనుమానిస్తాం. ఇది వినడానికీ, చెప్పడానికీ బాగానే వుంటుంది. కానీ తర్కశాస్త్ర రీత్యా శాస్త్రీయ పద్ధతిలో దీన్ని నిర్వచించాలంటే శాస్త్రీయ ప్రతిభ వుండాలి ఆ ప్రతిభ కొమర్రాజుకి వుంది.

అనుమానం రెండు విధాలు : 1. స్వార్థానుమానం 2. పదార్థానుమానం. స్వార్థానుమానంలో మానవుడు తన సంశయాన్ని మాత్రమే పోగొట్టుకుంటాడు. పదార్థానుమానంలో ఇతరుల సంశయాన్ని కూడా తొలగిస్తారు. ఈ వ్యాసంలో తర్కశాస్త్రానికి సంబంధించిన అనేక అంశాలు చెప్పారు. ఈ వ్యాసం చివరలో కొమర్రాజు తర్కశాస్త్రానికి సంబంధించిన పారిభాషిక పదాల పట్టికను ఇచ్చారు.

**అర్థశాస్త్రం :** ఈ వ్యాసం ప్రముఖుల మెప్పును పొందింది. 'శుక్రనీతి'లో అర్థశాస్త్రానికి సంబంధించిన విషయాలున్నాయని రావు గారు చెప్పారు. దీనిలో చర్చించిన అర్థశాస్త్ర విషయాల్ని 'పొలిటికల్ ఎకనామీ'గా పరిగణించవచ్చు అని అన్నారు. కౌటిల్యుని 'అర్థశాస్త్రం' ఆర్థిక శాస్త్ర విషయాల్ని వివరించిన పరమోత్కృష్టమైన గ్రంథమన్నారు. 10వ శతాబ్దంలో రాసిన 'కామందకీయ నీతిశాస్త్రం', 12వ శతాబ్దంలో రాసిన 'నీతి వాక్యామృతం' కూడా ఆర్థిక శాస్త్ర గ్రంథాలే అని తెలియజేశారు.

ఆంగ్లేయులు అన్ని రంగాల్లో ముందు అడుగు వేయడానికి కారణం అనేక శాస్త్రీయ గ్రంథాలు ఆంగ్ల భాషలో వుండటమేనని అన్నారు. దేశ భాషల్లో శాస్త్రాల్ని అభ్యసించడం వల్ల కలిగే ప్రయోజనాల్ని, అందుకు చేయవలసిన కృషిని చెప్పడానికే ఈ వ్యాసాన్ని రాశారు. ఈ వ్యాసంలో శాస్త్ర గ్రంథాల ప్రాముఖ్యతను గూర్చి లక్ష్మణరావు .. "లలిత వాఙ్మయమభివృద్ధి చెందుట యొక యెత్తు, శాస్త్రజ్ఞానాభివృద్ధి కనుకూలమైన గ్రంథములు నిర్మాణమగుట యొకఎత్తు. ఇట్టి గ్రంథములు దేశదారిద్ర్య వినాశకములు' అని అన్నారు. ఇది సత్యం.

**6. ఇతర పరిశోధన వ్యాసాలు :** అద్వైతం, అభావం, కర్మయోగం, అవతారములు, అవధానములు అనాగరిక సంఘం, మొదలైనవి ఇందులోకి వస్తాయి. 'అద్వైతం' పేరుతో వ్యాసం రాశారు. జీవాత్మ, పరమాత్మ భిన్నాలని చెప్పేది ద్వైతం. జీవాత్మ పరమత అభిన్నములని చెప్తుతుంది అద్వైతం అని అన్నారు. 'అభావం' పేరుతో ఆయన ఒక వ్యాసం రాశారు. 'కర్మయోగం' వ్యాసంలో వేదాంతం గూర్చి చర్చించారు. 'అవధానములు' వ్యాసంలో అష్టావధానం, శతావధానం, వైదికావధానం, స్వరావధానం, నేత్రావధానం మొ॥ గూర్చి

వివరించారు.

కొమర్రాజు ఒక వ్యాసం రాసినా, గ్రంథం రాసినా, మొదట దాన్ని ఆసక్తికరంగా ప్రారంభించి, ఆ తర్వాత వ్యాఖ్యాన సహితంగా, శాస్త్రీయ పద్ధతిలో రాయడం వెన్నతో పెట్టిన విద్య. వీరి పరిశోధన వ్యాసాలు జనని, గ్రంథాలయ సర్వస్వం, అభినవ భారతి, శారద, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, అముద్రిత గ్రంథ చింతామణి, స్వధర్మ ప్రకాశిక, సరస్వతి, కళ, భారతి మొదలైన ప్రముఖ పత్రికల్లో ముద్రించబడ్డాయి. ఈ వ్యాసాలు కొమర్రాజు మేధా సంపత్తికి నిదర్శనం.

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని తన రచనల ద్వారా సుసంపన్నం చేసిన సాహితీమూర్తి కొమర్రాజు. ఇతర భాషల్లోని విజ్ఞానాన్ని తెలుగు భాషలోకి తేవడం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు. ఇతరులతో పోల్చి చూసేటప్పుడు ఆయనలో అనేక ప్రత్యేకతలు చాలా స్పష్టంగా కన్పిస్తాయి. ఇతరుల స్పృశించని అనేక రంగాల్లో కొమర్రాజు కృషి శ్లాఘనీయమైంది. తెలుగు భాషా సాహిత్యాల్లో విశేషమైన కృషి చేసి, తనకంటూ ప్రత్యేకమైన, విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్న మహోన్నతమూర్తి, ప్రతిభామూర్తి, సమతామూర్తి కొమర్రాజు లక్ష్మణరావు. ■

## సల్మాన్ రష్దీ ప్రతిష్టాత్మక జర్మన్ పురస్కారం



ప్రముఖ రచయిత సల్మాన్ రష్దీ ప్రతిష్టాత్మక జర్మన్ పురస్కారానికి ఎంపికయ్యారు. సాహిత్యంలో చేసిన విశేష కృషికి, నిరంతరం ప్రమాదాలు ఎదురవుతున్న చెక్కుచెదరని ఆయన సంకల్పం, సానుకూల వైఖరికి గాను ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 2023 అక్టోబర్ 22న ఫ్రాంక్ ఫర్ట్‌లో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఆయన రచనల్లో కథనాత్మక దృష్టితో పాటు నిరంతర సాహిత్య ఆవిష్కరణ, హాస్యం, జ్ఞానాన్ని మిళితం చేస్తారని జ్యూరీ తెలిపింది. హింసాత్మకతో కూడిన పాలనాశక్తులు మొత్తం సమాజాన్ని నాశనం చేసే విధానాన్ని వివరించడంతో పాటు వ్యక్తుల ప్రతిఘటనను నాశనం చేయలేరని కూడా వివరిస్తారని పేర్కొంది. గతేడాది ఆగస్టులో న్యూయార్క్‌లో నిర్వహించిన ఓ సాహిత్య వేడుకలో ఆయన దాడికి గురైన సంగతి తెలిసిందే. ఆయన నిరంతరం శారీరక, మానసిక సమస్యలతో పోరాటం చేస్తున్నప్పటికీ.. ఇప్పటికీ రచనలను కొనసాగిస్తున్నారని జ్యూరీ ప్రశంసించింది.

## జీవించాలంటే...

జీవితాలకేం ప్రయాణిస్తూనే ఉంటాయ్
ఒక్కోసారి సెకెన్ల ముల్లులా పరుగులు తీస్తాయ్
మరోసారి నిమిషాల ముల్లుతో పాటు
ఆచితూచి అడుగులు వేస్తూ
గంటల ముల్లుతో బద్ధకంగా
సోమరిగా కదులుతూ
కాలంతో పాటూ నడుస్తూనే ఉంటాయి ...


ఈ మనసే పరమ దుర్మార్గపుది
జ్ఞాపకాల పుట్టని నిరంతరమూ తవ్వుతూ
జీవితం ముంగిట్లో ఆశల చెట్టు మొదల్నే
సారవంతం చేస్తున్నానంటుంది
కానీ, కాసిని చిరునవ్వు పువ్వుల్ని
ఎప్పుడో గానీ పెదాలమీద అలంకరించదు

జీవితంతో చేయి చేయి కలిపి
ఈ మనసు నడవకుండా
నడక దారంతా ముళ్ళు రాలుస్తూ
సాల్వడార్ కరిగిపోతున్న కాలం గురించి
కథలు కథలుగా చెప్పి
నిరుత్సాహపు పొరల్ని
కళ్ళ మీద పరిచి చెలమల్ని అద్దుతుంది

ఎప్పుడో ఒకప్పుడు సమయం చూసి
ఈ దుర్మార్గపు మనసుని
ఒడుపుగా బంధించి
ఆలోచనల్ని ఎగిరిపోనీయకుండా
పిడికిట పట్టి మనసులో ఒంపి
పెంపుడు పిల్లిని చేసి మనవెనకే తిప్పుతూ
పక్కదార్లు పట్టనీకుండా
జీవితంతో చేతులు కలిపి నడవాల్సిందే
తప్పదు గాక తప్పదు!

**- శీలా సుభద్రాదేవి**

**81068 83099**



# మెట్ట కథ

తొలకరిలో
వజ్రాలను మొలిపించే ఐదెకరాల రాళ్లచేనులో
పదేళ్లుగా ముత్యాల వంటి విత్తనాలు విత్తి
కలుపులా వాడిపోయాడు
వొరుపులో
వీధి కట్టల మీద సుద్దుల గుంపుల్లో
పొద్దు పుచ్చకుండా
పెద్దిరెడ్డి యింటిచుట్టూ
మట్టిపనులకో మోత పనులకో
తిరిగి తిరిగి పడిగాపులై వడలి పోయాడు.

మట్కాకో పేకాటకో మర్లకుండా
చేబదుల్లూ కుదవలూ దాటి
పత్రాల మీద బొటనవేలు గుర్తులై
తలతాకట్టు పెట్టి పొలం తాకట్టు కాకుండా
ఆలి మెడలో సరం మాయంగాకుండా చూసేందుకు
కాలుగాలిన పిల్లిలా ప్రదక్షిణలు చేసాడు ...

అప్పుడప్పుడూ వాన మెరుపుల్లో
వజ్రాలు బయటపడే భూములు తనవి
తాతల తండ్రుల కాలంగా తిరగమర్లె దున్నుతున్నా
మెట్ట ఎవసాయంలో ప్రతిఫలంగా
ఒక్క రంగురాయైనా కంటపడని అదృష్టాలు వాళ్లవి!

నెత్తిమీద మోతైన అప్పుల
ఈగలు తోలుకుంటూ
ఆటోడ్రైవరైన అవతారం అతడిది.
రంగు వెలసిన ఖాకీచొక్కా లాగా
చిరుగులు పడ్డ బతుకు
నెత్తిమాసినోడనే బిరుదిచ్చింది.
ఖర్చులకూ ఆదాయానికీ కుదరని లంకె
చేతగానివాడనే హెూదానిచ్చింది.

రవ్వల భూముల దున్నకం
ఇద్దరు వజ్రాల వంటి పిల్లల భవిష్యత్తు
పండించలేకపోయింది
డీజిల్‌కి గిట్టుబాటు కాని
ఆటోడ్రైవర్ తనం నగుబాట్ల పాలైంది

అన్నమే కావాలంటే రేషన్ కార్డుంది
కూరకు కావాలని కూలీకి దిగాలంటే
ఉపాధిహామీ మేటితనం రానివ్వనంది
పొదుపు సంఘంలో భార్యకిచ్చిన అప్పు
కంతుకింతగా తీర్చలేని అవమానమైంది!

ఇంత ఘనమైన బతుకు నలభై రెండేండ్లు
బతకడం ఎంత గొప్ప!
నిండు నూరేండ్లు నిండంచడానికి
ఇంతకు మించి యేం కావాలి అర్హత?

నవ్విన నాపచేను కోసం
రెక్కలు ముక్కలు చేసుకునే సీమవీరుడికి
రాజకీయాలు తెలుసు, ధర్నాలు తెలుసు
బతుక్కూ పోరాటాలకూ సంధి కుదరని
వైనమూ తెలుసు!

విరగపండే పొలాల కోసం
వేయి కలలు కనే మెట్టరైతుకు
భారాలు తెలుసు బంధాలు తెలుసు
తప్పించుకోలేని నిష్టరమైన నిజాలు చాలా పెలుసు!
ఆశలూ ఆకాంక్షలూ
కలలూ వాస్తవాలూ
సమాంతరంగా సాగే రైలు పట్టాలైనపుడు
పతాలుమని అవి పిలిచేను ఆహ్వానాలే
నెపాలు ఎవరి మీద వేయాలో
తెలియని గుంజాటనలో
తన్ను తాను బలి చేసుకోవడాలే ...!

రేప్పొద్దున రాజ్యం నడిపే
పరిహార నాటకంలో పరిహాసమయ్యే అతడు
రేపటి కార్తెల పిల్లల కళ్లల్లో
చిగిర్చే ముంగారు మోసుల్లో
కెంపు దళపత్రమవక తప్పదు!

**(కర్నూలు జిల్లా పత్తికొండ ప్రాంతంలో
ఒక రైతు ఆత్మహత్య పాలైన దుఃఖంలో...)**

**- జి.వెంకటకృష్ణ**
**89850 34894**

# దు:ఖపు సంధ్యలో ...



**అ**ప్పటివరకూ ..
గంపకింద కోడిపిల్లలా
హాస్టల్ జైలుగదిలో చిక్కిపోయిన అడవిమల్లె
ఒక్కసారిగా మితిమీరిన స్వేచ్ఛకు
ప్రతిబింబమవుతుంది
చదివిన చదువు జ్ఞానమివ్వదు
నమ్మిన పోడు బతుకునివ్వదు
కొండల్ని చుట్టేసిన కల్చర్ గాలికి
పట్నం తీరాలవేపు కొట్టుకుపోతుందీ బొండుమల్లె !

పట్నం ...
బంగారు కాంతులీనే ఒక పులి గుహ
దిగితే బయటకు రాలేని రంగురంగుల ఊబి
ఉద్యోగం పేరుతోనో .. ఉపాధి పేరుతోనో .. ఆమె
ఈ పట్నం పరాయిపంచన బతుకుతూ ..!

చిగురాకు మీద చినుకుబొట్టులాంటి
తనదైన నిర్మలత్వాన్నీ
సహజత్వాన్నీ కోల్పోయిన కన్నెమొగ్గ
ఇంటి గడపకు ఎర్రమన్ను పూసినట్టు
లేత పనసాకు పెదాలకు లిప్ స్టిక్ పూస్తుంది
పసుపు గంధాల పిడతల్ని కాలదన్ని ..
అడవికొమ్మకు వేలాడే
పున్నమి చందమామలాంటి మోముకు
గోడకు సున్నం మెత్తినట్టు
పేడించిన ఫెయిరెవర్ క్రీం మెత్తుతుంది
సైబర్ వనాలమీద ఒంటరి సీతాకోకై ఎగురుతూ
కలల ప్రపంచపు అలల గాలిమాటలలో తేలీ తూలీ ..
ఒంటిమీద ఉల్లి పొరలారేసుకొనీ
ఊహల సవ్వారిలో ఊరేగుతుంది !

ఒక వారం సెంటు వాసన
మరో వారం పౌడర్ వాసన వేసే ఆమె
పార్కుల్లోనో .. పబ్లోనో .. మల్టీప్లెక్స్ మాల్స్లోనో ..
అబద్ధాల బతుకులో అద్దాల బొమ్మలా మెరుస్తూ ..
వాడెవడో విసిరిన చూపుల ఎరకి చేపలా చిక్కిపోతుంది
కొండమేక కసాయి నక్కను నమ్మినట్టు ...
వాడ్ని నమ్మీ .. మోహపు తెరలమాటున
తన దేహపు తాళాల గుత్తినందిస్తుంది
దోచుకున్నంత దోచుకున్నాక దొంగలా వాడెళ్లిపోతాడు
అంతే .. !
నిన్నటి కల కన్నీటిలో కరిగిపోతుంది
ఫేషియల్ మేకప్ పొరలు పొరలుగా రాలిపోతుంది
మాయ చెదిరిపోతుంది
కళ్లముందు వాస్తవం కడుపున కనబడుతుంది
కోరుకోని వరాన్ని గర్భాన మోస్తున్న
కుంతీకుమారిలా కుమిలిపోతుంది
ఎవడో తాగిపారేసిన ఎంగిలి సీసాలా వీధిన పడుతుంది !

పురిటి వాగునీదలేక ..
పుట్టిన బిడ్డకు బీజమేసిందెవడో చూపలేక ..
కడుపులో పిండాన్ని కత్తుల కప్పగించీ
నెత్తురోడుతున్న మోదుగు మొజ్జయి
తిరిగి గూడేనికి చేరుకుంటుంది
వచ్చే బిడ్డను ఒడిలో పొదుముకొనీ .. అంతటి అడవి
రెల్లు పూలకన్నీళ్లు కారుస్తుంది ఒక దుఃఖపుసంధ్యలో ..!

- సిరికి స్వామినాయుడు
94940 10330



# కేతు విశ్వనాధ రెడ్డి తొలి నాటి కథలు

- కె.పి.అశోక్ కుమార్
97000 00948

**క**థకుడు, విమర్శకుడు, పరిపాలనా దక్షుడు, అరసం మాజీ అధ్యక్షుడిగా ప్రసిద్ధిగాంచిన కేతు విశ్వనాథ రెడ్డి కడప జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని రంగశాయి పురంలో 1939 జూలై 10న జన్మించారు. పాత్రికేయుడిగా వృత్తి జీవితం ప్రారంభించి, తర్వాత అధ్యాపక వృత్తిలోకి ప్రవేశించారు. 1962 నుంచి 1976 వరకు ప్రభుత్వ కళాశాలల్లో పనిచేశారు .శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో 1983 వరకు,అంబేద్కర్ వర్సిటీలో 1997 వరకు పనిచేశారు. పాఠ్య పుస్తకాల రూపకల్పనతో పాటు ప్రముఖ పత్రికల్లో పనిచేసే పాత్రికేయులకు శిక్షణ ఇవ్వడం లోనూ కీలకపాత్ర వహించారు. ఉద్యోగ విరమణ అనంతరం కడపలో స్థిరపడ్డారు. 22.5 .2023 ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు.

కేతు విశ్వనాథ రెడ్డి సహృదయులు,స్నేహశీలి. హోదాల వల్ల, పదవుల వల్ల వచ్చే అధికారాన్ని పక్కనపెట్టి అందరితో ఆత్మీయంగా మసులుకునే మనిషి. ఎవరిలోనైనా ఏమాత్రం స్పార్క్ కనిపించినా గుర్తించి అభినందిస్తారు. తర్వాత ఎప్పుడో కలిసినప్పటికీ గుర్తుంచుకొని పలకరిస్తారు. చాలామందికి చాలా రకాలుగా సహాయం చేసిన గొప్ప మనసు ఆయనది. అలాంటి విశిష్ట వ్యక్తిత్వం కలిగిన మనుషులు మనకు చాలా అరుదుగా కనిపిస్తారు.

కేతు విశ్వనాథ రెడ్డి అనగానే విరూపం, పీర్ల సావిడి, వాన కురిస్తే, కూలిన బురుజు, అమ్మవారి నవ్వు లాంటి కథలు వెంటనే జ్ఞాపకం వస్తాయి. ఆయన రాసిన మొత్తం కథలు జప్తు, కేతు విశ్వనాథరెడ్డి కథలు, ఇచ్ఛాగ్ని అనే మూడు సంపుటాలుగా వచ్చాయి. వేర్లు, బోధి అనే నవలికలను వెలువరించారు. 'దృష్టి' పేరుతో సాహిత్య వ్యాసాలు, ముందు మాటలు, పరిచయాలు పుస్తకాలుగా వచ్చాయి. 'కడప జిల్లా ఊర్ల పేర్లు' అనే పరిశోధనా గ్రంథం ఎప్పటికీ నిలిచిపోతుంది. అది తర్వాతి పరిశోధకులకు దారిదీపంగా ఉంటుంది. సముద్రం లాంటి కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యాన్ని వింగడించి, విభజించి సంకలనాలుగా తీసుకు రావడంలో విశేషమైన కృషి చేశారు.

వారి మొదటి కథ సంకలనం 'జప్తు'. ఇది అభ్యుదయ రచయితల సంఘం, కడప వారు 1974లో ప్రచురించారు. వీటిని కేతు రాసిన తొలినాటి కథలుగా గుర్తించవచ్చు. ఇందులో మొదటి కథ 'అనాదివాళ్లు'. ఇది 1963లో సవ్యసాచి పత్రికలో ప్రచురితమైంది. ఇందులో అభ్యుదయవాదికి, సంప్రదాయవాదికి మధ్యనున్న ఘర్షణను సంవాద రూపంలో, అత్యంత చాక చక్యంగా చిత్రించారు. దేశంలోని చాందసత్వాన్ని, మౌఢ్యాన్ని, అజ్ఞానాన్ని ఎదుర్కునే శక్తి లేదు రాజశేఖరానికి. అందుకని పైవాటికి ప్రతినిధి అయిన ఆచార్ల మీదికి దండెత్తుతుంటాడు మాటిమాటికి. బలం కలవాడిదే రాజ్యం అనే అభిప్రాయంతో మన నాగరికత, మన చరిత్ర మొదలైంది. గణ సమాజం నుండి రాచరిక వ్యవస్థ, అక్కడి నుండి ప్రజాస్వామ్యం వరకు మనం ప్రయాణించినా– అది ఎక్కడికక్కడ మనుషులను ఉన్న వాళ్లుగా, లేని వాళ్ళుగా విభజిస్తూనే వస్తుంది. లేని వాడు ఉన్నవాడిపై తిరగబడనీయకుండా మతం, దైవం, కర్మ అనే భావనలను సృష్టించారు. వాటిని వ్యాపింప జేయడానికి

పురోహిత వర్గం ఏర్పడింది. దాని ప్రతినిధిగా ఆచారిని భావించుకొని రాజ గోపాల్ తార్కికంగా, హేతుబద్ధంగా అతనిపై విరుచుకుపడటం ఈ 'అనాదివాళ్లు' కథలో కనిపిస్తుంది.

కూలి పని చేసుకుని బతికే గంగి, పిల్లలకు కడుపునిండా తిండి పెట్టలేని పరిస్థితి. దారిద్ర్యంతో, ఆకలితో తిండికి మొహం వాచిన పిల్లలు. పిల్లవాడు ఎంతో బతిమిలాడి తెచ్చిన పాలపొడి, పిల్లల కడుపు నింపిందనే సంబరం, కొద్ది గంటలలోనే ఆవిరై పోతుంది. ఆ కల్తీ పాలపొడి ధాటికి పిల్లలు వాంతులు, విరేచనా లతో అవస్థలు పడి చచ్చిపోతారు. ఈ హృదయ విదారకమైన సంఘటన 'శిలువ వేసిన మనుషులు' కథలో చూడవచ్చు. బస్సులో వెళుతున్న చెన్నమ్మ అంతకుముందు దిగిన కడప బస్సులో తన దాపుడుకోక ఉన్న బట్టల మూటను మరిచి పోయానని గుర్తుకువచ్చి, కేకలు వేసి గలభా చేసి ఆ బస్సును ఆపించి, తిరిగి కడప బస్టాండుకు వచ్చి తను దిగిన బస్సును గుర్తించి, అందులో వెతికితే బట్టల మూట కనిపించదు. ఎవరో ఎత్తుకుపోతారు. అంతలో ఒక తాగుబోతు వాడి చేతిలో కనిపించిన ఎర్ర చీరను గుర్తించిన తండ్రీ కూతుళ్లు వాడి దగ్గరకు పోబోతారు. డబ్బుల విషయంలో సారా కొట్టు వాడికి, ఆ తాగు బోతుకు జరిగిన పెనుగులాటలో చీర చినిగి ముక్కలవుతుంది. దాంతో చెన్నమ్మ ఆశలు, కలలు అన్నీ ముక్కలవుతాయి. వాళ్లది కానీ చెన్నమ్మ కోకను వాళ్లు నిర్దాక్షిణ్యంగా చించిపారేశారు. కిందపడిన పీలికలని పట్టుకొని, 'నా కోక.. నా దాపుడు కోక' అనే చెన్నమ్మ ఏడుపుతో కథ ముగుస్తుంది.

కలుపు తీయడానికి పోయి, నిమ్మ చెట్లలో పాదులు తవ్వడానికి పోయి, కష్టపడి డబ్బు కూడబెట్టుకుని కొనుక్కున్న కోకను చిన్నమ్మ ఎంత అపురూపంగా ప్రాణంగా చూసుకుందో తెలిస్తే తప్ప, ఆమె దు:ఖాన్ని మనం అర్థం చేసుకోలేము. ఇంకో వైపు బస్సులో పడిన అవమానాన్ని తలుచుకుంటూ, నడిచి వచ్చిన శ్రమను అనుభవిస్తూ, మరొక చీర అట్లాంటి చీర కొనలేని దరిద్రాన్ని తలపోసుకుంటూ, అల్లుడేమనుకోకుండా అట్లాంటిదే మరొక చీరను కూతురుకు ఎలా తెచ్చివాలో తెలియక, మథన పడే తండ్రి వీరయ్య బాధను కూడా ఈ 'దాపుడుకోక'లో చిత్రీకరించారు. ఆకలి, దారిద్ర్యం బతుకులను ఎలా చిందరవందర చేస్తాయో ఈ రెండు కథలు వివరిస్తాయి.

అప్పుల ఊబిలో కూరుకొని పోయిన మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాడు భాస్కరం. పెళ్లికి కావల్సిన చెల్లెండ్లు తప్ప, దినదినానికి కరిగిపోయే ఆస్తిని పంచుకోవడానికి నలుగురు సోదరులు తప్ప, తమ దారిద్ర్యాన్ని పెంచే సారహీన మైన భూములు తప్ప ఇంకా ఏమీ లేవు. అప్పులతో బాధపడు తున్న తండ్రి, భాస్కరానికి పెళ్లి చేసి ఆ వచ్చే డబ్బుతో అప్పులు తీరుస్తానంటే ఒప్పుకోక తప్పలేదు. తన డిగ్రీ, మధ్య తరగతి పేదరికం, మనస్సు... అన్నీ అమ్ముకున్నాడు. తనను పది వేలు ఇచ్చి కొనుక్కున్న మామగారు, డబ్బు కోసం అడ్డమైన గడ్డి తినే నీచుడని తెలిసినా ఒప్పుకోక తప్పలేదు. తన భార్య అనాకారి అని తెలుసు. అనాకారి అయినందువల్లే పది వేలు తెచ్చింది.

పెళ్లవుతుంది. మొదటి రాత్రి పడక గదిని చూసి భాస్కరం దిగ్భ్రాంతి చెందుతాడు. ఆ గదిలో గాలి రాదు. భరింపరాని ఉ క్క, దుర్భరంగా ఉంటుంది. ఆ మూడంకనాల గదిలో వేరు శనక్కాయ మూటలు, పత్తి , వ్యవసాయ సామగ్రి, చుంచు బండల మీద కుండల దొంతరలు, ట్రంపులు, డబ్బాలు, తమకు వేసిన మంచం పక్కనే బీరువా, పైగా ఇన్నింటిని చూస్తూ సహిస్తూ ... భరించలేక పోతాడు. చీకటి తప్పు అంటే బహుశా ఇట్లాంటి గుహలోని చేసేది కాబోలు. దీన్ని గది అనడం కంటే గుహ అనడమే బాగుంది. తాను కూడా ఈ గదిలో జంతువు కావాలి. పోనీ, జంతువు లాగా ప్రవర్తించాలి. ఇంతకుముందు ముక్కు ముఖం ఎరగని ఆడ జంతువుతో పడుకోవాలి. మనిషిలో ఇప్పటికీ పశువుల కంటే హీనంగా కోర్కెల్ని తీర్చుకునే గుణం ఉందా? తన విజ్ఞానం, ఉన్నతాదర్శాలు ఏమయ్యాయి? ఒక్కసారి దుమ్ములో కలిసిపోయాయి. జీవితంలో తన కలలు కూలిపోయాయి. ఇక ప్రయోజనం లేదు. ప్రేమల్ని, ఇష్ట నిష్టాల్ని అధిగమించే మృగత్వాన్ని శాసించలేకపోయాడు. వసంతని మాత్రమే హృదయంలో పదిలపరుచుకున్న తాను, ఏ సంస్కా రమూ లేని, తనకిష్టం లేని వెంకటమ్మను అనుభవించ గలడు, కేవలం శరీరం ఆదేశిస్తే. ఎక్కడినుండి ఎక్కడకు తాను చేరు కున్నాడు? 'తన మీద ఎవరైనా సానుభూతి చూపిస్తే బాగుండు. తనను ఎవరైనా ఓదారిస్తే బాగుండు. తనను గాఢంగా ప్రేమించే వాళ్ళెవల్ల ఒళ్లోనన్నా తలవుంచి ఏడుస్తే బాగుండు. పోనీ తన తల ఇట్లానే ఈ క్షణంలో వేయి ముక్కలైతే బాగుండు.' అని ఇష్టం లేని పెళ్లి చేసుకున్న భాస్కరం బాధను, అంతర్మథనాన్ని ఈ 'చీకటి తప్పు' కథలో అద్భుతంగా చిత్రీకరించారు.

చాలీ చాలని జీతంతో బడిపంతులు వెంకటరత్నం దుర్భర జీవితాన్ని 'చెదిరిన గుండెలు' కథ తెలియజేస్తుంది. సొంత ఊరికి దగ్గరలో ఉండే జిల్లా కేంద్రంలో అణాకాని ఉద్యోగం చేయడం అంత బుద్ధి తక్కువ ఏమీ లేదు. పార్టీల వాళ్లు ,రోగాల వాళ్ళు, ఆఫీసుల్లో పనులవాళ్లు, కాలేజీలో సీట్ల వాళ్లు అందరూ మీద పడతారు. అర్ధరాత్రి కూడా తలుపు తడతారు. వాళ్లకు కాఫీలు, టిఫిన్లు, భోజనాలు అమర్చాలి. వచ్చిన వాళ్లతో ఆఫీసుల వెంట ,ఆస్పత్రుల వెంట, అడ్డమైన గాడిదల వెంట తిరిగి రకరకాల సేవలు చేయాలి. వాళ్లను వెళ్ళగొట్టలేడు. మర్యాద

కోసం, కుటుంబ గౌరవం కోసం వాళ్లను భరించక తప్పదు. అందుకోసం అప్పులు చేసైనా తన మర్యాదను కాపాడు కోవాలి. చివరకు అభిమానాన్ని చంపుకొని కిరాణా కొట్టు వాడు చేసే మోసాన్ని, దోపిడిని గుర్తించి కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో బియ్యం అప్పుగా తీసుకువస్తాడు. మర్యాద కోసం, పరువు కోసం అప్పులు చేస్తూ , అవమానాల పాలవుతూ బతుకీడుస్తున్న మధ్య తరగతి జీవితాలకు ప్రతిబింబాలుగా ఈ రెండు కథలు నిలుస్తాయి.

ఒకప్పుడు బాగా బతికిన గౌరవ కుటుంబానికి చెందిన రైతు– క్రమంగా ఆస్తి కరిగిపోయి అప్పులు చేయక తప్పని పరిస్థితి. అయినా ఆశ కొద్దీ అప్పుచేసి బావి తవ్వించాడు. నమ్మకం కొద్ది నిమ్మ చెట్లు వేసినాడు. కానీ ఆశ చెడ్డది. ఆశ అన్యాయం చేస్తోంది. నమ్మకం చెడ్డది. నమ్మకం ముంచు తోంది. వానలు లేవు. అన్ని బావుల్లో మాదిరే ఈ బావిలోనూ నీళ్లు లోతుకు, ఇంకా లోతుకు పోతున్నాయి. ఎక్కడికి పోతున్నాయో? నిమ్మ చెట్లే కాస్తే చేసిన అప్పులు ఒక లెక్క కాదు. తన ఆశ, నమ్మకం నెరవేరే విషయం ఏమో కానీ అప్పుల దయ్యం తన్ను పట్టుకుంది. ఏదో దశలో అప్పులు చేయనిది ఎవరు? భూమిని నమ్ముకున్న వాళ్లు ఎవళ్లూ బాగుపడరు. ఎప్పుడూ బాగుపడరు. వానలు అదునులో వస్తే బాగుపడతారు. వాన కోసం ఎదురుచూస్తూ, వాన కురవాలని అహర్నిశలూ కలవరించే పాపయ్య ఒకవైపు– అడ్డమైన నీచపు పనులు చేసి డబ్బు గడించి ముచ్చోడ్డికి (నూటికి ఐదు రూపా యలు) అప్పులు ఇచ్చే రామిరెడ్డి లాంటి వాళ్లు, సాగునీటి అవసరాలను పట్టించుకోని రాజకీయ నాయకులు, రాజకీయాలతో కొట్టుకునే గ్రామ రాజకీయాలు అన్నింటినీ ఈ కథలో ఇమిడ్చిన తీరు ఆకట్టుకుంటుంది. వాన కోసం కలవరించిన పాపయ్య హఠాత్తుగా గుండె ఆగి చనిపోతాడు. తండ్రి బాధ్యతలను తీసుకున్న కొడుకు మల్లయ్య ఒకరోజు తోటలోకి పోయినప్పుడు 'నాయన పోయినాక ఒక వాన వచ్చింది. ఇంకొక మంచి వాన కురిస్తే ఈ మిరప చెట్లకు కాయ బాగా పడుతుంది. ధరలున్నాయి. శనక్కాయతీగ బాగా సాగుతుంది. ధరలు పెరుగుతున్నాయి. నిమ్మ చెట్లకు పూత వస్తుంది. రెండు మూడు లారీలు కాస్తాయి. బావిలో నీళ్లు సరిపోతాయి. అన్ని కుదిరితే ఏముంది? బాకీలు సుమారుగా తీర్చవచ్చు. బాకీలు ఎంత బాధ. బాకీలు తీర్చాలి. బావిలోకి చూస్తూ, ఆకాశం వైపు చూస్తూ, ఆ మధ్య వచ్చిన ఒక వానతో బతకలేక చావలేక అవస్థ పడుతున్న మిరప చెట్లను చూస్తూ, నీరెత్తని నిమ్మ చెట్లను చూస్తూ అనుకున్నాడు.. 'ఒక్క వాన కురిస్తే, 'మరొక్క వాన కురిస్తే'...

ప్రభుత్వ అనాలోచిత విధానాలు రైతులను ఎలా ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల కబంధ హస్తాల వైపుకు నెడుతున్నాయో 'జప్తు ' కథ వివరిస్తుంది. పదేళ్ల నుండి పంటలు సరిగా పండటం లేదు. అప్పులు మాత్రం పండుతున్నాయి. ఈ ఏదు విత్తనం ఖర్చులు కూడా ఎల్లలేదు. సంగటి గింజలు కూడా కొనాల్సిన రోజులు వచ్చినాయి. ఆఖరుకు పశువులకు మేత కూడా కొనాల్సిన చెడ్డ రోజులు దాపురించినాయి. ఇంకెక్కడ బయానా బాకీ తీర్చడం? గవర్నమెంట్ ఏదో అప్పిస్తామని ఎరచూపడం ఎందుకు? ఏడిపించడం ఎందుకు? బకాయిలు కట్టకపోతే జప్తు చేస్తామని ప్రకటన వస్తుంది. ఊరంతా గందరగోళంగా ఉంటుంది.

అప్పు కోసం గంగయ్య, అంకిరెడ్డి దగ్గరకు వెళితే నువ్వు కొన్న కోడెలను కొన్న ధరకే తనకు అమ్మివేయమని అడుగుతాడు. ఆ మొత్తంలోంచి పాతబాకి తీర్చి వేసుకుంటే, మిగిలిన కొంత డబ్బు చేతిలో పడుతుంది. దాంతో జప్తు గండం గడుస్తుంది. ఇంటి గౌరవం నిలుస్తుంది. ఒక వారం రోజులు చూసి తక్కువ ధరలో ఒక దేశపెద్దుల కాడి కొనుక్కుంటే సరిపోతుంది. డబ్బు తక్కువ పడితే అంకిరెడ్డి రూపాయిన్నర వడ్డీకే డబ్బు ఇస్తానంటాడు. ఒప్పుకున్న గంగయ్య తాను అంకిరెడ్డి పన్నిన ఉచ్చులో ఇరుక్కున్నాననే సంగతి గుర్తించడు. పాత అప్పులు పోయి కొత్త అప్పులు వస్తుంటాయి. కానీ రైతు ఆస్తులను పోగొట్టుకుంటున్నా అప్పులు మాత్రం మిగిలే ఉంటున్నాయి. ఈ చక్ర భ్రమణం ఇలా కొనసాగాల్సిందేనా అని 'జప్తు' కథ ప్రశ్నిస్తుంది.

చదువు, ఉద్యోగం, జీవితం అన్నీ కలుషితమైన రోజులివి. ఫారెస్టు ఆఫీసర్‌గా పని చేసే కేశవరావు ఉద్యోగ బాధ్యతా నిర్వహణకు, ఆ బాధ్యత నిజాయితీగా నిర్వహిస్తే తీసుకొచ్చే బాధల పరంపరలకు మధ్య నలిగిపోతుంటాడు. తన ఆదర్శాలు దినదిన గండంగా తయారయ్యాయి. తన నీతి నిజాయితీలు సుడిగాలిలో దీపాలయ్యాయి. ఇవ్వాళ కాకపోయినా రేపైనా తాను దిగజారక తప్పని పరిస్థితులు కనిపిస్తూనే ఉంటాయి. దీనికి అంతం ఎక్కడ? ఎదిరించలేని అశక్తతలో ఫారెస్ట్ ఆఫీసరుగా తండ్రి కేశవరావు, భ్రష్టు పట్టిపోతున్న పాఠశాల విద్యా విధానానికి నిదర్శనంగా కొడుకు సాగర్‌ను చూపిస్తూ రచయిత, వాళ్లనే కాదు మనల్ని కూడా 'చక్రబంధం'లో ఇరికించేశారు.

'వైరుధ్యం' కథలో, కొడుకు చావుతో అవినీతిపరుడైన బిడిఓ దామోదరం పడిన వైరాగ్యాన్ని చూసి, అతడు మారాడని గోపాలం అనుకుంటాడు. నరమాంసం మరిగిన పులిలో మార్పు వస్తుందా? దేశంలో మానవత్వం ఇంకా మిగిలి ఉందని

గోపాలం పొరపాటు పడ్డాడు. తాను సెంటిమెంటల్ ఫూల్. తన సెంటిమెంటలిజం, తన సృష్టించే సాహిత్యం సమాజానికి ప్రమాదకరం. దామోదరం మనస్తత్వం లోని వైరుధ్యం ఎంత అమానుషమైంది. దామోదరంలో నిండిన ఈ వ్యవస్థ ఎంత పాశవికమైంది అని ఆలోచిస్తూ గోపాలం తల్లడిల్లిపోతాడు.

హైక్లాస్ సొసైటీ మనుషులు తప్పు చేసినా, నేరం చేసినా, కింది నుండి పై వరకు ఉన్న అధికారులను మంచి చేసుకుని ,అందులో నుండి సులభంగానే బయటపడగలుగుతారు .అమాయకులు, దిక్కుమొక్కు లేని జనాలను 'సమిధ'లుగా వాడుకొని, వాళ్ల జీవితాలను దగ్ధం చేస్తుంటారు. అధికారులు, రాజకీయ నాయకుల ప్రోత్సాహంతో స్వార్థం, అవినీతి పెచ్చరిల్లి క్రమంగా అవి సహజమే అన్న స్థితికి, మనల్ని తీసుకువచ్చే ప్రమాదం ఉందని ఈ మూడు కథలు హెచ్చరిస్తాయి.

ఈ కథల్లో మాండలిక పదబంధాలతో కూడిన వాక్య నిర్మాణం పాఠకులను ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. ఉ దాహరణకు :

1. దంతెల్లోంచి మట్టి బెట్ట రాలింది.
2. వాన కురిస్తే మిరపకు పులక అవసరం.
3. మోడం కూడా దండిగా ఉంది
4. 'పైన గవాసులు అవీ వేయించినావా? గుమ్మళ్లేమన్నా పడ్తాయేమో! మిద్దె మీద సవుదుంది కదా!'
5. గాటిపాటి కోడెలు తలలు ఎగరేసినాయి.
6. 'లేకపోతే ఎద్దులు చావడమూ తన కమాషిలోనే జరగాలా? ముదెబ్బ కాలంలో ఇట్లాగే ఎద్దుల మీద ఎద్దులు చచ్చిపోయాయంట. దాంతో ముదెబ్బ బీజాక్షరాలు చెక్కించిన బండ గాట్లో వేయించినాడు'
7. ఇప్పుడేమో పనులు కసాలగా ఉన్నాయి.

ప్రాంతీయతను పొదుపుకున్న భాషా నిర్మాణంతో కూడుకున్న ఈ కథలు, పాఠకులను అలరిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఈ కథలు 1963 – 1973 మధ్య కాలంలో రాసినవి. ఇందులోని కథలన్నీ మధ్యతరగతి జీవితాల చుట్టే తిరుగుతాయి .రచయిత తన చుట్టూ ఉన్న, తనకు తెలిసిన మనుషులని పాత్రలుగా చేసుకొని ఈ కథలను సృష్టించారు. 60వ దశకంలోని ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఈ కథలు ప్రతిబింబింప చేస్తాయి. దోపిడీ స్వభావాన్ని, రకరకాల రూపాల్లో కొనసాగుతున్న దోపిడి విధానాలను కేతు ఈ కథల్లో బట్టబయలు చేశారు. సజీవంగా ఉన్న అభ్యుదయ ధోరణులకు ఈ కథలు తార్కాణంగా నిలుస్తాయి.

■

# మా ఇంటెదుటి ఊర బావి

**ఊ**రి నడిమధ్యలో మా ఇల్లు
ఇంటెదురుగా ఊరబావి
నేలమట్టానికి బారెడుదూరంలో
నీటితో తొణికిసలాడుతూ ఉండేది
బ్రహ్మండమైన దూదిపింజల నీలిఆకాశాన్ని

తనలో దాచుకుని తొణకనికుండలా ఉండేది
ఎన్నిసార్లు ఊరబావిలోకి తొంగిచూసినా
ఏదో ఒక దృశ్యంతో నాకళ్ళు మెరిసేవి
పచ్చటి రామచిలకలూ తెల్లటి పావురాలూ
బావిలోని ఆకాశంలో ఈదుతూ ఉండేవి
పాచిరంగు పులుముకున్న కోరమేన్లు రెండు
నీటిఉపరితలం కింద దోబూచులాడుతూ ఉండేవి
ఏనుగురంగు తాబేలొకటి
డిప్పను బరువుగా మోస్తున్నట్టుగా
నాలుగు పాదాలను రెక్కలుగా చేసుకుని
పైకి తేలివచ్చి నన్ను పలుకరించి
గిరుక్కున పూటిదిశగా తుర్రుమనేది
బాయిలబండపై గడ్డం ఆన్చి
బావిలోకి తొంగిచూసిన ప్రతిసారీ
నాలో తనివితీరని తన్మయత్వం ఆవహించేది
బావి ఉపరితలం ఒక్కోసారి
నీటి అద్దమై మిరిమిట్లు గొలిపేది
అ అద్దంపై గులకరాయి విసిరితే
అలల వలయాలు ఆవిష్కృతమయ్యేవి
ఎవరు జారవిడుచుకుని ఉంటారో గానీ
నీళ్ళ అడుగున మెరిసే రూపాయిబిళ్ళ
ఆకాశం నుదుటిన వెండిబొట్టై మెరిసేది
ఎవరివో చెంబు, తపేలా..ఒక పగిలిన కుండ
నిస్సహాయంగా నీటి అడుగున రోదిస్తూ ఉండేవి
పూటిలో తిరుగుతున్న ఇసుక దందొకటి
గాలి బుడగలను ఆకాశంలోకి ఎగరేస్తూ ఉండేది
ఊరందరికీ దప్పిక తీర్చిన ఊరబావి
నా బాల్యపు పంచరంగుల జ్ఞాపకమై నిలిచింది!

**– తవ్వా ఓబుల్ రెడ్డి**
**9440024471**



# కెప్టెన్ అశోక్

- మల్లారెడ్డి మురళీ మోహన్
88611 84899

రేపే మా అశోక్ పుట్టినరోజు. చదువుకునే రోజుల్లో మా గ్యాంగ్ చాలా పెద్దదే అయినా ప్రత్యేకించి నేనూ, రాజేష్, నాగేంద్ర, అశోక్ మరింత క్లోజ్ గా ఉండేవాళ్లం. వాడి పుట్టిన రోజున ఎన్ని పనులున్నా, ఎక్కడున్నా అన్నీ వదిలేసి మా ఊళ్లో కలుసుకోవడం మాకలవాటు. రెండొందల కిలోమీటర్ల దూరమే కాబట్టి కార్లోనే బయల్దేరాం నేనూ, ఆరేళ్ల పాప ప్రేరణ.

సాయంత్రానికి ఇంటికి చేరుకున్నాం. వాకిట్లోనే నించుని ఎదురుచూస్తున్నారు అమ్మా, నాన్న. కారు దిగుతూనే వాళ్ల దగ్గరికి పరిగెత్తుకెళ్లింది ప్రేరణ. పాపని గట్టిగా గుండెలకి హత్తుకుంది అమ్మ కన్నీళ్లు నాకు కనబడకుండా జాగ్రత్త పడుతూ. ఇంట్లోకి అడుగుపెడుతూనే హాల్లో గోడ మీద ఫోటోకేసి చూసి కళ్లజోడు తీసి కండువాతో కళ్లు తుడుచుకుని లోపలికెళ్లిపోయారు నాన్న. నాన్నమ్మ, తాతయ్యలతో గుక్కతిప్పుకోకుండా ప్రేరణ కబుర్లు చెబుతుంటే వాళ్లిద్దరూ మురిసిపోతున్నారు. ఊళ్లోకొచ్చినట్టు రాజేష్, నాగేంద్రలిద్దరికీ ఫోన్ చేసి చెప్పాను. రాత్రి నిద్రపోయే ముందు నా దగ్గరకొచ్చింది ప్రేరణ. పాపతో కబుర్లు చెబుతూ, దాని యక్ష ప్రశ్నలకు జవాబులు చెప్పే క్రమంలో ఆలోచనలు గతంలోకి జారిపోయాయి.

❖ ❖ ❖

చిన్నప్పటి నుండి విడదీయరాని స్నేహం మా నలుగురి మధ్యా ఉంది. మాది వ్యవసాయ కుటుంబం. కూలీల్ని పెట్టి వ్యవసాయం పనులు చూసుకునే నాన్నకి నన్నో పెద్ద ఉద్యోగిగా చూడాలనుండేది. అందుకు తగ్గట్టే నేను కొన్నాళ్లు బ్యాంక్‌లో ఉద్యోగం చేసి అది వదిలేసి సాఫ్ట్‌వేర్ రంగంలోకి మారి అన్ని విధాలా స్థిరపడ్డాను. రాజేష్ వాళ్ల నాన్నగారు మా ఊరికి ఏకైక లాయర్. స్థిర, చరాస్తులతో పాటు తన వకీలుగిరీ కూడా ఏకైక సంతానమైన రాజేష్‌కి వారసత్వంగా అప్పగించాలన్న అతని కోరికని కొడుకు అన్యమనస్కంగానైనా తీర్చాడు. మొదట్లో కాస్త ఇబ్బంది పడ్డా తర్వాత క్రమంగా ప్రొఫెషన్‌లో కుదురుకున్నాడు రాజేష్.

నాగేంద్ర వాళ్లది వ్యాపార కుటుంబం. సహజంగానే నాగేంద్ర తన వ్యాపార వ్యవహారాలు చూసుకోవాలన్నది వాళ్ల నాన్న కోరిక. తదనుగుణంగానే నాగేంద్ర ఎంబీయే చదివి వాళ్ల నాన్న వ్యాపారాన్ని ఇంకా వృద్ధిలోకి తీసుకొచ్చాడు. ఇక అశోక్ విషయానికొస్తే... వాడిదంతా ప్రత్యేక ధోరణి. వాళ్ల నాన్న గారు మా స్కూళ్లోనే టీచర్ గా పనిచేసేవారు. మా అందరి ఆలోచనలకి భిన్నంగా వాడికి మాత్రం సైన్యంలో చేరాలని ఉండేది. ఆ మాటకొస్తే యూనిఫాం తొడుక్కునే ఏ సర్వీసైనా వాడికి చాలా ఇష్టం. సైన్యంలో కాకుంటే పోలీస్ ఆఫీసర్నయినా అవుతాననేవాడు. దారిలో ఎక్కడైనా పోలీస్ వాళ్లు కనబడితే వాళ్ల యూనిఫాం వంక ఎంతో ఆశగా చూస్తూ నిలబడిపోయేవాడు. యూనిఫాం అంటే వాడికంత ఆరాధనా భావం. మా మాస్టారు కూడా వాడి అభీష్టానికి ఎప్పుడూ అడ్డుచెప్పలేదు. అలా అశోక్ ఆర్మీలో చేరి తన కలల యూనిఫాం సంపాదించుకున్నాడు.

అశోక్ మినహా మేం ముగ్గురమూ మా కుటుంబ పరిస్థితుల ప్రభావం వల్లనో లేక మా తండ్రుల ఆశలు నిలపడానికో ఏదైతేనేమి బాగానే స్థిరపడ్డాం. రాజేష్, నాగేంద్ర ఊళ్లోనే ఉంటూ కోట్లు సంపాదిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా నా జీవితం, జీవనశైలీ బాగానే ఉన్నాయి. ఆదర్శాలు, విలువలు అనుకుంటూ ఆర్మీలో చేరిన అశోక్ జాబ్‌పరంగా తృప్తిగానే ఉన్నా ఆర్థికంగా మా ముగ్గురికన్నా తక్కువ స్థాయిలోనే ఉన్నాడని ఖచ్చితంగా చెప్పగలను.

మా ముగ్గురి పెళ్లిళ్లు కూడా మా అభిరుచుల మేరకు జరిగాయి. రాజేష్ తన తోటి లాయర్ కావ్యనీ, నాగేంద్ర మరో బిజినెస్ కుటుంబానికి చెందిన కీర్తినీ పెళ్లి చేసుకోగా నేనూ, శ్వేతా ప్రేమించి పెళ్లి చేసుకున్నాం. సహజంగానే మా ప్రేమ వివాహానికి పెద్దల నుండి వ్యతిరేకత వచ్చింది. అప్పుడు కూడా

అశోక్ వచ్చి మా ఇరు కుటుంబాలతోనూ మాట్లాడి మా వివాహానికి పెద్దల్ని ఒప్పించాడు. అది మేమెప్పటికీ మరువ లేము.

వాడికి మొదటి పోస్టింగ్ అరుణాచల్ ప్రదేశ్ బోర్డర్లో ఇచ్చారు. సెలవుమీద ఊరికి వచ్చినప్పుడల్లా మేమంతా కలుసుకోవడం, అలా బోర్డర్లు, అడవులు పట్టుకు తిరిగేవాడికి పిల్లని ఎవరిస్తారని వాడి 'సింగిల్ స్టేటస్'ని ఆట పట్టించడం జరుగుతుండేది. తెలియకుండానే అప్పుడప్పుడూ ఆర్థికస్థితిని బట్టి వాడికన్నా మేము ముగ్గురమూ బాగా ముందుకు వెళ్లిపోయినట్టు, వాడు మాకన్న బాగా వెనుకబడి ఉన్నట్టు అనిపించేది. సంపాదన బట్టి మనిషి సక్సెస్నీ, ఆనందాన్నీ తూకం వేయడం మాకు తెలియకుండానే మాలోనూ కనిపించేది. వాడు అవేమీ పట్టించు కునేవాడు కాదు.

వాడి తర్వాతి పోస్టింగ్ కశ్మీర్. మా మూడు జంటలకీ శ్రీనగర్ చూడాలని అనిపించడం, వాడు కూడా అక్కడే ఉండడంతో ఒకసారి కశ్మీర్ ట్రిప్ ప్లాన్ చేశాం.

శ్రీనగర్ ఎయిర్ పోర్ట్. జనవరి నెల కావడంతో బాగా చలిగా ఉంది. వారం కిందట కురిసిన మంచు ఆనవాళ్లు అక్కడక్కడా నేలమీద కనిపిస్తోంది. దూరాన కొండలన్నీ మంచుతో పూర్తిగా కప్పబడి వెండిరంగులో మెరుస్తున్నాయి. అశోక్ వచ్చి మమ్మల్ని రిసీవ్ చేసుకుని సిటీలోకి తీసుకెళ్లాడు. లాల్ చౌక్ దాటి డల్ లేక్ చేరుకున్నాం. ఎదురుగా కొండమీద శంకరాచార్యుల గుడి. తెల్లని మంచు రంగుతో పోటీ పడు తున్నట్టు ఎటుచూసినా ఆలివ్ గ్రీన్ యూనిఫాంలో సైనికులే. మా అందరి కోసం హౌస్ బోట్ బుక్ చేసి ఉంచాడు అశోక్. శ్రీనగర్ అంతా దగ్గరుండి చూపించాడు. డల్ లేక్ పై షికారా విహారం, ఛష్మే షాహీ, షాలీమార్ గార్డెన్స్, పరీమహల్ అన్నీ దగ్గరుండి చూపించాడు. తర్వాత రెండు రోజులు గుల్మార్గ్, సోన్ మార్గ్, పహల్గావ్ పర్యటనకి తను రాలేక ఒక గైడ్ని అరేంజ్ చేసి తోడుగా పంపాడు.

మేము తిరిగొచ్చాక ఆరోజు సాయంత్రం అశోక్ కొద్దిగా ఆందోళనలో ఉన్నట్టు గమనించాం. మర్నాడే మా తిరుగు ప్రయాణం. ఉదయం ఫ్లైట్. అశోక్ యూనిఫాంలోనే ఉన్నాడు. మాటిమాటికీ అటూ ఇటూ వెళ్తూ కంగారుగా వాకీటాకీలో మాట్లాడుతున్నాడు. అతనితో పాటు ఇంకొందరు జవాన్లు కూడా ఉన్నారు. ఏదో తీవ్రవాదుల కలకలం ఉన్నట్టు మాకు చూచాయగా అర్థమైంది. మేమూహించినట్టే అక్కడున్న హౌస్ బోట్లలో ఏదో ఒకదానిలో ఒక వాంటెడ్ టెర్రరిస్ట్ ఉన్నట్టు మిలిటరీ ఇంటెలిజెన్స్కి తెలిసిందట. కానీ వాణ్ణి పట్టుకోడానికి ప్రయత్నించే క్రమంలో మిగతా హౌస్ బోట్స్లో ఉన్న వందలాది టూరిస్టుల ప్రాణాలకి ప్రమాదం పొంచి ఉంది.

అశోక్ వాళ్ల యూనిట్ వాళ్లు చాలా చాకచక్యంగా, అలికిడన్నది ఏ మాత్రం లేకుండా ఒక్కో బోట్ నుంచి టూరిస్ట్లను రెస్క్యూ చేస్తున్నారు. మేమంతా భయం గుప్పిట్లో బితుకు బితుకుమంటూ ఒక్కో క్షణం గడుపుతున్నాం. మేము కంగారు పడతామని అశోక్ ఎక్కువ వివరాలు చెప్పట్లేదు. అసలంత సమయమూ లేదు. అశోక్ ఎంతో బాధ్యతగా, చురుగ్గా సిట్యుయేషన్ కంట్రోల్ చేస్తూ ఆర్డర్లు పాస్ చేస్తుంటే, వీడు మా అశోకేనా అని ఆశ్చర్యమేసింది. మా డబ్బూ, పొజిషన్ ఏవీ మమ్మల్ని ఈ సందర్భం నుండి రక్షించలేవు, అశోక్ ధైర్య సాహసాలు, సైనిక శిక్షణ తప్ప.

❖❖❖

పాప నిద్ర పోయింది.

నెమ్మదిగా నేనూ నిద్రలోకి జారుకున్నాను. మర్నాడు ఉదయమే లేచి పాపని తయారుచేసి, అమ్మ, నాన్న, నేనూ, పాప కార్లో బయల్దేరాం. అప్పటికే రాజేష్, నాగేంద్ర వెన్యూ దగ్గరికి చేరుకున్నట్టు ఫోన్ చేశారు. పది నిమిషాల్లో మేమూ అక్కడికి చేరుకున్నాం. ప్రేరణ నా చేయి పట్టుకుని "అశోక్ అంకుల్ ఎక్కడ డాడీ?" అనడిగింది.

సమాధానంగా, "అదుగో, అక్కడ నించుని ఉన్నాడు.." అని చూపించాను.

"అది స్టేచ్యూ కదా డాడీ...?" అనడిగిన ప్రేరణ ప్రశ్నతో ఒక్కసారిగా ఉబికిన కన్నీళ్లతో అక్కడే కుప్పకూలిపోయాను. చెరో భుజంపై చేయి వేస్తూ రాజేష్, నాగేంద్ర కూడా కన్నీటి పర్యంతమై నన్ను చుట్టేశారు. ఒకరి మొహాలొకరు చూసుకుని ఒకర్నొకరు కౌగిలించుకున్నాం. మా ముగ్గురిలోనూ తన కొడుకుని చూసుకుంటున్న మాస్టారి పిలుపుతో తేరుకున్నాం.

'కెప్టెన్ అశోక్ అమర్ రహే' అన్న బ్యానర్ గాలికి ఊగుతోంది. అవును... ఆరోజు జరిగిన రెస్క్యూ ఆపరేషన్లో మాలాంటి వారినెందర్నో కాపాడిన మా అశోక్, చివరిగా నా భార్య శ్వేతనీ, ఏడాదిన్నర పాప ప్రేరణనీ రక్షించే క్రమంలో తాను బలైపోయాడు. బుల్లెట్ గాయాల పాలైన శ్వేత రెండ్రోజుల తర్వాత మాకు దూరమైంది.

మా ఊళ్లో కెప్టెన్ అశోక్ నిలువెత్తు కాంస్య విగ్రహం ప్రతిష్ఠించాలని అనుకున్న మా కోరిక ఇప్పటికి తీరుతోంది, ఈ రోజు వాడి పుట్టినరోజు సందర్భంగా. మా ఊరి మెయిన్ రోడ్ పేరు ఇప్పుడు 'కెప్టెన్ అశోక్ మార్గం'. అందుకే ఆ రోడ్డుమీదుగా నడిచి వెళ్లినప్పుడల్లా వాణ్ణి తడిమినట్టే ఉంటుంది. ■

# మూసేసిన రైల్వే స్టేషన్

**నా** వయస్సు నూట ఇరవై ఏళ్ళు పైగా
నా బాల్యం మధురం కౌమారంలో వెలుగు
యవ్వనంలో మెరిసా! పరిగెత్తా అలుపు లేకుండా!
నడివయసులో ఎన్నో బరువులు మోసా! గమ్యానికి చేర్చా!
వృద్ధాప్యంలో సైతం ఆదాయాన్ని ఇచ్చా!
ఇంకా ఎందరినో ఆహ్వానించాలని
ఇంకా ఆరాటం, తాపత్రయం!
నాలో చావని తపన
నా ప్రాంగణంలో ఓ గంట గణగణమని మోగితే
నాలో ఆనందం
వచ్చే పోయే జనంతో
నా కళ్ళల్లో ఉప్పొంగే సంతోషం!

నా ఇలాకాలో ఓ కుళాయి
ఇంకిన నీరుతో
దాచినా దాగక ఒక్కో బొట్టు రాలుస్తుంది
ఎందుకో తెలియక మనసు కీడు శంకిస్తుంది
నా వసారాలో బెంచి ఇంకా గట్టిగా
ఎందరినో మోసి మోసి అలసినా
చెక్కు చెదరని వెన్నెముకతో నిశ్చలంగా!
రోజూ నా ముందు తచ్చాడే
కాఫీ, టీ క్యాన్లు అగుపడట్లే
అరుపులు మూగబోయాయి
రద్దీ లేక మరో వైపు పొట్ట కూటి కోసం!
పొగ చిమ్ముతూ ఓ బండి
సమాంతర పట్టాలపై దూసుకొస్తుంటే
ఓ ధవళ వస్త్రధారి చేతుల్లో
ఎగిరే పచ్చ జెండా! ఎర్రజెండా!
వెళ్ళేది! ఆగేది! అదో సంకేతం!
నూరేళ్ళు దాటినా నేటికీ నేను దృఢంగా
నన్ను చంపే కుట్రలో పెట్టుబడి పాత్ర
నిన్న గాక మొన్న వచ్చినోడి మంత్రం
నాకు బతికుండానే పాడె పేర్చి
చనిపో అని అల్టిమేటం!
చైతన్యం లేని ప్రయాణికుల జూసి జాలితో
నేనూ తనువు తాలిస్తున్నా ...
నాకో ఎర్రజెండాను చూయించిన స్టేషన్ మాస్టర్
నేనో మూసివేయబడ్డ రైల్వే స్టేషన్‌ని!

(విజయవాడ డివిజన్‌లో 23 స్టేషన్ల మూసివేతకు నిరసనగా)

**- గిరి ప్రసాద్ చెలమల్లు**
**9493388201**



# ఇరుకు గూళ్లు

**ఏ** దేశం నీదని ఆ పక్షిని అడిగాను
ఆకాశం నా ఇల్లని తల పైకి ఎత్తింది
విశ్వమే నా నివాసమన్న భావన తోచింది
ఆ పిట్ట బుద్ధి విశాలతకు నాతల వంగింది ..

'నా దేశం నా ప్రాంతం నా మతం నా కులమన్న'
గోడలు కట్టుకుని ఇరుకు గూళ్ళలో చిక్కుకున్న
దిగజారాడు అల్పబుద్ధి మానవులం..
వసుధైక కుటుంబమనే సత్యాన్ని మరిచాము!

బిడ్డ పుట్టుకతో పడిన కులమత ముద్ర
జీవితాన్ని చిలికి చిలికి శాసిస్తూంటే
మతాల మౌఢ్యం ముదిరి పోతూంటే
కులాల కుమ్ములాట ఓటును గెలుస్తూంది!

ప్రజాస్వామ్య పునాదులే కదులుతున్నాయి
రెక్కలు మొలిచి ధరలు నింగికెగురుతున్నాయి
విలువలు ఎండుటాకులై రాలిపోతున్నాయి
మమత మానవత్వం వలసపోతున్నాయి!

**- డా. పి.విజయలక్ష్మి పండిట్**



# ఇష్టంగా నెరవేర్చిన బాధ్యత
# కాళ్లకూరి నాటక త్రయ విశ్లేషణ

- రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు
77991 11456

**ఆ**చార్య జోస్యుల కృష్ణబాబు గారు కాళ్ళకూరి వారి సంస్కరణ నాటకత్రయం మీద ఈ పుస్తకం తీసుకు రావడం నన్ను పెద్దగా ఆశ్చర్యపరచలేదు. అందుకు కారణాలున్నాయి. ఒకటి : కృష్ణబాబుగారి సాహిత్య వ్యాసంగంలో మొదట్నుంచీ నాటకానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. వారి పిహెచ్.డి. పరిశోధనాంశం హరిశ్చంద్ర నాటకాలు. రెండు : ఆయనకు పద్యంమీద మక్కువ ఎక్కువ. లలిత సుందరాలైన పద్యాలయితే మరీను. మూడు : కృష్ణబాబు సంస్కరణ ప్రియులు. ఆ ప్రియత వాఙ్మనః పరిమిత కాదు. ఆచరణ పర్యవసాయి కూడా. ఆయన జీవితాన్ని దగ్గరగా ఎరిగిన వాళ్ళకి ఆ విషయం తెలుసు.

కాళ్ళకూరి నారాయణరావు గారు రాసిన వరవిక్రయం, చింతామణి, మధుసేవ నాటకాల విలువ ఇప్పటి తరానికి సరిగా తెలిసే అవకాశం లేదు.

వినోద విజ్ఞాన సాధనాలలో నాటకం అగ్రపీఠం మీద కూర్చున్న కాలం ఒకటుంది మనకి. అప్పుడు సినిమాలు లేవు. సీరియల్స్ లేవు. రియాలిటీ షోలు లేవు. ఇంట్లో టీవీల్లేవు. చేతుల్లో సెల్లుల్లేవు. దేశంలో నిరక్షరాస్యత చాలా హెచ్చుగా ఉండేది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్ళకి కూడా మన అక్షరాస్యత 74 శాతమేనని గణాంకాలు చెబుతున్నాయి. 1947లో స్వాతంత్ర్యం వచ్చేనాటికి 12 శాతం మంది మాత్రమే అక్షరాస్యులట. మరో పాతికేళ్లు వెనక్కిపోయి, కాళ్ళకూరి వారి నాటకాలు వచ్చిన కాలంలో అంటే 1920ల నాటి అక్షరాస్యత ఎలా ఉండేదీ సులువుగా ఊహించుకోవచ్చు. అలాంటి పరిస్థితుల్లో పుస్తకాలు 'మూగజీవాలే' కదా! ప్రజలకి ఏం చేరాలన్నా, చెప్పాలన్నా,– అక్షరాలు 'పలకాల్సిందే.' అందుచేత హరికథలు, బుర్రకథలు, నాటకాలు వంటి ప్రజా దృశ్య మాధ్యమాలు ముందుకొచ్చాయి. వాటిలో రారాజు నాటకమే. ప్రజల వినోద విజ్ఞానావసరాల్ని నాటకం సమర్థవంతంగా తీర్చింది. దాని విస్తృతి, శక్తి అలాంటివి.

పైగా అది సంస్కరణ యుగం. ఎక్కడికక్కడ ఏ చెడు కనిపిస్తే ఆ చెడును ఖండించడం అనేది మేధావులు బాధ్యతగా స్వీకరించిన కాలమది. కాళ్ళకూరి నారాయణరావు గారు బలంగా సంస్కరణ భావాలు ఒంటబట్టిన మనిషి. 'స్వయంగా ఆచరించాలి ఇతరులకి ప్రబోధించాలి' అనే తపన హెచ్చు. అందుచేత, సహజంగానే, గాఢ ప్రభావ ప్రసార సమర్థమైన నాటక ప్రక్రియను అందుకున్నారు. సమకాలీన సమస్యలు మూడింటి మీద నాటకాలు రాశారు.

"నీటైన ఇంగ్లీషు మోటారు సైకిలు కొనిపెట్ట వలెనను కూళ యొకడు ..." తదితర 'వరవిక్రయ' నాటక పద్యాలు మా నాన్నగారి హార్మోనియం పుస్తకంలో రాసి ఉండేవి. ఆయన వాయిస్తూ ఉండేవారు. వరవిక్రయం నాటకం పేరు తెలియక ముందే సింగరాజు లింగరాజు తెలుసు నాకు. చిన్నప్పుడు ఎవరైనా పిసినారి పోకడలు చూపిస్తే 'వాడొట్టి సింగరాజు లింగరాజు' అనేవాళ్ళు మా ఇంట్లో. భావాలను ప్రజల మనసులకి ఎక్కించడంలో నాటకానికి ఉన్న సమర్థత మాత్రమే కాక– అందుకు గాను నాటకంలో హాస్యానికి ఉండాల్సిన పాత్ర కూడా ఆయనకు బాగా తెలుసు అనడానికి వర విక్రయం నాటకం సాక్షి. ఒక పాత్ర జీవితంలోకి రావడం రచయిత విజయానికి ఎత్తిన పతాక.

వీలయిన మేరకు చెడును ఎత్తిచూపి ఖండించడం,

అపహాస్యం పాలు చెయ్యడం ఉద్యమంగా రచనల్ని నిర్వహించారు కాళ్లకూరి వారు. అయితే సాహిత్య మౌలిక తత్వాన్ని మరిచిపోలేదు. ఉదాహరణకు వరవిక్రయ నాటకాన్ని తీసుకుంటే, కట్న దురాచారాన్ని బలంగా ఖండించడం ఒక్కటే రచయిత లక్ష్యం అయినట్టయితే కాళింది ఆత్మహత్య చేసుకున్న మూడో అంకంతో నాటకం ముగిసిపోవాలి. కానీ, మానవ మౌలిక ప్రవృత్తి ఎంతగానో ఇష్టపడే పొయిటిక్ జస్టిస్ అందులో ఉండదు. దుర్మార్గుల భంగపాటు కనిపించి తీరాలి. అందుకే కమల పాత్రద్వారా ఆయన నాటకాన్ని నడిపించారు. అదీగాక ఎక్కడ ఏ అన్యాయం కనిపించినా సహించలేని వ్యక్తి కాబట్టి నారాయణరావు గారు స్కూలు బోర్డు వాళ్ళ పెత్తనాలు, ప్లీడర్ల అన్యాయాలు, పెళ్ళిళ్ళలో మగపెళ్ళి వారి ఆగడాలు, వంటి మరికొన్ని అంశాలు కూడా నాటకానికి ఎక్కించారు.

ఆరోజుల్లో కొన్ని నాటకాల్ని ప్రజలు ఎంతగా ఆదరించారంటే ఎన్నో నాటక సమాజాలు వాటిని ఊతగా చేసుకుని జీవిక సంపాదించుకోగలిగాయి. అందులో కాళ్ళకూరి వారి చింతామణి నాటకం ఒకటి. అప్పట్లో వేశ్యల్ని ఉ ంచుకోవడం అవమానం కాదు సరికదా; ఒక హోదాగా కూడా ఉండేది. అందుకు దోహదం చేసిన అంశాలు చాలా ఉంటాయి. చిన్న ఆడపిల్లల్ని పెద్ద వయసు మగవాళ్ళకిచ్చి పెళ్ళి చెయ్యడం ఒక ముఖ్య కారణం అయిఉండాలి. వయో అసమానతల కారణంగా మగవాళ్లు వేశ్యల వెంటపోయేవారనుకుంటాను. చింతామణి నాటకం ద్వారా నారాయణరావు గారు వేశ్యా సహవాసంలో ఇమిడిఉన్న కష్టనష్టాలను 'సాహిత్య వంతం'గా బలంగా ప్రకటించారు.

ఆయనకు మహాకవి అని బిరుదు. దాన్ని.... కంచి పీఠాధిపతులిచ్చారని విన్నట్టు గుర్తు. ఆ బిరుదులో పెద్దవాటా ఆయన నాటకాలదే అనుకుంటాను. నాటక పద్యం ఎలా ఉ ండాలో అలా ఉంటుంది కాళ్ళకూరి నారాయణరావు గారి పద్యం. సుబోధకంగా ఉంటుంది. సరళంగా ఉంటుంది. సారవంతంగా ఉంటుంది. చాలా పద్యాలు అప్పట్లో జనం నాలుకల మీద ఉండేవి. 'అత్తవారిచ్చిన అంటుమామిడి తోట...' అన్న భవానీ శంకరుడి పద్యం మా ఊళ్ళో అర్థాక్షరాస్యులు సైతం గొంతెత్తి ఆలపించడం చాలాసార్లే చూశాను నేను. ఆయన రాసిన మంచి మంచి పద్యాలెన్నిటినో ఉదాహరించారు కృష్ణబాబు గారు. ముందే నాటకం చదివిన వాళ్ళకి అవన్నీ మంచి నెమరువేత సందర్భాలు. కొత్త సాహిత్య ప్రియులకి మంచి 'ఎర'లు.

ఇటీవల చింతామణి నాటకం నిషేధించబడిన ఉదంతాన్ని ఆ సందర్భంగా జరిగిన చర్చని కూడా ప్రస్తావించారు కృష్ణబాబు గారు.

తగ్గుముఖం పట్టిన వరకట్నం, వేశ్యా సహవాసం, ఇతివృత్తాలుగా వచ్చిన వరవిక్రయ, చింతామణి నాటకాలు ఏదో ఒకస్థాయిలో ఆదరణ పొందుతూ ఉండడం ... మద్యసేవనం నానాటికీ విజృంభిస్తున్నప్పటికీ... మధుసేవ నాటకం వెనక్కి వెళ్ళిపోవడం చిత్రమే! సినిమాలో మద్యపాన ఉదంతాల్ని, దృశ్యాల్ని నిషేధించడం అత్యవసరం కదా! (మద్య నిషేధాన్ని ఆశించడం అత్యాశ అనుకోండి. కనీసం ఇదయినా చెయ్యాలి కదా!) మద్యపానాన్ని 'వినోదం'గా, 'స్వేచ్ఛకీ, స్టేటస్‌కీ సింబల్'గా,– అంతకన్న ఘోరం ఏమిటంటే అదొక 'అతి సాధారణ సహజ వ్యవహారం' అన్నట్టుగా చిత్రించడం అంటే యువతరానికి ద్రోహం చెయ్యడమే. మంచినీళ్ళ కన్న ఎక్కువగా మద్యాన్ని తాగేస్తోంది 'తెరలోకం'. మరో 30, 40 ఏళ్ళ నాటికి– భ్రష్టుపట్టిన జాతి ఆరోగ్య స్థితిని చూశాక– సినీ మద్యం చేసిన తీరని ద్రోహం అర్థమౌతుంది. అయినా, పెద్ద ప్రయోజనం ఏమీ ఉండదనుకుంటాను. ఏదో ఒక మతానికో, కులానికో, ప్రాంతానికో చెందిన విషయాల్ని తప్ప, సర్వసమాజ సంబంధిత విషయాల్ని పట్టించుకుని, ఆగ్రహించే 'సున్నితత్వం' మన జాతికి అంత తొందరగా అలవడేట్టు లేదు.

ఈ పుస్తకంలోని రచన విషయ ప్రధానంగా సాగింది. ఎక్కడా శాఖా చంక్రమణాలు లేవు. వచనం ప్రసన్న సుందరంగా ఉంది. సాహిత్యేతర పాఠకుల్ని కూడా ఆకట్టుకుని చదివిస్తుంది. గతకాలపు సాహిత్యంలోని మేలి రచనల్ని తరం మారినప్పుడల్లా పరిచయం చెయ్యాల్సి ఉంటుంది కొత్త పాఠకులకి. లేకపోతే ఎలా తెలుస్తాయి వాళ్ళకి? ఇటువంటి రచనల్ని వ్యాసాల్ని చదువుకుని ఎన్నో పుస్తకాలను వెతికి సంపాదించుకుని చదువుకున్నాను నేను.

కొత్త తరానికి మేలి నాటకత్రయాన్ని పరిచయం చేస్తున్న మిత్రుడికి హార్దిక అభినందనలు.

**కొసమాట :** మధుసేవ నాటకం నేను చదువుకోలేదు. చూడనూ లేదు. మిత్రుడి పుస్తకమే చదివి చూపించింది. అందుకు ధన్యవాదాలు కూడా. ■

**జర్నలిస్టు తులసీ చందుపై కొన్ని ఉన్మాద శక్తులు అసభ్యంగా, అరాచకంగా ట్రోలింగ్ చేయటాన్ని నిరసిస్తూ, తులసికి సంఘీభావం ప్రకటిస్తూ 30.6.2023 సాయంత్రం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సభ నిర్వహించారు. వివిధ సంఘాల ప్రతినిధులు, పలువురు జర్నలిస్టులు తులసీ చందును బెదిరిస్తున్న అరాచక శక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.**

## దారిదీపం

అమ్మ చెపితే ఎరుకైన
మొదటి బంధం నాన్న
ఎదుగుతుంటే నేనాడుకున్న
మొట్టమొదటి ఆటబొమ్మ నాన్నే

అడుగులల్లో అడుగులేస్తూ
తప్పటడుగులు వేస్తున్నపుడు
ఏలు పట్టి దారి సూపిన
నా బతుకు మూలసుక్క నాన్న

అంగి జేబెనుకాల బాధలన్నీ దాసుకుని
మా నవ్వుల కోసం
జేబు ఖాళీ చేసుకునేటోడు నాన్న
మేమొక్క పూట దూరమైనా
ఎక్కెక్కి ఏడ్చే పసివాడు నాన్న


నాన్నంటే
వేల దుఃఖపు సంద్రాలను ఇంకించుకుని
నడిచేటి ఎడారి ..!

పొట్ట చేత బట్టుకుని మేము
బతుకుదెరువుకోసం పోతే
పచ్చులిడిశిన దిగులు గూడయ్యే-
పానమున్న బొక్కల గూడు నాన్న

మేమెపుడన్న మాట్లాడకుంటే
పచ్చనడవిలో ఎండిన ఏకాకి చెట్టయ్యేటోడు నాన్న
ఎపుడన్నా కోపమొస్తే
చిటపట చిటపట మండి
చప్పున చల్లారే తాటాకు మంటే నాన్న

నాన్నంటే -
పచ్చి పాలమీది స్వచ్ఛమైన నురుగే కాదు;
మచ్చలున్న చందమామ కూడా!
పడమరకేసి చూస్తున్న నాన్న-
ఏ మనుషుల కోసమో కరిగిన తూరుపు కొండలు
ఒక్క తీరుగనే కనబడుతున్నయిప్పుడు ...

- దిలీప్.వి
84640 30808



## కొత్త అడుగులు

మన్ను తిన్న పాముల్లా మనుషులు
వెంటిలేటర్ మీదున్న పేషెంట్‌లా సమాజం
కలల మేకల్ని మింగేస్తున్న అనకొండలా రాజ్యం!
ఆ అనకొండల జెండాలు చేత పట్టుకొని
హిస్టీరియా పేషెంట్లలా ఊగిపోతున్న
ఈ బతికున్న శవాలకి
అర్జెంటుగా పోస్టుమార్టం చెయ్యండి!
వీళ్ళ పంచేంద్రియాలకు
పంచవర్ణ (కుల) వివక్ష ఎలా పాకిందో
వీళ్ళ మెదళ్ల కుదుళ్ళకు
మతం మత్తుమందును ఎవరు ఇంజెక్ట్ చేశారో
వీళ్ళ నరనరాల్లో నెత్తురు
బానిసత్వ భావజాలంతో ఎందుకు ప్రవహిస్తుందో
పంచనామా రిపోర్టులో నిగ్గు తేల్చండి ..!
పాలకుల పల్లకీలు మోస్తున్న
ఈ పార్థివ దేహాలకు పాడెలు సిద్ధం చెయ్యండి!

ప్రశ్న లేనిదే ప్రగతి లేదు
ప్రశ్న ఒక నిత్య చైతన్య ప్రవాహం
ప్రశ్నించటం ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రం
ఆలోచనల కత్తికి ఇక పదును పెట్టాల్సిందే
ఆశల తీరానికి కొత్త అడుగులు వెయ్యాల్సిందే
దేగల రాజ్యం మాయా దేరాను కూల్చాల్సిందే!
పార్టీలతో మనకు పని లేదు
పాలకులతోనే మనకు పని
మంచి చేస్తే అందలాలెక్కిద్దాం
చెడు చేస్తే అథోపాతాళానికి తొక్కేద్దాం!


- మామిడిశెట్టి శ్రీనివాసరావు
93812 11318

## మన కంటే అవే నయం

**మా**టకు సిగ్నల్ లైట్ వేసినా
మౌనపు దుప్పట్లో దాక్కుంటున్నాం
కాళ్లకు స్పీడ్ బ్రేకర్లేసేసి
ఎలుకలతో కలుగుళ్ళో కలిసుంటున్నాం
చూపులకు చిక్కాలు చుట్టినా
కనుగుడ్ల గూళ్లలో నక్కుతున్నాం

మనకన్నా అవే నయం
నీటిని తోడుకెళ్లి నందుకు చెట్లు
మేఘాలపై ఎఱ్ఱ పిడికిళ్లయి గర్జిస్తున్నాయ్.
మంటలు ఎగదోస్తున్న సూర్యునిపై
గుట్టల ఏనుగులతో దండోరా తీస్తున్నాయి
తమ బట్టలు, గాసం కాజేసినందుకు
పచ్చని ప్రాణగంధాన్ని జుర్రేసినందుకు
ఎండపై తుడుం మోగిస్తున్నాయి!
జీవజలాన్ని పీల్చేసినందుకు
ఎండిన డొక్కలతో నదులు, వాగులు
మహా పాదయాత్రలై కదులుతున్నాయి

మనకంటే అవ్వే నయం
గూళ్లను ఏళ్లను సెలయేళ్లను దోచుకున్నందుకు
భయంకర అరుపులతో
ధర్నాకు దిగినయ్ చిమ్మట్లు
కాళ్ళతో బరికి రెక్కలతో దాడి చేసి
ముక్కుతో శరీరాన్ని పొక్కలు పొక్కలు చేయనీకి
ఆకాశంపై అత్యవసర యుద్ధజెండా
పాతినై పక్షులు !
మనకంటే అవే నయం
జొన్న కంకుల తలలపై ఫ్లై ఓవర్లు పాతి
కార్లలో ఫియానో గీతాలతో
జల్సా చేస్తుంటే
వరి గింజ అరిగోసతో ఉరి పెట్టుకుంటుంటే
మార్కెట్లో తన చేతులతో
తలపై నిప్పులు పోసుకుంటుంటే
నాగలి పట్టిన చేతులు బేడీలై ఏడుస్తుంటే
పెద్ద మనుషుల కలల దీపాలు
మూడు పదుల గడ్డాల్లో
గుడ్డి చూపులై చూస్తుంటే




మనం మరీ మరీ క్షీరాభిషేకాలు చేస్తున్నాం
గజహారాలతో ఘనంగా పొగుడుతున్నాం

మనకంటే అవే నయం
కండ్లు లేకున్నా కాళ్ళు లేకున్నా
మాట పెగలకున్నా మనుగడ కోసం
ఏదో ఒక అలజడి చేస్తూనే వున్నాయి
వున్నచోటే ఉద్యమ గీతాన్ని రాజేస్తూనే వున్నాయి!

–డా. ఉదారి నారాయణ
94414 13666

**సాహిత్య ప్రస్థానం**
విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక
**చందాదారులుగా చురండి ..**
**మీ మిత్రులను చేర్పించండి ..!**
**వివరాలకు 94900 99057 ను సంప్రదించండి.**






# సహజ పరిమళాలు వెదజల్లిన మట్టిబండి

- పింగళి భాగ్యలక్ష్మి
9848997047 25609

**డా**క్టర్ నాగభైరవ ఆదినారాయణ గారి కలం నుండి జాలువారిన ఆణిముత్యం లాంటి దీర్ఘ కవితా సంపుటి "మట్టిబండి ".నేటి సమాజానికి అద్దం పడుతూ మట్టి పరిమళాలను వెదజల్లుతూ పేరులోనే కొత్తదనాన్ని సంతరించుకుంది ఈ పుస్తకం. మట్టిలో నుండి బంగారం కన్నా విలువైన ఆహార ధాన్యాలను పండిస్తున్న నేల తల్లి ముద్దుబిడ్డ రైతన్న 'శ్రమైక జీవన సౌందర్యానికి' తన కవిత్వం ద్వారా చక్కని భాష్యం చెప్పారు ఆదినారాయణ గారు. ఈ దీర్ఘకవిత చదువుతున్నంత సేపు రైతన్నలు చేస్తున్న వ్యవసాయాన్ని, నేటి యువతకు వ్యవసాయం పట్ల ఉన్న చిన్నచూపుని, బ్యాంకు నుంచి రుణాలు సకాలంలో అందక రైతన్నలు పడుతున్న మానసిక వెతలు, ప్రభుత్వం నుంచి కనీస గిట్టుబాటు ధరలు లేక , నకిలీ విత్తనాల వల్ల భూమాతకు తద్వారా రైతన్నకు జరుగుతున్న అన్యాయం.... ఇలా అనేక అంశాలతో కూడి మన కళ్ళ ముందు కదలాడే కవితలన్నీ కంటతడి పెట్టించాయనే చెప్పాలి.

బహుముఖ ప్రజ్ఞా పాటవాలతో భాసిల్లుతున్న డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ గారు రచయితగా, కవిగా, పరిశోధకుడిగా, వ్యాకరణములో ప్రతిభా మూర్తిగా, పాఠశాల పాఠ్యాంశాల గ్రంథకర్తగా... ఇలా పలు ప్రక్రియల్లో అక్షర సేద్యం చేస్తూ కత్తికన్నా కలం గొప్పదని నిరూపిస్తున్నారు.

మొదటగా "మట్టి బండి" దీర్ఘ కవితలో రైతు కష్టించి పొలం దున్నుతున్నా పూట గడవక "అన్నమో రామచంద్ర!" అంటూ అలమటిస్తున్న కుటుంబం కోసం తాత ముత్తాతలు రెక్కలు ముక్కలు చేసుకొని కొన్న పొలాన్ని అమ్మేశానని రైతు ఆవేదనగా చెప్పారు. ఇంకా అప్పులు తీరక పొలంతో పాటు ఎడ్లని, కుడి భుజంలా ఉండే బండిని కూడా రైతు అమ్మేశాడని రచయిత ఆవేదనగా చెప్పారు. అమ్మేశాక అపురూపమైన ఒంగోలు జాతి ఎడ్లను లేపాక్షి బసవన్న, కైలాసంలోని పరమేశ్వరుడు కూడా తలదించి చూస్తారని వాటి అంద చందాలని చాలా చక్కగా అభివర్ణించారు. ఇంకా అమ్మేసిన బండితో రైతన్న జీవన నావ సాగిన తీరుని చాలా చక్కగా వర్ణించి చెప్పారు.

రైతన్న ఇంట్లో పుట్టిన ఎడ్లు తమ తల్లి పాలను రైతు బిడ్డలతో పంచుకుంటూ అక్కడే పెరిగి పెద్దయి సొంత బిడ్డల్లా బాధ్యతల్ని పంచుకొని పొలం దున్నుతూ కనుపాపల్లా తనతో కలిసి పోయాయని రైతు పొందిన ఆవేదనని ఎంతో హృద్యంగా చెప్పారు రచయిత. తమ పిల్లలు వాటిని అదిలించినా మీద పడటం లాంటివి చేయవు. పక్క చేలోకి వెళ్లి గడ్డిని కూడా ముట్టవు. ముల్లు కర్రతో, చర్నాకోలతో కొట్టకుండా "ఆయ్!" అని అదిలిస్తే నేరుగా ఇంటికే వస్తాయని రైతు వాటిని ఎంతో గొప్పగా కొనియాడారు . అలాగే ఎన్నో ఏళ్లుగా చేలు దున్నుతూ పంటను ఇంటికి చేర్చే ఈ ఎడ్లు ఒక్కరోజు రైతు కనపడకపోతే దిగులుతో గడ్డి తినక, కుడితి ముట్టక దిగులు పడేవి. ఒక్కసారిగా కనబడితే దగ్గరకొచ్చి ముట్టెలను తన భుజాలపై చేర్చి ముద్దాడుతూ, సేద తీరుతూ గేదెలు తమకున్న అభిమానాన్ని చాటుకునేవని రైతు ఆనందంతో చెప్పారు. అంతలా బిడ్డల్లా ఉంటూ తమ పట్ల విశ్వాసం, ప్రేమ ప్రదర్శించే బంగారు ఎడ్లను కనికరం లేకుండా కుటుంబం కోసం అమ్మేశానని చెప్పే రైతు ఆవేదనని ఎంతో అద్భుతంగా కవిత్వీకరించి చెప్పారు రచయిత.

అలాగే పురిటి నొప్పులు పడే అమ్మను వైద్యశాలకు తీసుకువెళ్ళి క్షేమంగా అమ్మని, అమ్మ కడుపులో నుండి బయటికి వచ్చిన నన్ను ఇంటికి చేర్చింది ఈ బండేనన్నారు.

తన ఇంటి ఇల్లాలు కూడా ఈ బండి లోనే కాపురానికి వచ్చి ఇంటికి దీపం అయిందన్నారు. ఇలా ఎంతో అందంగా ఎడ్లబండి శ్రమని కొనియాడారు.

చిన్నతనంలో రైతు పొలం గట్ల మీదకి వెళ్ళిన జ్ఞాపకాల ఊటని పుస్తక రచయిత ఆదినారాయణ గారు ఎంత చక్కగా చెప్పారో చూడండి. ఉబ్బిలి వాగు దాటి చేనుకు వెడుతుంటే స్ప్రింగ్ మంచం మీద ఎగురుతున్న వింత అనుభూతిని తెలియజేశారు. అలాగే తాత చేతిని ఆసరాగా చేసుకొని వాగులో నడుస్తుంటే గమ్మత్తుగా ఉండేది. అక్కడ పరమేశు కుంటలో వేళ్ళు ముంచితే చేప పిల్లలు మునివేళ్లతో రైతు వేళ్ళను గీరుతూ గిలిగింతలు పెట్టేవి. ఆ గుంటలో పడతులు కడవలతో నీళు తీసుకు వెళుతున్న తీరు, ఇంకా బర్రెలు వేసవి తాపానికి తట్టుకోలేక చల్లదనం కోసం కుంటలోకి ఉరుకుతున్న తీరుని, గొడ్లు కాసుకునే కుర్ర కారు కుంటలో గేదెల పైకెక్కి కూర్చునే దర్పాన్ని – ఇవన్నీ చూస్తుంటే వారు ఐరావతాన్ని అధిరోహించే అమరపతిలా అగుపించే వారిని రచయిత అద్భుతంగా అభివర్ణించి చెప్పారు. రైతు భార్య చేనుగట్టుకొచ్చి అన్నం తినిపిస్తుంటే ఎదలో కలిగే తెలియని సందడిని కూడా చక్కగా చెప్పారు. అప్పట్లో గొడ్లు కాసే బుడ్డోళ్ళందరూ జంతువులకు కాపలాగా ఉంటూ బిళ్ళంగోడు ఆట, కోతి కొమ్మచ్చు ఆటలతో గడిపారని రచయిత వర్ణించారు.

ఇటువంటి రైతు పొలాన్ని సస్యశ్యామలం చేసి ఆకలి రక్కసి నుండి లోకాన్ని కాపాడే "రౌతు" అంటూ చక్కని కితాబుని ఇచ్చారు . ఇంకా రైతు అంటే అన్న ప్రదాత, మహామాంత్రికుడు, స్వాతిముత్యం, పచ్చదనాన్ని పసిడిగా మార్చే కార్మికుడు, సప్తవర్ణాలను నైవేద్యంగా చేసి హృద్యంగా మార్చగల సేద్యగాడు, విత్తనాన్ని విత్తంగా మార్చగల ఇంద్రజాలికుడు... అంటూ చక్కని పదజాలంతో రైతుని కొనియాడారు రచయిత. పడిన కష్టానికి ఫలితం ఆశించడం తప్ప పరులను యాచించడం తెలియని అభిమాని రైతు అని కీర్తించారు.

అటువంటి రైతు పరిస్థితి ఇప్పుడు అగమ్య గోచరంగా మారింది. ఋతువులు గతి తప్పి మబ్బులు ముఖం చాటేస్తున్నాయి. తగిన సమయంలో కురవని వానల వల్ల రైతన్నలు కష్టాల కొలిమిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇక నకిలీ విత్తనాలు, పురుగుమందులు, నల్లబజారులు విలయతాండవం చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. దళారులు దర్జాగా దోచుకుంటున్నారు, మద్దతు ధర లేక గరళకంఠులైన రైతన్నల వెతలను ఎంతో ఆవేదనా భరితంగా, ఆర్తిగా అక్షర తూటాలుగా మలిచి కవిత్వీకరించి చెప్పారు. నేనైతే ఈ కవితలు చదివి కన్నీటి పర్యంతమయ్యాను.

రైతన్న మనసులో వేదనని కూడా ఆదినారాయణ గారు ఇలా చెబుతున్నారు. ఉద్యోగం చేస్తున్న రైతు పెద్ద కుమారుడు తండ్రిని ఆదుకుంటున్నాడు. ఒకసారి తండ్రి(రైతు) దగ్గరికి వచ్చి "కండలు కరిగించి నెత్తురు స్వేదంగా చిందించినా అప్పుల ఊబిలో ఉన్నావు. వ్యవసాయం మానేసి నాతో వచ్చేయ్. వ్యవసాయం చేస్తున్న తమ్ముడికి వివాహం చేద్దామంటే రైతుతో పెళ్లి ఏంటని హేళన చేస్తున్నారు అమ్మాయిలు. ఇప్పుడు వ్యవసాయం రైతులకు ఉరికొయ్య, అంపశయ్య. బడా బాబులకే బ్యాంకు రుణాలు. వ్యవసాయదారులకి ఆకాశంలో చుక్కలు చూపిస్తాయి బ్యాంకులు. వీటన్నింటితో రైతుల ఆత్మహత్యలు. ఇన్ని అవరోధాలు, అవస్థలతో వ్యవసాయం అవసరమా!" అంటూ కొడుకు తండ్రిని ప్రశ్నించిన తీరుని రచయిత ఆవేదన భరితంగా కవిత్వీకరించి చెప్పారు. ఇంకా రామరాజ్యం అని చెప్పుకుంటున్న ఈ భారతావనిలో "అన్నమో రామచంద్ర!" /అనే అరుపులు వినిపిస్తాయేమో./ "హలో లక్ష్మణా!"/ అంటూ ఆసువులు బాసే/ ఆకలి చావులు/ కనిపిస్తాయేమో!/ ఏమో!/ ఏమో!/" అంటూ బాధాతప్త హృదయంతో రైతన్నల మనోవేదనని ఒడిసి పట్టుకొని కవితా పాదాలుగా మలిచి అద్దంలో ప్రతిబింబంలా మన కళ్ళ ముందు ఉంచారు 'మట్టి బండి దీర్ఘ కవిత' రచయిత నాగభైరవ ఆదినారాయణ గారు.

పైపై కబుర్లతో రైతన్నలని పొగడ్తలతో ముంచేస్తున్న ప్రభుత్వాలు గుప్పిట తెరిస్తే మొండి చెయ్యే ఉంటుందన్న వాస్తవాన్ని మట్టిబండి దీర్ఘకవిత ద్వారా రచయిత తెలియజేశారు. ఈ కవితా సంపుటి ప్రతి ఒక్కరు తప్పక చదివి తీరవలసిన పుస్తకం. మట్టిలో మాణిక్యాలైన రైతన్నల ఆవేదనని అందంగా అక్షరీకరించి చెప్పిన రచయిత రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, ఇంకా గిడుగు భాషా సేవా పురస్కారాన్ని అందుకున్నవారు అటువంటి నాగభైరవ ఆదినారాయణ గారికి శుభాకాంక్షలు, జేజేలు. పుస్తక వివరాలకి డా. నాగభైరవ ఆదినారాయణ, రామయ్య నగరు, ఒంగోలు ఫోన్ నెంబర్. 9849799711 తో సంప్రదించవచ్చు. ■


**సాహిత్య ప్రస్థానం**

విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక

**చందాదారులుగా చేరండి .. మీ మిత్రులను చేర్పించండి ..!**

## ఆశయ కాంతిరేఖలు

చుట్టూ బీదరికపు అంధకారం ఆవహించి
నిరాదరణ నిరాశలోకి నెట్టేసినా,
కటిక చీకట్లు కమ్మేసినా
చూపుల్లో వత్తులు వేసుకొని
ఆశయాలను ఆశాజ్యోతులుగా వెలిగించి
బితుకుబితుకుమంటూ ఎదురుచూస్తున్న
భవిష్యత్తు కాంతి రేఖలు వాళ్ళు
కట్ట తెగిన నయనాల్లోంచి ఎడతెగని చెమ్మ
నిర్విరామమై ప్రవహిస్తున్నా
ఆ ప్రవాహంలోనే ఆశల కాగితప్పడవలు విడిచి
ఆడుకునే అమాయకులు వాళ్ళు!
తెగువతో సహనశీలత్వాన్ని ఆయుధంగా మలచుకొని
జీవితంతో అవిశ్రాంతంగా పోరాడుతున్న
అలుపెరగని వీరులు వాళ్ళు!

ఊహలకు ఊపిర్లూదుతూ ఆశలకు రెక్కలు తొడుగుతూ
కోటి కలల విహంగాలై చుక్కలను అందుకోవాలనే
కల్లోల బతుకు ప్రయత్నం వాళ్ళది!
విప్పారిన కళ్ళతో పురివిప్పిన కలలతో
నర్తించే నృత్య మయూరాలు వాళ్ళు !
నిత్యం కొత్త సూర్యోదయాల్ని కలగంటున్న
కోటి పున్నముల కాంతిపుంజాలు వాళ్ళు
కటిక దారిద్ర్యంలోనూ చైతన్యంతో దూసుకుపోయే
అనంత దారిదీపాల వెలుతురు చినుకులు వాళ్ళు !

పిడికిళ్ళను బిగిస్తూ కష్టాలపై కన్నెర్ర చేస్తూ
కాలానికి నిత్యం సవాలు విసిరే పోరాట యోధులు వాళ్ళు
వెక్కిరించే నోళ్లను నొక్కిపెట్టేలా ఎదగాలనుకునే
ఆశయ శిఖరాలకు ప్రతిరూపాలు వాళ్ళు
ఆపన్న హస్తాన్ని అందించి తోడై నిలిస్తే బతుకు సమరంలో
ఒంటి చేత్తో పోరాడి విజేతల్లా నిలిచే ధీరులు వాళ్ళు

గతం తాలూకు తీపి జ్ఞాపకాలు ఎరుగరు
భవిష్యత్తు గురించి బాధపడరు
వర్తమానంతో చేతులు కలిపి
దిగులు దరిచేరనీకుండా జీవించే సంపన్నులు వాళ్ళు
అమ్మా నాన్నలు లేని అనాథలే ఐనా
వాళ్ళు అందరిలాగే మనసున్న మనుషులు!

– ఎన్.లహరి
98855 35506



## తూకం

దుఃఖ పోగులను నేసుకుంటూ
భారంగా సాగుతున్నపుడు
కాస్త ఆనందం
అమృతంలా ఒలుకుతుంది
నలుపైన బతుకు చీరపై
జరీబూటా తళుక్కున మెరుస్తుంది!


శిశిరమైన మోడు చినుకు స్పర్శకు
చిగురు తొడిగి వసంతమై నవ్వుతుంది
మధ్యలో వదిలేసిన నది
మరల తారసపడి సముద్రాన్ని చేస్తుంది
కంటి చివర చీకటిపై వెన్నెల కురిసి
చందమామను చేస్తుంది
మార్గమధ్యలో తగిలిన మోకాలి దెబ్బకు
పసరు చేయొకటి మలాము పూస్తుంది

ఎగుడుదిగుడు బాటపై
హృదయం హూనమైనపుడు
సుతిమెత్తని దారి పరిచయమై
ప్రయాణాన్ని తేలిక చేస్తుంది

గుండె గుండెకు ఒక చరిత్ర
దేన్ని తాకినా
వేర్వేరు శృతులలో తంత్రులను మీటుతూ
వీణ మెట్లను అధిరోహిస్తూ
సంగీతాన్ని పలికించడానికి యత్నించే
చిత్ర విచిత్ర కథ!

అయినా
వేయి ఉక్కపోతలకు తుడిచేసి
ఊపిరి పోయడానికి
ఒక పిల్లతెమ్మెర చాలదూ
కొంత పోగొట్టుకుని
మరికొంత పొంది
తూకాన్ని సరి చూసుకుంటూ
తనను తాను బాగు చేసుకుని
ముందుకు కదిలేదే కదా జీవితం!

- పద్మావతి రాంభక్త
99663 07777



# మా ఊరి పీకే

- అద్దేపల్లి ప్రభు
98489 30203

విసుగు పుట్టించే సుదీర్ఘ నిరీక్షణ తరువాత మా మూటలు పట్టుకుని బస్సు ఎక్కాం. బ్యాలెట్ బాక్స్ అన్నీ సరిచేసుకుని కూర్చున్నాం. అసలే కోవిడ్ టైం. ఎన్నడూ ఎరుగని ప్రాంతాల్లో డ్యూటీ. మూతి మీది మాస్కుని సవరించుకుని కిటికీలోంచి చూస్తూ ఉన్నాను. కాస్త దగ్గరగానే పెద్ద పర్వతాలూ కొండలూ కనిపిస్తున్నాయి. ఎలక్షన్ డ్యూటీ అంటే చాలా ఆసక్తి నాకు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో  జనం ఓటు వేయడానికి రావడం, వాళ్ళ మాటలూ చర్చలూ వినడం బాగుంటుంది. తమ ఓటు ఏమి చేయగలదో ఎంతవరకూ తెలుసు వీళ్ళకు? ఎన్నికల్లో కుల ప్రాధాన్యం పెరిగిన సంగతి తెలిసిందే! "అందుకే ఒక్కో కులాన్ని ఒక్కో నియోజక వర్గంగా చేసేస్తే మనకి అసెంబ్లీలో పార్లమెంటులో స్థానిక సంస్థల్లో అన్నింట్లో అన్ని కులాలల ప్రాతినిధ్యం ఉంటుంది. ఆయా కులాల వాళ్ళు తమ ప్రతినిధిని ఎంచుకుంటే ఏ గోడవా లేదు కదా? రాష్ట్రంలోని ఒక కులం వాళ్ళంతా తమ కులం వాళ్ళకి ఓటు వేస్తారు." అంటే– "నువ్ మాట్లాడేది ఉత్త నాన్సెన్స్. ప్రజాస్వామిక సూత్రాలకే విరుద్ధం.." అంటాడు రాజు

"నాన్సెన్స్ ఏముంది? నువు తెలుగు దేశమనూ... వైఎస్సార్ అనూ. బీజేపీ అనూ... ఏ పార్టీ అయినా ఆ ప్రాంతంలో ఏ కులం ఎక్కువ వుంటే వాణ్ణే నిలబెడుతుంది. ప్రాక్టికల్‌గా జరిగేది అదే కదా? ఇంక దాపరికం ఎందుకూ? పార్టీలని పోజు లెందుకు?"అంటాన్నేను.

ఏవేవో చెపుతాడు రాజు. ప్రజాస్వామ్య సిద్ధాంతం ప్రజల్ని చైతన్యం చేయాలంటాడు. కుల ఐక్యత కాదు రాజకీయ ఐక్యత కావాలంటాడు. వ్యక్తి స్వేచ్ఛంటాడు... ఏవేవో అంటాడు.

కానీ, నేను నా వాదాన్ని సాగదీస్తాను.

"ఉదాహరణకి పోటీ చేసే వాళ్ళు వేరు వేరు సిద్ధాంతాలు చెపుతారు. మరేం పర్లేదు. ఆ కులం వాళ్ళు ఏ సిద్ధాంతం నచ్చితే ఆ సిద్ధాంతం చెప్పే తమ కులం వాడికి వోటేస్తాడు. ఏంటి ప్రోబ్లెం?"

"ఏడిసినట్టుంది. అందులో ఇక సిద్ధాంతం ఏముందీ?"

"అదే మంచిది కదా? అలా గెలిచిన వాడు సిద్ధాంతానికే కట్టుబడతాడు. వాడిని కులవాది అనడానికి వీలే లేదు. ఒక వేళ సిద్ధాంతం తప్పినా కులాన్ని వుంచుకుని సిద్ధాంతాన్ని వదిలేస్తాం. వాడే కులాన్ని పాలిస్తాడు. కుల పెద్ద అవుతాడు. అయినా మన కులం వాళ్ళు అన్ని పార్టీల్లో ఉండే కన్నా అన్ని పార్టీలూ మన కులంలోనే ఉంటం మంచిది కదా! అప్పుడు చగ్గా సిద్ధాంతమూ వుంటుంది. కులమూ ఉంటుంది.." అని గొంతు నొక్కుకుని దీన్నే బహుజన వాదం అంటారు."

"ఏడిచినట్టుంది" అన్నాడు కానీ, ఏమీ మాట్లాడలేదు.

ఇంకా వెలుగుండగానే వూర్లోకి వెళ్ళాం.

ఎల్లారు పాలెం ఆ వూరు. చిన్నదేం కాదు, వీధుల్లో టులెట్ బోర్డులు కూడా ఉన్నాయంటే పెద్ద వూరే. చిన్న చిన్న సిమెంటు వీధుల్లోంచి తిరిగి ఒక సెంటర్లో ఆపేసాడు డ్రైవర్. రూట్ ఆఫీసర్ నెంబర్లు చదవగానే మేం లేచాం. బస్సు దిగి సామాను పట్టుకుని సందులో ఉన్న ప్రాథమిక పాఠశాలలోకి ప్రవేశించాం. మాకు కేటాయించిన రూంలోకి వెళ్ళి ఎక్కడ ఏది ఎలా ఉంచాలో ప్లాన్ చేసుకున్నాం. నాతో పాటు ఒక ఎపీవోనే ఉన్నాడు. పంచాయితీ ఎలక్షన్లు కదా. ఎక్కువ స్టాఫ్ అవసరం లేదు. పైగా పోలింగ్ మధ్యాహ్నం వరకే. కానీ రాత పని మాత్రం మామూలే. బోల్డు కవర్లు. ఈ కవర్లన్నీ బ్రిటీషోడు తెచ్చాడో... సుకుమార్‌సేన్ తెచ్చాడో కానీ ఎన్ని ఎలక్షన్లు చేసినా

ఎప్పుడూ కన్ఫ్యూజనే.

"మాస్టారూ అవన్నీ తరువాత చేసుకుందాం లెండీ" అని బయటకి నడిచాను.

ఇంకా పూర్తిగా చీకటి పడలేదు. మేమున్న స్కూలు ముందుకు వీధి అలా పైకి లేచి మలుపు తిరిగింది. అక్కడే ఎత్తయిన కొండ వుంది. చుట్టూ కొండలే. నిజానికిది ఏజెన్సీ కాదు. తూర్పు కనుమల పాదాల్లో ఉన్న ఊరు. చివర ఉన్న బడ్డీలో సిగరెట్ కొని అతనితో– "చీకటి పడితే జంతువులేమన్నా వస్తాయేటండీ.." అంటూ బాతాఖానీ మొదలు పెట్టాను.

నవ్వాడు.

"లేల్లేదండి. ఇప్పుడేదున్నాయండీ. పూర్వం బంట్లూ పందులూ వచ్చేవంటారు గానీ మనకి తెల్దండి..." అన్నాడు.

అతను నడివయసు వాడు. బక్కగా వున్నాడు. తెలుపు నలుపుల గడ్డంతో బ్లాక్ అండ్వైట్ సినిమాలో కేరక్టర్లా ఉన్నాడు.

"గొడవలేవన్నా అవుతాయా?" అన్నా సిగరెట్ వెలిగిస్తూ.

"ఏం చెప్పలేమండి. అవ్వొచ్చు..."

గుండె జల్లుమంది. అలాంటివేం అవ్వండి అంటాడను కుంటే చెప్పలేమంటాడు.

"అంటే"

"కొన్ని వార్డుల్లో అవ్వచ్చుండి. అయినా మీకేటి పర్లేదండి"

పంచాయితీ ఎలక్షన్లలో యింతకు ముందు రెండు మూడు సార్లు గొడవలవడం తెలుసు నాకు. ఒకచోట దాదాపు కొట్టుకొనే స్థితికి వచ్చారు.

అతను అంటున్నాడు.

"మామూలుగా అయితే ఇయి సిన్న ఓట్లెలచ్చిన్లేగానండీ మాకియ్యే అసలైనవండి."

అతని వంక చూసాను. యింకో బేరమేదో చూస్తున్నాడు.

...'అయినా మీకేటండీ. పుల్లు పోలీసులు కదా!'' అంటున్నాడు.

"ఏటీ..." అందావిడ దీర్ఘం తీస్తూ..

"మేట్టారు గొడవలేవైనా అవుతాయా అంటున్నార్లే..."

"ఉన్నాడుగా ఆ యెదవనా బట్ట.. ఆడుంటే ఎన్ని గొడవలైనా అవుతాయి" అని గొణుక్కుటూ పోయిందామె.

ఊరు ఒకప్పుడు తెలుగు దేశం కంచుకోట! మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆ నియోజక వర్గంలో వైసీపీ వచ్చేసింది.

'గిరగిరా తిరుగుతోంది ఫానూ... నేనయిపోయా జగనన్న ఫానూ...' అంటూ పిల్లలూ కుర్రాళ్ళూ వూళ్ళమ్మట తెగ తిరిగారు. ఆ గాలికి నియోజకవర్గం కంచుకోట బద్దలాసిపోయింది. కానైతే ఈ వూరు మాత్రం తెలుగుదేశం పట్టులోనే ఉండిపోయింది.

ఇప్పటి ఎలక్షన్లు లాగిపెట్టిన ఎలాస్టిక్లా మారడానికి యింతకన్నా యింకేం కావాలి?

"ఊళ్ళో యెలవలున్నారండీ..."

"కాపులు.. తూర్పు కాపులు.. కొండరెడ్లు.. కొద్ది మంది శెట్టిగాళ్ళూ ఉన్నారు. మాలోల్లూ ఉన్నారనుకోండి. పెద్దగా మాదిగోళ్ళు లేరు. ఐదారు గడపలుంటాయి అంతే. మిగతా వాళ్ళున్నా ఆళ్ళు పెద్ద లెక్క కాదు. మామూలుగా అయితే యెలవలూ, కాపులూ టీడీపీయేనండి. కానీ యిప్పుడే కొంచెం తేడా కొడతందండి "

బడ్డీ దగ్గర చుట్ట ముట్టిస్తూ అన్నాడో పెద్ద మనిషి.

"అసలుకి బాబూ వూరంతా కొండోల్లే ఎక్కువండి. కాపోతే ఆల్లకీ ఎలచ్చన్లూ మాయలూ గట్రా తెల్దు కదండీ. ఓటైకపోతే సచ్చినోల్ల లెక్కల్లోకి తోసేత్తారని ఆళ్ళ నమ్మకం. అందుకని యేత్తారు. ఆల్లున్న వార్డులన్నీ వైసీపీయే అనుకోండి. "

వూరు మాటు మణిగింది. వీధి లైట్లు జిగేల్మని వెలుగుతూ వున్నాయి. సిమ్మెంటు రోడ్ల మీద వారకి ఇళ్ళ ముందు కూర్చున్న వాళ్ళు నిద్రకి పడుతున్నారు. రాత్రి అన్నం పేకెట్లేవో పంపారు. తినేసి సిగరెట్ కోసం వచ్చాను నేను. దూరంగా ఆకాశాన్ని అంటుతూ నల్లటి కొండలు. పైన నక్షత్రాలు బాగా కనిపిస్తున్నాయి.

"అంతా ఆ పీకే గాడి చేతిలో ఉంది" అంటున్నాడు బడ్డీ కొట్టు ఆసామి.

నాలుగున్నరకే లేచి తయారైపోయి బాలెట్ బాక్సుని స్టేషన్నీ రడీ చేస్తున్నాం. ఆరున్నర దాటాకా నలుగురైదుగురు వచ్చారు. వారి ముందు ఒక స్త్రీ ప్లేటులో పూలూ కొబ్బరి కాయా తీసుకుని ఉంది. బాలెట్ బాక్సుకి దణ్ణం పెట్టి పూలు జల్లి కొబ్బరి కాయని చుట్టూ తిప్పింది. బయట మెట్ల దగ్గరికి వెళ్ళి కొట్టి పక్కన పెట్టి బాక్సుకి మళ్ళీ దణ్ణం పెట్టుకుంది.

ఏజెంటుగా వచ్చిన కుర్రాడు "ఆవిడే ఈ వార్డు మెంబర్ కేండేటండీ'అన్నాడు.

ఏడింటినించీ పోలింగ్ మొదలు దాదాపు పన్నెండు దాకా వంచిన తలెత్తడానికి కూడా లేకుండా ఓటర్లు రావడం... ఓటు వేయడం...

బయట ఏవో కేకలు వినిపించాయి కానీ కదిలే పరిస్థితి లేదు. ఎస్సై కామాలు, లోపలికి వచ్చి 'మాస్టారూ... ఎవరన్నా అనుమానంగా కనిపిస్తే మా కానిస్టేబుల్కి అప్పజెప్పేయండి.." అన్నాడు.

"ఏమన్నా గొడవా"

"అబ్బే ఏంలేదు. చిన్న చిన్నవి మామూలేకదండీ.." అంటూ వెళ్ళి పోయాడు.

ఏజంటుగా వచ్చిన కుర్రాడు అంటున్నాడు. "పక్క వార్డులో గొడవండి..."

ఇంకో ఏజెంటు "పీకే గాడి వార్డు కదా. ఆ మాత్రం గొడవ అవదేటి?" అన్నాడు.

పోలింగ్ అయిపోయి బాక్సులు సీలు చేసి రడీగా ఉన్నాం.

■■■

ఊరి చివర హైస్కూలులో కౌంటింగ్. కొండ మొదట్లో ఉంది స్కూలు. వార్డు మెంబర్ల కౌంటింగ్ అయిపోయింది. ఒక్కో వార్డూ గెలిచినట్టు చెప్పగానే రోడ్డు మీద జనం జైజై అంటూ గోల. కొన్ని వార్డులు ఏకగ్రీవం. పార్టీల పేర్లయితే ఉండవు గానీ టీడీపీ వైసీపీ పోటాపోటీగా వచ్చాయిని కౌంటింగ్ ఏజంట్లు అంటున్నారు.

సర్పంచ్ ఓట్ల కౌంటింగ్ మొదలైంది.

ఒక్కో రౌండూ పూర్తయ్యాకా రూట్ ఆఫీసర్ రిజల్ట్‌ని చెపుతున్నాడు. బయట జనం నినాదాలతో హోరెత్తి పోతోంది.

ఐదు రౌండ్లు గడిచాయి. కౌంటింగ్‌ని చూస్తున్న ఒక వ్యక్తి లేచి, 'కౌంటింగ్ ఆపండి మాస్టారూ..." అన్నాడు.

రూట్ ఆఫీసర్ చూసి "ఏమైంది" అన్నాడు.

"యిలాగా మీరు లెక్క బెట్టి వార్డుల వారీగా చెప్పుకుంటూ పోతున్నారు. యిప్పటి వరకూ అన్నీ టీడీపీ మెజారిటీ వచ్చాయి. తరువాత వైసీపీ వచ్చిందనుకోండి. బయిటకెళ్ళాకా మమ్మల్ని బతకనీరు" అన్నాడు.

మేం లెక్క బెడుతూనే ఉన్నాం.

ఇంకో ఏజెంట్ "యిప్పుడు కౌంటింగ్ ఆపమంటే ఎలారా?'

రూట్ ఆఫీసర్ అంటున్నాడు. "ఇక్కడ పార్టీల గొడవ లేదు. అంకెల్లో తేడా వస్తే అడగొచ్చు. కానీ మెజారిటీ గురించి అడిగితే ఎలా?"

"అంకెలన్నీ సరిగానే ఉంటాయిండీ. కానీ అంకెలు చెప్పే లెక్క వేరుగా ఉంటుంది. ఇక్కడ పీకలు తెగిపోతాయి."

నేను స్లిప్పులు లెక్కబెడుతూనే నా పక్కన కూర్చున్న ఏజెంటుని అడిగాను.

"ఎవరయ్యా అతను"

"పీకే గాడండి. ఆడుంటే యిలాగే గొడవెడతాడు"

"ఏ పార్టీ"

"యిప్పుడు వైసీపీ ... ముందు టీడీపీ..."

చూసాను.

"అసలుకి ఆడి పేరు పీకే కాదండీ. కానీ పేపర్లలో పేరు చూసి ఈడికా పేరెట్టేసారు. ఈడు టీడీపీవోడండీ మొన్నటి దాకా... ఈ ఎలక్షన్‌కి సీక్రెట్‌గా పార్టీ మార్చేసాడు. యిప్పుడీ వూళ్ళో కాపులోట్లు చీలితే వైసీపీ వచ్చేద్ది. ఈడి లెక్క ప్రకారం ఏదో మతలబుందన్న మాట."

పీకే అంటున్నాడు

"యిప్పుడు గెలిచిన వార్డులన్నీ ఒక పార్టీయేనండీ. మీరేమో అలా ఎనౌన్స్ చేసుకుంటూ పోతున్నారు. ఇంకో రెండు మూడు రౌండ్ల తరువాత మా పార్టీ పెరుగుతుందండి. అప్పుడు హఠాత్తుగా ఎలా పెరిగిందని గొడవ చేస్తారండి. మేం బయిట కెళ్తే చంపేస్తారు కూడానీ. కాబట్టి రెండు మూడు రౌండ్లు ఎనౌన్స్ చేయకుండా ఆపి అప్పుడు చెప్పండి.."

రూట్ ఆఫీసర్ ఎర్రెక్కి పోయాడు.

"ఏమయ్యా నీ యిష్టం వచ్చినట్టు కౌంటింగ్ ఉండదు. దానికి పద్ధతులుంటాయి. మా రూల్ ప్రకారం మే పోతాం... అంతే మీరు కానీండి మాస్టారు.." అన్నాడు.

ఈ గొడవ బయటకి వెళ్ళినట్టుంది. బయట జనం పెరగడం మొదలైంది. అరుపులు కేకలు వినిపిస్తున్నాయి. గేటు దగ్గర పోలీసులు ఎవర్నీ లోపలకి రానీడం లేదు. బయటకీ వదలడం లేదు.

చీకటి పడిపోయింది.

కొండల దాపున ఊరు. ఏడయ్యిందో లేదో కటిక చీకటైపోయింది. రూట్ ఆఫీసర్ మెజారిటీని ఎనౌన్స్ చేస్తూనే ఉన్నాడు. ఏడో రౌండు తరువాత తక్కువలో వున్న కాండిడేట్ పెరగడం మొదలైంది. చివరి రౌండ్‌కి వచ్చేసరికీ తక్కువలో కేండిడేట్ వైసీపీ అతడు పన్నెండు ఓట్ల మెజారిటీతో ఉన్నాడు.

అప్పటికే కౌంటింగ్ ఏజెంట్లు కొంత మంది రైల్వే బొగ్గులా ఎర్రగా ఉన్నారు.

ఒకతను పెద్ద గొంతుతో "మేం ఒప్పుకోం.. మళ్ళీ రీ కౌంటింగ్ చేయాలి" అన్నాడు.

రూట్ ఆఫీసర్ అతని వంక చూసాడు.

"రీకౌంటింగ్ ఛాన్సే లేదు. మా రూల్ ప్రకారం ఎనౌన్స్ చేసేస్తున్నాం."

కౌంటింగ్ హాలులో కేకలు... అరుపులు...

పోలీసులు వాళ్ళందర్నీ లాక్కుపోయారు.

మైక్‌లో ఎనౌన్స్‌మెంట్ అయిపోయింది.

రోడ్డు మీద వైసీపీ వాళ్ళు జేజేలు కొట్టుకుంటూ వూర్లోకి పోయారు.

ఐదారొందల మంది పోగయి ఉన్నారు. రీకౌంటింగ్ చేయాలని అరుపులు పోలీసుల మీద కేకలూ.. నినాదాలు..

పోలీసులు గేటు మూసేసి దగ్గరకి ఎవర్నీ రానీకుండా నిలబడ్డారు.

"కాసేపు నినాదాలు చేసి వెళ్ళి పోతార్లెండి.." అంటూ పక్కకొచ్చాడతను.

మేము రూంలో కిటికీలోంచీ, మెట్ల మీదినించీ రోడ్డు మీద జనాన్ని చూస్తున్నాం. పిల్లల దగ్గర్నించీ పెద్ద వాళ్ళ వరకూ మా వంక చూసి శాపనార్థాలు పెడుతున్నారు. తిడుతున్నారు.

కుర్రాళ్ళు కొంతమంది కంఠనాళాలు తెగిపోయేలా అరుస్తున్నారు.

వూర్లో రెండు గ్రూపుల మధ్య కొట్లాట అవుతందట! కర్రలతో కొట్టుకుంటున్నారు. పోలీసులు కొంతమంది అటు పోయారు.

ఇక్కడ ఈ జనం గేటు తోయడానికి రావడం పోలీసులు లాఠీ చార్జీ చేయడం వెనక్కి మళ్ళడం...

అతని వంక చూసాను.

పీకే..

సన్నగా వున్నాడు. తలకి ఆముదం లాగా నూనె పట్టించి నున్నగా వెనక్కి దువ్వాడు. తెలుపు నలుపుల జుట్టు అతని బుర్రని బల్లిలా కరుచుకుని ఉంది. నుదురు పెద్దది. ఏభై ఏళ్ళు పైనుంటాయి. నుదుటి మీద గంధంచుక్క బొట్టు మెరుస్తోంది. పెదాల మీద తెల్లటి మచ్చ. ఎరుపులోకి తెలుపు దూరి పోయినట్టు ఒక రకం గోధుమ రంగులో ఉన్నాడు. పిల్లి కళ్ళు.

నవ్వి మళ్ళీ అన్నాడు.. "కాసేపు గొడవౌవుతుంది లెండి.. కానీ యిప్పుడుగానీ నేను బయిట కెళ్ళానా .." అని ఆగి.. కళ్ళు పైకి చూపించాడు.

ఇంకో మాస్టారు అడుగుతున్నాడు.

"ఎందుకండీ గొడవ? గెలిచాడు. అయిపోయింది కదా.."

"లాస్ట్ లెక్కపెట్టిన వార్డులు టీడీపీవండి. కానీ వైసీపీ వచ్చింది కదండీ. అదీ అసలు గొడవ.." అని ఆగి ఓసారి బయటకి చూసాడు. ఎవరో అతన్ని గమనించినట్లున్నారు. బండ బూతులు తిడుతున్నారు.

"ఆ రెండు వార్డులు నాయేనండీ.. అంటే వూళ్ళో యెలవలూ, కాపులూ టీడీపీయే. నేనూ టీడీపీ వోన్నే. అప్పుడు .. యిప్పుడు మారిపోయినా... మా లీడర్ని బట్టీ మేం కదా! ఈ రెండు వార్డులూ ఓట్లు చీలిపోయాలై కదా! అదీ ఆల్ల కోపం"

"అంటే ఇలా జరుగుతుందని ఎలా తెలుస్తుంది? ఎవరు ఎవరికేస్తారో వాళ్ళిష్టం కదా.."

నవ్వాడు అతను

"ఎవరూ ఎవరికీ ఎయ్యడానికేముంటుందండీ? మేనేజ్ చేయడం కదా కావాలి. కాపులెవరికేస్తారో... యెలవలెవరి కేస్తారో... కొండోల్లెవరికేస్తారో.. ముందే తెలిసిపోద్ది. యిప్పుడు కాపులు, యెలవల వోట్లు చీలాయి కదా.. మరి గొడవ కాదా.."

రాత్రి ఒంటిగంట అవుతోంది. కరెంటు పోయింది.

సెల్ లైట్ల వెలుతురు.

బయిట జనం గొడవ కొంచెం తగ్గింది. కానీ రోడ్డు మీదే వున్నారు. సరిగ్గా రెండవుతుండగా రయ్యిమని పోలీసు కారు.. వెనక ఓ వాన్‌లో పోలీసులు వచ్చారు. జీపులోంచి డీఎస్పీ దిగాడు. దిగడంతోనే కానిస్టేబుల్ చేతిలో లాఠీ లాక్కుని ఆ గుంపు ఈ గుంపు మీదా పడి నలుగురైదుగుర్ని బాదాడు.

మొత్తం అందరూ రోడ్డు మీంచి ఇళ్ళలోకి పారిపోయారు.

పది మంది పెద్ద వాళ్లు మాత్రం ఉండి...

"ఇలా దెబ్బలు కొడితే మేమేమీ ఆగిపోం. రీకౌంటింగ్ చేయాల్సిందే..." అన్నారు.

కానిస్టేబుల్ ఓ కుర్చీ తెచ్చి వేసాడు.

కూర్చున్నాడు డీఎస్పీ.

"ఏ నాకొడుకు రీ కౌంటింగడుతాడు? నానా గొడవలూ తీర్చి స్టేషన్ కెళ్ళగానే యిదో పనికిమాలిన గొడవా... ఏయ్ ఇలా రావయ్యా..." అని పిలిచాడు.

ఆ పదిమంది వచ్చారు.

"ఎంతయ్యా మెజార్టీ?"

"పన్నెండు"

"పన్నెండు వోట్ల మెజార్టీ వస్తే రీకౌంటింగా? ఒకటో రెండో పోనీ మూడో అంటే సరే పన్నెండు వోట్లకి ఎవడ్రా రీకౌంటింగడిదేది? "

"......"

"పావు గంటలో ఎవరింటికి వాళ్ళెళ్ళి పడుకోండి. కాదన్నారా.. మొత్తం అందర్నీ స్టేషన్‌కి పట్టుకుపోతా..."

అరగంటలో అంతా సద్దు మణిగి పోయింది.

డీఎస్పీ కారు ముందు... వెనక పోలీసు జీపు...

మా బస్సులు వెనక పోలీసు వేనులతో కదిలాం.

కొండల్ని చూస్తూ ఉన్నాను.

ఊరంతా నిశ్శబ్దంగా వుంది.

నా వాదన గుర్తొచ్చింది.

మన ప్రజాస్వామ్యంలో వోటు వేసేది కులాలేనా?

మనిషంటూ ఎవరూ లేరా? ■

**సాహిత్య ప్రస్థానం**

విలువైన పత్రిక ..

విలువలున్న పత్రిక

**చందాదారులుగా చేరండి ..**

**మీ మిత్రులను చేర్పించండి ..!**






# బహుముఖ గ్లోబల్‌లో అస్తిత్వ అన్వేషణే 'అంతర్హిత'

- డా. ఎ.రవీంద్రబాబు
8008636981

వర్తమానం గతంతో తెగదెంపులు చేసుకోడం అంత సులభం కాదు. కానీ నగరీకరణ, విదేశీయానం పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో వ్యక్తులు తమని తాము ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలను కుంటున్నారు. అస్తిత్వాల్ని వదిలేసి గ్లోబల్ గ్రామంలో ఒంటరి శిథిలాల్లో జీవించడంలోనే సౌఖ్యాన్ని వెతుక్కుంటున్నారు. విద్యాల యాల్లో చరిత్రకు చెదలు పట్టించడం మొదలై చాలా కాలమైంది. మానవీయ శాస్త్రాల మొలకల్ని కూడా ఏరిపారేస్తున్న నేటి విద్యా విధానంలో యాంత్రీకరణే మేధస్సుకు, ఉద్యోగార్జనకు మూలం అన్న (అ)సూక్తులు ఆచరణలోకి వచ్చి ఆమోదయోగ్యం కూడా అవుతున్నాయి.

ఈ నేపథ్యం నుంచే సమకాలీన సాహిత్యం వర్తమానాన్ని నిర్వచిస్తూ, విశ్లేషిస్తూ, సమీక్షిస్తూ భవిష్యత్తుకి దిశానిర్దేశం చేస్తూ ముందుకు సాగుతోంది. మానవీయ సంబంధాలే మనిషి మనుగడకు మూలం అని నిరూపిస్తూ మనుషులకు కర్తవ్యాన్ని బోధిస్తోంది. 2022 సిరికోన సాహితీ సంస్థ నిర్వహించిన డయాస్పోరా నవలల పోటీలో శ్రీసుధ మోదుగ రాసిన 'అంతర్హిత' ఉత్తమ నవలగా ఎంపికైంది. డయాస్పోరా ఇతివృత్తంతో, ప్రాంతీయ అస్తిత్వాన్ని అన్వేషిస్తూ, సామాజిక సమస్యలను, వాటి పరిష్కారాలను అరుదైన శిల్పంతో చూపిన రచన ఇది. బహు ముఖీనంగా సాగే ఈ నవల మనిషి సంఘర్షణలకు, సంవేదనలకు కారణం సామాజిక బంధనాల్లో ఉండే మూఢ నమ్మకాలు, ఆచా రాలే అని నిరూపిస్తుంది. అంతేకాదు సమకాలీన భిన్న సమస్యల ను ముడిపెడుతూ మూడు తరాల మధ్య అల్లిన చారిత్రక సామాజిక నవల ఇది.

"1936 నుంచి 1996 మధ్యకాలంలో అనేక ఆటుపోట్లను తట్టుకుంటూ నిలబడిన కొంతమంది వ్యక్తుల ఆవేదన, స్థైర్యం, త్యాగం, ప్రేమ, సాహసం వంటివి ఈ నవలలో కనిపిస్తాయి" అని రచయిత్రే చెప్పుకున్నారు. మరి వారి జీవితాల్లో ఎదురైన ఆటుపోటుల్ని, భయాల్ని, వేదనల్ని, అందుకు కారణమైన సామాజిక రుగ్మతల్ని, కోపాన్ని, కసిని, భూస్వామ్య వ్యవస్థలోని దుర్మార్గాల్ని, విద్యాలయాల్లో డ్రగ్స్‌కు బానిసలవుతున్న విద్యార్థు ల్ని, వారి జీవితాల్లోని చీకటిగుహల్ని, దేశవిదేశాల నేపథ్యాలతో పాత్రలను ఎంపిక చేసుకుని ఏకతాటిపై నడిపిన రచయిత్రి కథనవ్యూహం అద్భుతం. ఇక పాత్రల మధ్య ఉండే రక్త, మానవీయ స్పర్శ సంబంధాలతో పాటు, వాటి జీవితాలను నిర్దేశించే, నిర్ణయించే సామాజిక సమస్యలను నవలలో శ్రీసుధ సమ్మేళనం చేసిన తీరు సమ్మోహనమే.

నవలలో ప్రధాన పాత్ర అరియ. అరియ జమైకా నుంచి తన మూలాలు వెతుక్కుంటూ ఇండియా వస్తుంది. అరియా వెతుకులాటలో ఆమెకు ఎదురయ్యే అనుభవాలు, ఆమె మూలా లు ఎంతో కర్కశంగా తెలంగాణలోని వడ్డెమాను గ్రామంతో ముడిపడి ఉంటాయి. అరియ అమ్మమ్మ రోస్మా లచ్చిమిగా ఆ ఊర్లో జోగినీ వ్యవస్థకు ఎలా బలైంది? తెలంగాణ గడీలు దొరల పెత్తనంలో దురాగతాలకు ఏవిధంగా నిలయాల య్యాయి? కింది కుల స్త్రీలను దొరలు వావివరుసలు లేకుండా ఎలా బలాత్కరించేవాళ్లు? లాంటి ఎన్నో కఠోర వాస్తవాలు అరియకు తెలుస్తాయి.

లచ్చిమి జమైకా వెళ్లినా అక్కడా ఆమెని, ఆమె కూతుర్ని వదలని దొరలలో కరుడుకట్టిన జోగినీ విధానంలోని మూఢత్వ చర్యలను, అత్యాచారాలను కళ్లకు కడుతుంది నవల. భూస్వామ్య వ్యవస్థ స్వభావాన్ని తనలో ఇముడ్చుకున్న శకుంతలాదేవి లాంటి పాత్రలో మార్పు కనిపిస్తుంది. దేవి, లచ్చిమికి చిన్నప్పటి స్నేహితురాలు. జోగినీలుగా మారిన, మారుతున్న స్త్రీలను కాపాడుతూ, వారికి రక్షణ కల్పిస్తూ, వారికోసమే ఆశ్రమాన్ని

నడుపుతుంది. దేవి నేపథ్యం, నేపాల్‌తో ఆమెకున్న సంబంధం సామాజికమైనదే కాదు, వైయక్తికమైనది కూడా.

అరియ ఢిల్లీ జెఎన్‌యులో చేరిన తర్వాత ఆమె సూట్‌కేస్‌లో డ్రగ్స్ దొరుకుతాయి. దాని వెనకున్న రహస్యాన్ని బద్దలు కొట్టే సందర్భంలో ఉన్నత విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్ వ్యాపించడం వెనుక విదేశీయుల హస్తమే కాకుండా, స్వదేశంలోని బడాబాబుల పిల్లలు, వారిని కాపాడే తండ్రుల చర్యలు, లావాదేవీలు అన్నీ బయటకొస్తాయి. అరియ పాత్రను తీర్చిదిద్దే క్రమంలోనే విద్యాలయాల్లోని ర్యాగింగ్ భూతాన్ని, అంతర్జాతీయంగా కనిపించే జాత్యహంకార సమస్యను చర్చకు పెట్టారు రచయిత్రి.

నవలలో మరో ముఖ్య పాత్ర అరియ స్నేహితురాలు చార్లీ. చార్లీ జీవితం అతలాకుతలం అయిన దిగుడు బావి లాంటిది. 'నేను ఎవర్ని అన్న ప్రశ్న కంటే, ఎలా బతకాలి అన్న ప్రశ్నే ఆమెకెప్పుడూ'. డ్రగ్స్ రాకెట్ నడిపే డానియల్ ఆదుకోవడమే కాకుండా, అతనికి అనుకూలంగా కూడా చార్లీని వాడుకుంటాడు. డ్రగ్స్ అనేది ఓ అతర్జాతీయ సమస్య అది మనదేశంతో పాటు అనేక దేశాల్ని, ఆ దేశాల్లోని అనాథల్ని, ప్రభుత్వాల్ని, విద్యార్థుల్ని ఎలా నాశనం చేస్తుందో చార్లీ, ఇంకెబ, డానియల్ లాంటి పాత్రలు మనకు చూపిస్తాయి. ఇక భార్గవి పాత్ర ప్రత్యేకమైంది. దేవి రక్షణలోంచి బయటకొచ్చి జర్నలిజానికి నిజమైన అర్థాన్నిచ్చే పనులు చేస్తుంది. తెలివిగా అరియను డ్రగ్స్ కేసునుంచి బయటకు తీసుకొస్తుంది. అణచివేత, వెట్టిచాకిరి, సామాజిక అసమానతలే విప్లవం రావడానికి కారణం అని నమ్ముతుంది. నల్లమల అటవీ ప్రాంతంలో ఉండే తండా ప్రజలు విషజ్వరాలతో చనిపోతుంటే ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వారిని కలిసి, ఆ సమస్యల మీద ఆర్టికల్స్ రాస్తుంది. లౌక్యం, తెలివి, ధైర్యం, వృత్తిపట్ల నిబద్ధత కలిగిన పాత్ర భార్గవి.

మాధవ్, తల్లిదండ్రుల ప్రేమ సరిగ్గా దొరక్క సమాజంలోని ఆర్థిక, సామాజిక ఎత్తుపల్లాలను పూడ్చాలని నక్సలైట్‌గా మారతాడు. దళనాయకుడిగా ఎదుగుతాడు. వర్తమాన సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల వల్ల సిద్ధాంత నిబద్ధత కన్నా సేవే లక్ష్యంగా పనిచేస్తుంటాడు. దళాల్లో నిజాయితీ తగ్గుతోందని, ఉద్యమం తన లక్ష్యాన్ని సాధించలేకపోతోందన్న అసంతృప్తులతో లొంగిపోయి ప్రజాజీవితంలోకి వస్తాడు. తన తాత, తండ్రులు దొరలై దుర్మార్గాలు చేస్తే మూడో తరమైన మాధవ్, వాటి మీదే పోరాటం సాగిస్తాడు. సమకాలీన నక్సలిజం ఎదుర్కొంటున్న సమస్యలను, ఉద్యమ తీరును, నక్సలైట్ల నిబద్ధతను కొంతవరకు నవలలో మాధవ్, ఎంకన్న పాత్రల ద్వారా వెల్లడవుతుంది.

వెంకట్రావు, ఈశ్వరి, నాయక్ మధ్య ఉన్న ప్రేమ, స్నేహ సంబంధాలు, విలువలు ఆదర్శంగా కనిపిస్తాయి. మాధవ్, భార్గవి కుటుంబ వ్యవస్థను కాదని, కలిసి జీవించాలని నిర్ణయించుకోవడంలో సమాజానికి ఏదైనా చేయాలన్న తపన వారిలో కనిపిస్తుంది. మేపేయర్ లాంటి స్వచ్ఛమైన నానమ్మ, నిజమైన ప్రేమకోసం తపించే హ్యారిసన్, స్నేహానికి అర్థాన్నే కాకుండా ఆచరణను చూపే ఫాదర్ జార్జ్, వృత్తిలో ఎంతటి రిస్క్ అయినా తీసుకొని ముందుకెళ్లే వేణు, సయ్యద్ మనకు ఈ నవలలో తారసపడతారు. నిజాయితీకి, మంచితనానికి నిలువుటద్దాల్లా నిలబడతారు.

నవలలో ఏ పాత్ర ఎప్పుడు, ఏ సన్నివేశంలో, ఏ సంఘటనలో, ఏ సందర్భంలో ప్రవేశించాలో కచ్చితమైన నిర్మాణాత్మక కథనంతో ముందుకెళ్లారు రచయిత్రి. పాత్రల మధ్య బంధాలను, వాటి సామాజిక, సాంస్కృతిక కోణాలను కచ్చితమైన, తర్కబద్ధమైన బాధ్యతతో నిర్వహించారు. సామాజిక రుగ్మతలు మనుషుల్ని ఎలా లాక్కెళ్తాయి, వాటికి జాతీయ అంతర్జాతీయ సంబంధాలు, ఆ కాలంనాటి చారిత్రక పరిస్థితులు ఎలా తోడవుతాయి అన్నది కాల్పనికతకు వాస్తవికతను ముడిపెట్టి చెప్పగలిగారు. లచ్చుమ్మ జమైకా వెళ్లి స్థిరపడటం, దేవిని తీసుకుని ఫాదర్ బినోద్ ఇండియా రావటం, ఇంగ్లాండ్ వెళ్లిన అరియ అక్కడ క్రిస్టఫర్‌తో ఆకర్షణ అనే ప్రేమలో పడటం, దాని నుంచి బయటపడే క్రమంలో అమ్మమ్మతో పడే సంఘర్షణ... అన్నింటిని శ్రీ సుధ సన్నివేశాల అంతర్గత సంబంధంతో అద్భుతంగా మలచారు. ఊహకు చరిత్రకు మధ్య తేడాను తెంపే క్రమంలో రచయిత్రి అనుసరించిన విధానం అబ్బురపరుస్తుంది. అంతర్జాతీయ వలసల వెనకున్న భౌగోళిక, ఆర్థిక, శ్రమ కారణాలను చారిత్రక సత్యాలతో ముడిపెట్టి చెప్పారు. '1944లో జమైకాలో వచ్చిన పెనుతుఫాన్ ఎంతోమంది జీవితాల్ని అతలాకుతలం చేసింది. అదే సమయంలో యూరప్‌లో ఉన్న అనేక దేశాలు రెండవ ప్రపంచ యుద్ధం వల్ల ఆర్థికంగా కుదేలయ్యాయి. గ్రేట్ బ్రిటన్‌లో పనివాళ్ల కొరత ఏర్పడటంతో కొత్త ఇమ్మిగ్రేషన్ పాలసీలను ప్రవేశపెట్టారు. ఇంగ్లీషు మాట్లాడగలిగే కరేబియన్స్ వలసల్ని ప్రోత్సహించారు. 1948లో ఇంగ్లాడ్‌కి వలస వెళ్లిన విండ్ రష్ జనరేషన్‌లో జారెట్ సోదరులు వెర్నన్, కార్లటన్ కూడా ఉన్నారు' అంటూ అరియా తాత జారెట్ సోదరులు, ఆ తర్వాత అరియా ఇంగ్లాండ్ వెళ్లడానికున్న నేపథ్యాన్ని సిద్ధం చేసుకున్నారు రచయిత్రి.

తెలంగాణ నుంచి జమైకాలో చెరుకు తోటల్లో పనిచేయడానికి కుటుంబాలు వలసలు వెళ్లడం, వాళ్లలో లచ్చిమి పాత్రను కలపటం యాదృచ్ఛికం కాదు; చరిత్రలో భాగంగా చూడమని చెప్పడమే శ్రీసుధ ఉద్దేశం. ఇంకా అనేక చోట్ల సంవత్సరాలను, స్థలాలను కూడా ప్రస్తావించారు. అలాగే తెలంగాణలో దొరల పాలన, అధికారం, దుర్మార్గాలు, వాటికి వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటలను ప్రస్తావిస్తూ, అందులో భాగంగానే భీమేశ్వర రావు, జగదీశ్, బాబుదొర పాత్రలను చిత్రించడం చరిత్రను నవలలో భాగం చేయడమే, రచనను సామాజిక నవలగా తీర్చిదిద్దడమేనని చెప్పొచ్చు. 'తెలంగాణ కమ్యూనిస్టు, రైతాంగ విమోచనోద్యమాల స్ఫూర్తి పాలమూరును తాకడంతో ఊర్లలో

కామాంధులైన దొరలకు వణుకు పుట్టసాగింది. భీమేశ్వరరావు పెద్దకొడుకు జగదీశ్ అకృత్యాలు పెచ్చుమీరడంతో తెలంగాణ విమోచన ఉద్యమకారుల చేతుల్లో చచ్చాడని చెబుతారు. విచ్చలవిడిగా పెట్రేగిపోతున్న చిన్నకొడుకు బాబుదొరను ముందు జాగ్రత్తగా పట్నానికి పంపాడు భీమేశ్వరరావు' అని రాస్తారు రచయిత్రి. ఇక పెంటమ్మ, లచ్చిమి, భార్గవి జీవితాలు జోగినీ వ్యవస్థ వల్ల దెబ్బతిన్నవే. లచ్చిమి జోగినిగా మార్చే క్రమంలో జరిగిన విపత్తు మరింత ప్రమాదకరమైంది 'లచ్చిమికి పసుపు నీళ్లతో స్నానం చేయించి తెల్లరంగు చీర, తెల్లరంగు జాకెట్టు కట్టి ముస్తాబు చేశారు. నొసటి నిండా కుంకుమ బొట్టు పెట్టి, చీరకు పసుపు కుంకుమలు జల్లి పెళ్లికి సిద్ధం చేశారు. గుడికాడ పందిరేసి, అందులో లచ్చిమికి పోతురాజుతో తాళి కట్టించి పెండ్లి తంతును పూర్తి చేశారు. జుట్టు విరబోసుకొని యాపమండలతో పోతురాజు పక్కన ఊరేగింపుగా నడుస్తోంది లచ్చిమి.

అప్పటిదాకా జరుగుతున్న తతంగమేమీ తెలీక అసలీ లోకంలో లేనట్టుగా బేలగా నడుస్తున్న లచ్చిమి మీద ఒక్కసారిగా విరుచుకు పడి భుజాలపై ఎత్తుకొని వెళ్లి గుడిలోనే కిరాతకంగా బలత్కారం చేశాడు బాబుదొర. తర్వాత కూడా బంగ్లాలో పెట్టి చిన్న లచ్చిమిపై తన ప్రకోపం చూపేవాడు. లచ్చిమి కూతురు విదేశాల్లో ఉన్నా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటుంది. అరియాను కని చనిపోతుంది.

'అంతర్వీత' నవల ప్రారంభం నుంచి చివరి వరకు సందర్భాను కూలంగా పాత్రల చిత్తవృత్తులను వివరిస్తూ, రచయిత ప్రవేశించి భిన్న సందర్భాల్లో చెప్పిన, పాత్రలతో చెప్పించిన వాక్యాలు మనిషి జీవితాన్ని విశ్లేషిస్తాయి. సమీక్షిస్తాయి. ఆలోచనలు రేకెత్తిస్తాయి. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయడానికి ఉపకరిస్తాయి. సమకాలీన ప్రపంచ పురోభివృద్ధిని, తిరోగమనాన్ని విశ్లేషిస్తాయి. జీవనయానంలో ఎదురయ్యే సంఘర్షణల లోతుల్ని తర్కిస్తాయి. మనిషి లోపలుండే భయాలు, చెరపలేని అస్తిత్వపు ఉత్తుంగ తరంగాలు, హృదయాన్ని పట్టి ఉంచే ద్వేషాలు, పగలు, వాటి వెనుక దాగిన మూఢాచారాలు వంటి వాటన్నింటిని వ్యాఖ్యానించే ప్రయత్నం చేస్తాయి.

"ఇప్పుడు సివిక్ సెన్స్ అంటే ఎదుటి వాళ్లకి సహాయపడటానికి కాదు, వాళ్ల జీవితాల్లో ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి. ప్రతి దాన్లో దూరి ఏదో ఒక తీర్పు ఇవ్వాలి. అదే ఇప్పుడున్న సెన్స్' నేటికాలంలో తాము సామాజాన్ని ఉద్ధరిస్తున్నాం అనుకునే వాళ్లు, ఉన్నతంగా జీవిస్తున్నాం, ఇతరులకు సాయం చేస్తున్నాం అనుకునే వాళ్లు చేస్తున్న పనుల్లో ఎక్కువ కనిపిస్తుంది ఇదే. "క్రమశిక్షణ మనం మనకోసమే పెట్టుకొనేది. ఎవరికోసమో కాదు" ఈ వాక్యం క్రమశిక్షణ పేరుతో అధికారులు, పాలనా వ్యవస్థ, విద్యావిధానం అనుసరిస్తున్న విధానాలను తుత్తునియలు చేస్తుంది. వ్యక్తిని వ్యవస్థ ఎలా క్రమశిక్షణ పేరుతో అణచివేస్తుందో కూడా అర్థమయ్యేలా చేస్తుంది.

'తమ మూలాల గురించి, చరిత్ర సంస్కృతి గురించి తెలియని వ్యక్తులు వేర్లు లేని చెట్లవంటివారు'. వ్యక్తివాదం ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో, నాది నేను అనే స్వార్థం ఎక్కువవుతున్న రోజుల్లో చరిత్ర, సంస్కృతికి కాలం చెల్లుతోంది. కానీ వాటిని పట్టించుకోనప్పుడు మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్న సత్యం ఈ మాటల్లో వ్యక్తమవుతుంది.

షేక్స్పియర్ రాసిన 'మాక్ బెత్' పుస్తకాన్ని అరియ పాత్ర అర్థం చేసుకున్న విధానాన్ని చెప్తూ 'మాక్‌బెత్ ఆధిపత్య కాంక్ష, తెలివి తన అంతరాత్మకు వ్యతిరేకంగా పురికొల్పాయి. ఆమె ఎప్పుడు బలహీనపడిందో అప్పుడు మళ్లీ అంతరాత్మ తనను ఆక్రమించుకుంది" అంటుంది శ్రీసుధ. అలాగే రోస్మా జారెట్ గురించి అన్న మాటలు ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో తారసపడే ఉంటాయి. 'మరింత ఒంటరై, ఏమీ చేయలేని నిస్సహాయత ఆవరించినప్పుడు మనల్ని అత్యంత ప్రేమించిన వ్యక్తులు జ్ఞాపకం వస్తారేమో!'. రాజ్యం ప్రజలను సక్రమ మార్గంలో పెట్టడానికి అనుసరించే విధానాలను గుర్తుచేస్తూ 'చట్టాలు, న్యాయస్థానాలు, జైళ్లు ఉండేది మనల్ని రక్షించడానికో, శిక్షించడానికో కాదు బాగీ, మార్చడానికి. కాని సమాజానికి చట్టం మీద, శిక్షల మీద భయం తప్ప గౌరవం పోయింది' అని మరో పాత్ర ద్వారా పలికిస్తారు. గౌరవం పోవడానికి కారణం అవి అపసవ్య దిశలో అమలు కావడమే అన్న ఆలోచన ఇక్కడ నిజమేననిపిస్తుంది.

'అస్థిమిత ప్రపంచంలో స్థిరంగా నిలిచే మనుషులు ఎవరున్నారు? ఎక్కడున్నారు ఎలా ఉంటారు?' అని అరియ అన్న మాటలు మనిషికి, ప్రపంచానికి ఉన్న సంబంధమే కాకుండా, నేటి ప్రపంచ పోకడని అవగతం చేసుకునే పద్ధతినీ గుర్తుచేస్తాయి. వార్తలను, వాటిని ముద్రించే పత్రికలను ప్రస్తావిస్తూ ఓ చోట భార్గవి 'బయటకి వచ్చే ప్రతి వార్త వెనుక చాలా అబద్ధాలు ఉంటాయి. నేరస్తుడు ఎంత బలహీనుడైతే మనం వార్తలను అంత నిజాయితీగా చూపిస్తాం. బలవంతుడు వ్యవస్థని మానిప్యులేట్ చేస్తాడు' అంటుంది. అధికారం, ధనం వార్తలను ఎలా ప్రభావితం చేస్తాయో, అవి బలహీనుల పక్షం ఎందుకు వహించవో ఈ ఒక్క వాక్యం ద్వారా వెల్లడవుతుంది.

మరోచోట 'వ్యవస్థల్లో ఉండే లోపాలు ఆ సమాజపు లొసుగుల్లోనుంచి పుట్టుకొస్తాయి. / ప్రతి మనిషి జీవితానికి వారి అనుభవాలను బట్టే రిఫరెన్స్‌లు మారిపోతుంటాయి' అంటారు. ఇక్కడ వ్యవస్థల్లో కనిపించే లోపాల నేపథ్యాన్ని, వ్యక్తుల అభిప్రాయల వెనుక థియరీనీ చెప్పే ప్రయత్నం చేశారు రచయిత్రి.

భావుకత, గ్లోబల్ ఇతివృత్తం, అస్తిత్వ అన్వేషణా కాంక్ష, వర్తమాన సామాజికత, పాత్రల వైయక్తిక, బహుముఖ సంఘర్షణ, ప్రవాసుల జీవన సమస్యల సమ్మేళనమే ఈ 'అంతర్వీతం' నవల. ■



# వర్తమాన స్త్రీవాదం బహుముఖాలుగా విస్తరిస్తోంది

- ప్రముఖ రచయిత్రి ఓల్గా

**"స్త్రీవాదంలో ప్రశ్నలు, సమస్యలు నిరంతరం పుడుతూనే ఉంటాయి. సమాజంలో ఏదో ఒక అంతిమ సమాధానం దొరికి, సమస్యలు ఇక తలెత్తవని, ప్రశ్నలు పుట్టవని అనుకోవడం సరికాద"ని అన్నారు ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా అన్నారు. కవి, రచయిత డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య 'సాహిత్య ప్రస్థానం' తరఫున ఆమెతో ముచ్చటించారు. ఆ ముఖాముఖీ ఇదీ...**

**మీ బాల్యం విద్యాభ్యాసం క్లుప్తంగా చెప్పండి ...**

నా బాల్యం మొత్తం గుంటూరులోనే గడిచింది. పూర్తి పట్టణ జీవితమే నాది. సెయింట్ జోసెఫ్ ఆసుపత్రిలో 1950 నవంబరు 27న జన్మించాను. సెయింట్ జోసెఫ్ హైస్కూల్లోనే 12వ తరగతి పాసయ్యాక, ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో 1970లో బి.ఎ., 1972లో ఎం.ఎ పూర్తి చేసి, ప్రీ- పిహెచ్.డి పరీక్ష కోసం ఒకఏడాది ఆంధ్రా విశ్వవిద్యాలయానికి హాజరయ్యాను.

**మీది కమ్యూనిస్టు కుటుంబ నేపథ్యం అని విన్నాను. ఆ వివరాలు చెప్పండి?**

అవును. మా నాన్నగారు పోపూరి వెంకట సుబ్బారావు తొలినాళ్ళ కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేశారు. ఆ భావాలు, ఆ సాహిత్యం మా ఇంట్లో అతి సహజంగానే ఇమిడిపోయాయి. 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయాక మా నాన్నగారు ఆ కార్యక్రమాలకు బాగా దూరమయ్యారు. కానీ ఆ భావాలు, ఆ పుస్తకాల ప్రభావం ఎప్పటికి దూరం కాలేనంత బలంగా నా హృదయంలో నాటుకుపోయాయి.

**తెలుగుపై మీకింత ఆసక్తి కలగటానికి కారణం?**

మా ఇంట్లో నాకు అక్షరజ్ఞానం వచ్చిన దగ్గర నుండి చదివిన గొప్ప తెలుగు సాహిత్యమే నా ఆసక్తికి కారణం.

**మీ తొలిరచన ఎక్కడ ప్రచురితమైంది?**

ఏ.సి కాలేజీ మ్యాగజైనులోను, ఆ తర్వాత పైగంబర కవితా సంకలనం 'యుగ సంగీతం'లోను ప్రచురితమయ్యాయి.

**పోపూరి లలితకుమారి 'ఓల్గా'గా మారిన సందర్భం?**

వ్యక్తిగత సందర్భమే! మా అక్కయ్యకు మా నాన్నగారు సోవియెట్ యూనియన్ ప్రభావంతో 'ఓల్గా' అని పేరుపెట్టారు. దురదృష్టశావత్తూ నా పదహారవ యేట ఆమె మరణించింది. అప్పుడే రచనా వ్యాసంగంలోకి ప్రవేశించిన నేను మా అక్కయ్య పేరు కలం పేరుగా చేసుకుని ఆమెను సజీవం చేయాలని 'ఓల్గా' అనే పేరుతో రాస్తున్నాను. నా తల్లిదండ్రులకు, సమాజానికి ఓల్గా సజీవమే!

**పైగంబరకవుల బృందం నుంచి విరసం కు, అక్కడనుంచి స్త్రీవాద ఉద్యమానికి జరిగిన ప్రస్థానం క్లుప్తంగా చెప్తారా?**

నేను విద్యార్థి ఉద్యమాల్లో 1966-69 మధ్య చురుకుగా పనిచేశాను. 1968 నుంచి గుంటూరు స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ఉన్న ముఖ్యులంతా శ్రీకాకుళోద్యమంలో భాగమయ్యారు. నేనూ ఆ ఉద్యమంలో పాలుపంచుకున్నాను. విరసం ఏర్పడినప్పుడు అందులో సభ్యురాలినయ్యాను. మార్క్సిస్టు- లెనినిస్టు పార్టీ చీలికలు ప్రజా సంఘాల్లో కూడా రావడంతో విరసం నుంచి జనసాహితి సాంస్కృతిక సమితి సంఘంలో చేరి, ఆ తర్వాత అక్కడ నుంచి కూడా బయటకు వచ్చేశాను.

**మీరు స్త్రీవాదంలోకి అడుగిడడానికి ప్రేరణ ఎవరు?**

నాకు నేనే ప్రేరణ! ఎందుకంటే ఉద్యమాలలో, జీవితంలో నేను ఎదుర్కొన్న సంఘటనలు, ప్రశ్నలు వచ్చిన సందర్భాలు, చదివిన సాహిత్యం నన్ను నేనొక స్త్రీవాదిగా మలుచు కోవడానికి దోహదం చేశాయి.

**'కేవలం ఆర్థిక స్వాతంత్ర్యంతోనే మహిళలకు స్వేచ్ఛ**

**వచ్చినట్టు కాదు, చట్టసభల్లో మహిళలు విధాన నిర్ణయకర్తలు అయినపుడే అది సాధ్యపడుతుంది' అని ఒకచోట అన్నారు. అది త్వరలో నెరవేరుతుందని ఆశించవచ్చా?**

త్వరలో నెరవేరదనే చెప్పాలి. స్త్రీలకు 33 శాతం రాజకీయ భాగస్వామ్యం ఇప్పట్లో రాదు. అది వచ్చేసరికి స్త్రీలు పురుషాధిపత్య, పితృస్వామ్య భావజాలం పూర్తిగా వంటబట్టించుకునే అధికార రాజకీయాలలోకి, ఎన్నికల రాజకీయాలలోకి వస్తారనిపిస్తున్నది. ప్రజా రాజకీయాలలో జండర్ సమానత్వ భావనలు దృఢంగా స్థిరపడి, అవి అధికార రాజకీయాలలోని స్త్రీలపై ప్రభావం చూపినప్పుడు, మౌలిక మార్పులు మొదలవవచ్చు. దీనికి చాలా కాలం పట్టవచ్చు.

**నరేటివ్ ట్రెండ్ ఎక్కువగా ఉన్న నవలలను వదిలి కథలు చేపట్టడానికి కారణం?**

నేను నవల, కథ ... రెండు ప్రక్రియల్లోనూ రాస్తున్నాను. 2016లో 'గమనమే గమ్యం' అనే 400 పుటల పెద్ద నవల రాశాను. 2017లో 'యశోబుద్ధ' నవల రాశాను. ఈ సంవత్సరం మే 7న 'పంపాతీరం' నవలిక ప్రచురించాను. ఈ మధ్య కథలు రాయడం తగ్గింది. మనం ఎంచుకునే వస్తువును బట్టికదా ప్రక్రియ ఉండేది.

**స్త్రీవాదంలో ఉద్భవించిన అనేక సమస్యలకు, ప్రశ్నలకు సమాధానాలు లభించాయని భావిస్తున్నారా?**

స్త్రీవాదంలో ప్రశ్నలు, సమస్యలు నిరంతరం పుడుతూనే ఉంటాయి. సమాజంలో ఏదో ఒక అంతిమ సమాధానం దొరికి, సమస్యలు ఇక తలెత్తవని, ప్రశ్నలు పుట్టవని అనుకోవడం సరికాదు. సమాజంలో మార్పు నిరంతరం కాబట్టి సమస్యలు, ప్రశ్నలు, పరిష్కారాలు, సమాధానాలు నిరంతరం వస్తూనే ఉంటాయి.

**'అస్మిత సంస్థ తరపున సంకలనం చేసిన 'నీలిమేఘాలు' పుస్తకం కోసం ఎంపిక చేసిన చాలా కవితల్లో 'కవిత్వపు పాలు' తక్కువగా కన్పిస్తుంది అన్న విమర్శపై మీ సమాధానం?**

'నీలిమేఘాలు' కవితా సంకలనంలో కవిత్వం పాలు తక్కువనే విమర్శ నిజం కాదు. ఈ శతాబ్దపు రెండవ ఉత్తమ కవితా సంకలనం అని చేకూరి రామారావు అన్నారు. స్త్రీవాద భావాలు సరిపడని వారు కూడా కవిత్వపరంగా ఉత్తమ సంకలనమమని ప్రశంసించారు. ఇలాంటి విమర్శకుల వల్ల ఆ సంకలనం విలువ ఏమాత్రం తగ్గదు.

**మీరు కొంతకాలం ఉషాకిరణ్ మూవీస్‌లో స్క్రిప్టు విభాగంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పలు సినిమాలకు పని చేశారు. ఆ అనుభవం ఎలా ఉండేది?**

ఉషాకిరణ్ మూవీస్‌లో పనిచేసిన దశాబ్ద కాలంలో నేను సినిమా స్క్రిప్టు గురించి, సినిమాల గురించి ఎంతో నేర్చుకున్నాను. మేం తర్వాత సినిమాలు, టెలివిజన్ రంగాల్లో చేసిన పనికి ఈ అనుభవం చాలా ఉపయోగపడింది. చాలా మంచి వాతావరణంలో, స్వేచ్ఛగా పనిచేశాను. మంచి సినిమాలకు కథా విభాగం బాధ్యురాలిగా కథలను అందించగలిగాను. మౌనపోరాటం, మనసు-మమత, అమ్మ, అశ్వని, మామాశ్రీ వంటివి సమాజానికి ఏ మాత్రం హాని కలిగించనివి. అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు ఆ సంస్థ తరఫున వెళ్ళి, ఎన్నో మంచి సినిమాలను చూసి ప్రపంచ సినిమాపై గొప్ప అవగాహన పెంచుకున్నాను.

**మీ రచనల వివరాలు చెప్పండి?**

నా రచనలు సాహిత్య విమర్శ 6 సంకలనాలు, అనువాదాలు 10 పుస్తకాలు, సినిమా, టి.వి స్క్రిప్టులు, 9 సంపాదకత్వం వహించిన పుస్తకాలు, నృత్య రూపకాలు, నాటకాలు ... ఇలా మొత్తం 60 పుస్తకాలు ప్రచురించబడ్డాయి.

**మీరు పొందిన ఎన్నో అవార్డుల్లో ప్రముఖమైనవి ఏమిటి?**

అన్నీ నా రచనల పట్ల గౌరవభావంతో ఇచ్చినవే! అన్నీ ప్రముఖమైనవే! అయితే ప్రజల్లో కేంద్ర సాహిత్య అకాడెమీ ఎక్కువ విలువ ఉంది. రంగవల్లి మెమోరియల్ అవార్డు, సుశీలా నారాయణరెడ్డి అవార్డు, మాలతీ చందూర్ అవార్డు, విశాలాక్షి, కృష్ణమూర్తి ఫౌండేషన్, లోక్‌నాయక్ ఫౌండేషన్, అప్పాజోశ్యుల- విష్ణుభట్ల, కందాళై ఫౌండేషన్ ఇలా ఎన్నో అవార్డులు పొందాను. పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం వారిచ్చిన గౌరవ డాక్టరేట్ చాలా విలువైనది.

**స్త్రీవాదం బలంగా చెప్పడానికి కవిత లేక కథ ఏ ప్రక్రియ ఎక్కువ ప్రయోజనకారి?**

మనం బలంగా, కళాత్మకంగా చెప్పగలిగితే ప్రతి ప్రక్రియా ప్రయోజనకరమైనదే! అయితే ముందు చెప్పినట్లుగా మనం ఎంచుకునే వస్తువును బట్టికదా ప్రక్రియ ఉండేది.

**ఈనాటి స్త్రీవాదం స్థితిగతులెలా ఉన్నాయి?**

వర్తమాన స్త్రీవాదం బహుముఖాలుగా విస్తరిస్తోంది. సకల అణచివేతలను గుర్తించి, విశ్లేషించి సమాజంలోని అంతరువులను, ఆధిపత్యాలను అర్థం చేసుకోవడానికి ఉపకరించే ఒక సిద్ధాంత భూమికను తయారు చేస్తున్నది. దానిని సాహిత్య కళారూపాలలో, ఎకడమిక్స్‌లో, న్యాయశాస్త్రం, సోషియాలజీ, సైకాలజీ వంటి ఇతర శాస్త్రాలతో అనుసంధానం చేసి, మరింత సామాజిక అవగాహన కలిగించడానికి స్త్రీ వాదులు నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు. కులం, వర్గం, జండర్, జాతి, మత, భౌగోళిక అంతరువుల స్వభావ స్వరూపాలను విశ్లేషించడంలో స్త్రీవాదులు ముందంజలోనే ఉన్నారు. ■

## కలిమిశ్రీకి కుసుమ ధర్మన్న సాహిత్య సేవా పురస్కారం



తెలుగునాట 'మాకొద్దీ నల్లదొరతనం' అంటూ నినదించిన తొలి అంబేద్కరిస్టు కవి కుసుమ ధర్మన్న మనవరాలిగా, కవయిత్రిగా నేను 'కుసుమ ధర్మన్న సాహితీ కళాపీఠం' ఏర్పాటుచేసి ఇటీవల హైదరాబాద్లో సుప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి చేతుల మీదుగా ఆవిర్భావ సభ కూడా ఏర్పాటు చేశాను. మా తాత గారి ఆశయాలను, లక్ష్యాలను భవిష్యత్తరాలకు తెలియపరిచేందుకు ఏర్పాటైన ఈ సంస్థ ద్వారా పలు సామాజిక, సాహిత్యసేవా కార్యక్రమాలను చేపట్టబోతున్నాం. తొలుతగా సాహితీరంగం నుంచి ఒకరికి సాహిత్యసేవా పురస్కారాన్ని ఇవ్వాలని కళాపీఠం నిర్ణయం తీసుకుంది. ఈ పురస్కారానికి విజయవాడకు చెందిన నవ మల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ గారిని ఎంపిక చేశాము. కలిమిశ్రీ గత మూడున్నర దశాబ్దాలుగా పత్రికారంగం తో మమేకమై వున్నారు. 16 సంవత్సరాలుగా నవ మల్లెతీగ సాహిత్య మాసపత్రికను నిరాటంకంగా నడుపుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంతోమంది సాహితీవేత్తలకు ఆ పత్రికలో చోటు కల్పిస్తున్నారు. కొత్తతరం సాహితీవేత్తలను ప్రోత్సహించడంలో ముందడుగు వేస్తున్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం, మల్లెతీగ సాహిత్యసేవాసంస్థల ద్వారా ఎన్నో సాహిత్య కార్యక్రమాలు చేస్తూ కవులు, కళాకారులను ప్రోత్సహిస్తూ వారి ప్రతిభను గుర్తిస్తూ గౌరవిస్తున్నారు. కలిమిశ్రీ గారిని ఈ పురస్కారానికి ఎన్నుకోవడానికి ప్రధాన కారణం- ఆయన ఎంతో నిబద్ధతతో విలువలతో కూడిన నవమల్లెతీగ సాహిత్య మాసపత్రికను నడపడం, సాహితీసేవా కార్యక్రమాలు నిర్వహించడం.

జులై 16న విజయవాడలో కుసుమ ధర్మన్న సాహితీ కళాపీఠం నిర్వహించే ప్రత్యేక సాహిత్య కార్యక్రమంలో కలిమిశ్రీ గారికి కుసుమ ధర్మన్న సాహితీసేవా పురస్కారాన్ని అందజేస్తాము. ఈ అవార్డుకు రూ.11,116 ల నగదుతో జ్ఞాపిక, శాలువాతో సత్కారం వుంటుంది.

**– డా.రాధా కుసుమ**
**వ్యవస్థాపక ఛైర్మన్**
**కుసుమ ధర్మన్న సాహితీ కళాపీఠం, హైదరాబాద్**
**99892 41319**

## చిన నాగయ్య స్మారక పురస్కారం-2023

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు ఎం.చిన నాగయ్య స్మారక పురస్కారానికిగాను ఉత్తమ కవితా సంపుటి, ఉత్తమ కథా సంపుటి, ఉత్తమ వ్యాస సంపుటి, ఉత్తమ జీవిత చరిత్ర విభాగాల్లో రచయితల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నాగయ్య మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి ఎం.రాంప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. రచయితలు రెండు ప్రతులను ఆగస్టు 31లోగా పంపాలని కోరారు. చిరునామా : ఎం.రాం ప్రదీప్, 10-263-6, ఆర్చ్ రోడ్డు, సాయి రాఘవ కాలనీ, తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ 521235. ఫోన్ : 9492712836.

## నా కవిత్వం

నిజం చెబుతున్నాను నమ్మండి...
నాకు కవిత్వమంటే ఏవిటో తెలీదు
కవితంటే ఎలా వుంటుందో అసలే తెలీదు
నేను పండితుణ్ణి కాదు;
పాండిత్యంతో నాకసలు పరిచయమే లేదు
ఏదో ఒక వ్యాపకంగా
నాలుగక్షరాలను ఎంచుకొని
తెలిసిన పద్ధతిలో నాజూగ్గా అల్లుతున్నాను గానీ
నిజానికి వ్యాకరణమంటూ
ఏ గురువు దగ్గరా నేర్చుకోలేదు ...
అయినా ఏదో రాస్తున్నాను...
ముప్పయ్యేళ్ళుగా రాస్తూనే వున్నాను !

నా అక్షరాల కూర్పు నచ్చిన కొందరు
ప్రచురణకర్తలు; పత్రికాధిపతులు ఓర్పుగా
మార్పులు చేయకుండా వాటిని వేస్తూనే వున్నారు
మొహమాటమో, నా మీద అభిమానమో తెలీదు గానీ
నేను రాసినవి కవితలంటారు కొందరు
అది ఖచ్చితంగా కవిత్వమేనంటూ
నా భుజం తడుతున్నారు మరికొందరు

ఏదో నాకు తోచింది, నా మనసుకు నచ్చింది
నలుగురినీ ప్రేరేపించి; ప్రోత్సహించి
మంచివైపు మళ్ళింపజేయాలనీ
సమాజంలోవున్న కుళ్ళును కడిగే దిశగా
నా కలంతో జనాన్ని కాస్తంత జాగృతం చేయాలనీ
తృష్ణతో కూడిన తపనతో
నాలుగు పదాలను పదిలంగా పేర్చుతూ
వాటిని కొంచెం ప్రాసయుక్తంగా ప్రయోగిస్తూ
చదివేవాళ్ళ నోటికి సొంపుగా
వినేవారి వీనులకింపుగా ఉండేలా
నా మస్తిష్కంలో మెదిలే మాటలను ఏర్చి; కూర్చి
కాయితంపై గుదిగుచ్చి గుప్పిస్తున్నాను అంతే...!
నేను మొలకెత్తించే ఈ అక్షరాల అంకురాలు
పెరిగి మొగ్గ తొడిగి కవితా పుష్పాలై
సామాజిక నందనవనానికి
నవశకం శోభను చేకూర్చి నలుమూలలకు
ప్రగతి పరిమళాలు వెదజల్లగలిగితే
కవితలల్లాలనే నా కల ఫలించినట్టే !
ఒక కవిగా నా ఆశయం నెరవేరినట్టే..!

**- డాక్టర్ వి.రాజేంద్ర ప్రసాద్**, 76759 73777

# నేరమయ నిర్లక్ష్యం



రాజ్యమా...
మా సామూహిక స్మృతుల శిథిలాలను
ఒక్కసారి తడిమి చూడు
పచ్చదనాన్ని త్యాగం చేసి బతుకును
బీడు చేసుకున్న తెగువ మాది....
బంధాలను, పురా వైభవాల్ని వదలి
జాతి జీవగర్రగా పోలవరాన్ని బహుళార్థకం చేసే
నిర్మాణాత్మక లక్ష్యం మాది
ప్రజా హితానికి ఆలంబనగా నిర్దేశించుకున్న ప్రస్థానం మాది

రాజ్యమా...
దశాబ్దాల తరబడి
నీ అధికార దాహపు రాజకీయ నినాదంగా
'పోలవరాన్ని' మార్చుకున్నావు
నీ దోపిడీకి కాసుల వర్షంగా 'పోలవరాన్ని' ఎంచుకున్నావు
నీ బూటకాన్నంతా వాగ్దానాలుగా మార్చి మమ్మల్ని ఏమార్చి
గద్దెనెక్కాక మా నిర్వాసితుల హక్కుల్ని నీటిపాలు చేసావు...

నదినుండి తీరాన్ని వేరు చేసే పాలన నీది
కాళ్ల కింది నేలను అడివిలోని ఆదివాసీయతను
కబళించే చట్టాలు నీవి
ముంపొచ్చిన ప్రతిసారీ నెపం గోదారమ్మపై వేస్తావు కానీ,
ఇదో మానవ నిర్మిత చారిత్రక తప్పిదమని
ఎందుకు అంగీకరించవు?

రాజ్యమా...
నీ అలసత్వం కారణంగా సరైన పునరావాసానికి నోచక
పరిపూర్ణ పరిహారాలు అందక
పిడికెడు మెతుకుల కోసం ..
జానెడంత జాగాకోసం కోసం...
గుక్కెడు నీళ్లు కోసం...
నిలువ  నీడకోసం.....
ఉపాధి కోసం, వైద్యం కోసం
అలమటిస్తున్నాం... అఘోరిస్తున్నాం....
అకాల వరదలొస్తే
పర్వత శిఖరాలను పరంజులుగా మార్చుకుంటున్నాం
లేదా కమ్మేసిన బురద మేటలో
పురుగూ పుట్ర మధ్య
క్షణమొక గండంగా దినమొక యుగంగా
బతుకు వెళ్ళదీస్తున్నాం
గొప్పదైన ధ్యేయంలో మేమో బాధ్యత అనుకున్నాం కానీ....
మా నేలనుంచి మేమే బహిష్కృతమయ్యే
పోగాలమొకటి వస్తుందని ఊహించనే లేదు

రాజ్యమా...
మా నిర్వాసితంపై పునరావాసంపై
ఏదీ పట్టని నేరమయ నిర్లక్ష్యం నీది!
మాది వందలాది గ్రామాల ముంపు దుఃఖం
లక్షలాది ప్రజల వలస ఘోష
ఒక తరాన్ని అతలాకుతలం చేస్తున్న
విధ్వంసకర నైసర్గిక స్వరూపం

ఇక పోరుబాట తప్పదు!
పగిలిన మా స్వరాలు పిడుగులవుతాయి
మరిగిన మా నెత్తురు అడుగులవుతాయి
ఇకపై జనతరంగమై తెగబడతాయి!

**- కలమట దాసుబాబు**
**80967 03363**






# ఏటి జేడెల్లో పురిటి జాడలు

- ఎమ్వీ రామిరెడ్డి
98667 77870

**“సి**న్నోడా... తోటదిక్కు పొయ్యిరా. తుమ్మళ్లబాయి వంకలోంచి పందులొచ్చి రాత్రేమన్నా సెట్లు ఎల్లేసినయేమో సూడు. బరుగొడ్ల పోడెక్కువైంది. రోజూ ఒక్క సోటన్నా మేపు తాండరు. వంక దిక్కు అన్నీ కాట్లే. వారం రోజులెట్టోకట్ట సగదీరి పెరికి పార్నూకితే పోద్ది. సీకటి పడేదాకా ఉండగాకు. పొద్దు గూక్కముందే మంచినీళ్ల బాయికాన్నించి దాటుకో.”

ఇది... ‘మా ఊరి దెయ్యం’ శీర్షికతో బిజివేముల రమణారెడ్డి రాసిన కథ ప్రారంభం మాత్రమే కాదు; ఇవాళ్టికీ పల్లెపట్టుల్లో పంటల్ని కాపాడుకోటానికి రైతులు చేస్తున్న నిరంతర యుద్ధం. చదువులు పూర్తవగానే బతుకుదెరువును, బంగారు భవిష్యత్తును వెతుక్కొంటూ ఊళ్లొదిలి వెళ్లిపోయేవాళ్లు వెళ్లిపోగా, అక్కడ మిగిలే వాళ్లు మాత్రం యుద్ధంలో నిత్యం గాయపడుతూనే ఉన్నారు.

బిజివేముల రమణారెడ్డి కూడా అలాగే పొలిమేర దాటాడు. పట్నం చేరాడు. విలేఖరిగా విధి నిర్వహణలో నిమగ్నమయ్యాడు. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ప్రాంతాలు మారాడు. తన ఉనికిని శ్వాసభరితం చేసిన రంపాడు మట్టివాసన, సగిలేరు, రేగడిచేలు, ఏటి జేడెలు, యేటి దొరువులు, ముగ్గుపిండి గనులు, వాగులు, వంకలు, కొండలు, గొర్రెలు, బర్రెలు, నల్లమల అడవులు... అన్నీ మెల్లగా మరుగున పడిపోక తప్పని జీవనస్థితి. ఏ వ్యక్తికైనా ఈ స్థితి అనివార్యం. కానీ, సాహిత్యాధ్యయనం, సృజన అనే వరాలు పొందిన రమణారెడ్డి అంతరంగం హెచ్చరికలు జారీ చేసింది. మూలాల గురించి గుర్తు చేసింది. మళ్లీ ఊరిని మనసులో ప్రతిష్ఠించుకున్నాడు. అక్కడి అనుబంధాలు, అనురాగాలు, సమస్యలు, స్థితిగతుల్లోకి తొంగి చూశాడు. ఆ దృశ్యాలను అక్షరమానం చేయటం బాధ్యతగా భావించాడు. అట్లా రాసిన 12 కథలతో వెలువరించిన సంపుటి ‘ఏటి జేడెలు’.

‘పూరిడ్సి ఇరబై ఏళ్లుగా వూర్లు బట్టుకొని తిరిగిన’ కథానాయకుడు మొత్తానికి మళ్లీ ఊరెళ్తాడు. సుదీర్ఘ కాలం తర్వాత ఆ నేలపై కాలు మోపిన అతగాణ్ని ఒక ఉద్వేగం చుట్టుముడుతుంది. ‘ఇంటికాడ యాపసెట్టు కింద దర్గా అరుగు మీదున్నె’ వాళ్లమ్మ గబగబ వచ్చి సేతులు బట్టుకొని “వొల్లు బాగుందే” అని అడుగుతుంది. అమ్మ పెట్టిన బువ్వ తిని, ‘సేలు జూసొస్తానికి’ పోతాడు. తన చిన్నప్పటి మంచినీళ్ల బావి కోసం వెదుకుతాడు. “రాతికటకం వూడిపోయి, కొన్ని మెట్లు జారిపోయి, దొరువులు కూలిపోయి కిలపడిపోయి కనిపిస్చింది”. చిత్రంగా ఆ బావి అతనితో మాట్లాడుతుంది. “మా కాలమై పొయ్యింది రెడ్డీ. బోరుబావులొస్చి మా గొంతెండింది. సివరకు ఇట్టైపోయిన” అంటూ కన్నీరు పెట్టుకుంటుంది. ఊరందరికీ మంచినీరందించిన ఒకనాటి దాని వైభోగం గుర్తొచ్చి, అతని మనసు బాధతో మూలుగుతుంది. ఒక్క బాయేనా! అతనితో బొక్కెనగుండు మాట్లాడుతుంది. కలబంద మొక్క మాట్లాడుతుంది. రోలు మాట్లాడుతుంది. పక్కింటామె పేడకు బదులు పేడపొడితో కళ్లాపు జల్లుతున్న దృశ్యాలతో... మారిన తన ఊరి ముఖచిత్రం చిత్రంగా కనిపించే వైనాన్ని “ఊరికి బొయ్యొచ్చిన” కథలో మన కళ్లముందు సమర్థంగా ఆవిష్కరించాడు.

ఊళ్లో మార్పుల సంగతి ఎలా ఉన్నా, సంఘర్షణ మాత్రం అలాగే ఉంది. మనుషుల మధ్య కనిపించని తెరలూ అలాగే ఉన్నాయి. మనిషికి గుక్కెడు నీళ్లెంత ముఖ్యమో, మడిచెక్కకూ అంతే అవసరం. ‘మా ఊరి దెయ్యం’ కథలో మొద్దు నారాయణను పలకరిస్తే ఆ విషయాలు అర్థమవుతాయి. పొద్దు గూకితే చాలు... మంచినీళ్ల బాయికాడ దెయ్యం ప్రత్యక్షమవుతోంది. చీకటి పడితే ఆ దిక్కు పోవాలంటే ఊరిజనం జడుసుకుంటున్నారు. ఊరు దాటడానికీ సాహసించటం లేదు. ఊర్లోనే

ధైర్యస్తుడన్న పేరున్న శేషారెడ్డి సైతం ఆ దయ్యాన్ని చూసి వణికిపోతాడు. ఇంతకీ దెయ్యం నిజమేనా? 'గూనివంపు శరీరం, అరగోసిపంచ, చొక్కాలేని కాయం, బుజాన తువాల, చెప్పులకు నోచుకోని పాదాల'తో ఇంటికీ పొలానికీ నడుమ లోలకంలా తిరిగే నారాయణ బతుకుగాథను రచయిత వైవిధ్యభరిత కథనంతో మన ముందుంచాడు. జనం భయానికి హాస్యపు చక్కెర పూత పూసి, ఆసక్తికరంగా చెప్పిన ఈ కథ ఆద్యంతం ఆకట్టుకుంటుంది.

'ఒక రైతు ఆత్మకథ'లోని నారాయణ తత్వం మరో రకం. అయిదేళ్లు వరస కరువులతో కుదేలయ్యాడు. నిరుడు మాత్రం ప్రకృతి కరుణించటంతో మిర్చి ఎకరానికి యాభై క్వింటాలు కాడికి పండింది. ఆ రాబడి పిల్లల చదువులు సాగటానికి సహ కరించిందేగానీ అప్పులు తీర్చలేకపోయింది. ఈ ఏడు మళ్లా అప్పులుజేసి విత్తనాలు తెచ్చాడు. అప్పులుజేసి మందులు కొన్నాడు. అప్పులుజేసి పైరును సాకాడు. వాతావరణం అనుకూలించటంతో మిరప, వరి కళకళలాడుతూ కోతల ముంగిట నిలబడ్డాయి. తెల్లారితే వరికోత. పంట ఇంటికొచ్చే దృశ్యాలను ఊహించుకుంటూ ఆ రాత్రి ఆరుబయట నిద్రపోయిన నారాయణ... అకాల వర్షంతో ఉలిక్కిపడి లేచాడు. రాత్రంతా కుండపోతతో పంట నీటిపాలైంది. అప్పులిచ్చిన సూరారెడ్డి ఇంటికొచ్చి బెదిరించి, రెండెకరాల మిరపచేను తన పేరిట రాయించుకున్నాడు. అప్పులిచ్చిన అనసూయమ్మ నోరు పట్టకుండా శాపనార్థాలు పెట్టింది. ఇంటిపరువు బజార్న పడింది. నారాయణ ఆత్మహత్య చేసుకున్నాడు. మరి ఆయన భార్య ఏం చేసింది? అదీ కథ. అదే అసలు కథ.

ఉసురు తీసుకోకపోయినా 'బతుకు వాన'లోని సుబ్బయ్యదీ అదే పరిస్థితి. ఈయేడు మిరపకు బాగా ధర పలుకుతోందని, పంట చేతికొస్తే బాకీలు తీరతాయని ఆశ పడతాడు. దాన్ని కాపాడుకోటానికి చలమయ్య దగ్గర మూడు రూపాయల వడ్డీకి అప్పు తీసుకుంటాడు. రెండు వానల బలంతో మిరపతోట ఏపుగా పెరుగుతుంది. ఆ తర్వాత 'ఆకాశంలో వానమేఘాలు పరుగులు పెడుతున్నాయి. ఆగితే కరువు సీమలో నేలకు జారతామన్న భయమేమో', చినుకుల జాడే లేదు. తోట ఎండి పోతోంది. మబ్బులు మొహం చాటేశాయి. ఒకటి, రెండు దినాల్లో వానొస్తేనే ప్రయోజనం. లేకపోతే? మరి, వర్షం కరుణించిందా? మిరపతోట ఎరుపెక్కిందా? 'బతుకు నావ' చదవాల్సిందే.

'అంతరం' కథలోని నారాయణమ్మ కూడా రైతురికంలో రాటుదేలిన మనిషే. 'పోరుమామిళ్ల చెరువు కింద అర్థరేత్రి సలికి లేసి నడుముల లోతు నీళ్లల్లో సగిలేరులో దిగిపోవాల. బురదనీళ్లలో పొద్దస్తమానం వరికోసి కట్టలు కట్టి కల్లానికి మోసి చెత్తకొట్టాల. ఇంటికొచ్చేసరికి మధ్యాహ్నం అవుతుంది. ఇంత కష్టం చేస్తే ఇచ్చేది అయిదు సేర్లు వడ్లు." ఆ వడ్లు దంచి, కొడుక్కి తెల్లబువ్వ పెట్టేందుకు నానా వెతలు పడిన నారాయణ మ్మ జీవితం ఇప్పుడు బుక్కెడు బువ్వ దొరక్క తూలి, కూలిపోయే స్థితికి చేరుకుంది. కారణం కోడలైతే, అకారణం కొడుకు. రెండురోజులు తిండి కరవై చనిపోయిన నారాయణమ్మ జ్ఞాపకార్థం కొడుకు ఊళ్లో సత్య హరిశ్చంద్ర నాటకం ఏర్పాటు చేయటం కొసమెరుపు. రోజూ పొలం నుంచి ఇంటికి గడ్డి మోయటం– నారాయణమ్మ తన జీవితాన్ని మోసిన తీరుకు నిదర్శనంగా రచయిత కథను తీర్చిదిద్దటం విశేషం.

■■■

అతివృష్టి, అనావృష్టి తీరాల నడుమ నిలువులోతులో కూరుకుపోయిన రైతుకు ఆడపిల్ల పెళ్లి పెద్ద సంకటమే. ఓబుల్‌రెడ్డికి 'సుదులు గట్రా చూసి తక్కువ రేటుకే మంచి సేద్యపు ఎద్దులను కొనడం తెలుసు. రెండుపూటలా పాలిచ్చే మంచి సంక కలిగిన పాడిబర్రెలను బేరమాడటం తెలుసు. కానీ తక్కువ రేటుకే మగపిల్లోలను కొనడం తెలియదు'. అయినవాళ్లంతా తలో చెయ్యి వేసి, రెండో కూతురి పెళ్లి ఖాయం చేశారు. ఆ పెళ్లికి వెళ్లిన పెద్దమనిషి తిరుమలరెడ్డి, యువకుడు నారాయణ ఆ రాత్రి ఓ ఇంటిపంచన చేరతారు నిద్రకు మొహం వాచిన తిరుమలరెడ్డి ఆ ఇంటాయన కూతురికి మనువు కుదుర్చుతానని నమ్మబలుకుతాడు. ఆడపిల్లల తండ్రి అయిన చెంచిరెడ్డి భార్యా బిడ్డల్ని ఖాళీ చేయించి మరీ మంచాలు ఏర్పాటు చేస్తాడు. తిరుమలరెడ్డితో అలా అబద్ధాలు చెప్పించిన రచయిత మీద మనకు విపరీతమైన కోపం వస్తుంది. కానీ, ముగింపులో ఒక కొసమెరుపుతో శుభం కార్డు వేస్తాడు. కరువు కారణంగా బిడ్డల పెళ్లిళ్లు చేయటానికి రైతులు పడుతున్న ఇక్కట్లను వివరించిన కథ 'ఆడపిల్ల'.

అనగనగా ఓ ప్రైవేటు ఆస్పత్రి. అక్క కొడుక్కి సర్జరీ చేస్తే వచ్చాడు అతడు. స్వర్గనరకాల సరిహద్దులాంటి ఆ వైద్యశాలలో రోగమేదీ లేకపోయినా మసాలా దినుసులు అమ్ముకొని పొట్ట పోసుకునే ఫకృద్దీన్ అనే పెద్దాయన్ని బంధించేశారు. 'నన్ను వదిలిపెట్టిండి మొర్రో' అంటూ నర్సులతో మొర పెట్టుకొంటున్న ఫకృద్దీన్ దీనస్థితిని 'డిశ్చార్జ్' కథలో విదారకంగా వర్ణించాడు.

వైద్యం నేపథ్యంలోనే రాసిన మరో కథ 'ఆశ'. హెచ్ఐవీ సోకిన ఖాదర్ బాషాకు డబ్బు ఆశ చూపించి, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన శిబిరాలు నిర్వహించేందుకు పూనుకొంటారు వైద్యాధికారులు. జనం సంగతి అలా ఉంచితే, అసలు అధికారు ల్లోనే చైతన్యం డొల్ల అనే విషయాన్ని కథగా మలిచిన తీరు అభినందనీయం. ప్రజలే కాదు, అధికారులు, ఆఖరికి డాక్టర్లు

కూడా అపోహల కారణంగా అతన్ని తాకకపోవటంతో "ఖాదర్ సచ్చిపోయిండు" అని రాస్తాడు రచయిత. చిత్రంగా మనకు మాత్రం "ఖాదర్‌ని సంపేసింద్రు" అనే అర్థమవుతుంది.

తప్పటడుగులతో జీవితాన్ని గాయాలపాలు చేసుకున్న మహిళ కథ 'సరోజ'. అయితే, డబ్బే బతుకు కాదని గ్రహించి కష్టాలను అధిగమించిన యువతి కథ "హేమ నవ్వు". యమలోకం నేపథ్యంతో మనిషి తప్పిదాలను ఎత్తిచూపిన కథ "వైతరణి". రాజకీయాల కోరల్లో చిక్కుకున్న గ్రామం కథ "మారిన చిత్రం".

కథారచనలో సహజంగా 'నాలుగు దాటింది, ఉదయం ఏడున్నర గంటల వేళ' అంటూ సమయాన్ని సూచిస్తాం. నిజానికి ఊళ్లల్లో నివసించే మనుషులు తమదైన భాషలో సమయం గురించి మాట్లాడుకుంటారు. రమణారెడ్డి చాలా కథల్లో పాటించిన 'సమయ సూచన' అతని లోతైన పరిశీలనకు నిదర్శనం. జంగిడి బొయ్యే టయం, సిన్నమల పొద్దు, పెద్దమల పొద్దు, పైటేల, గొరుకోల్లు, జాముసుక్క, జాముకోడి వంటి వాడుక పదాల ద్వారా కథాసమయాన్ని రక్తి కట్టించారు.

తన పల్లె యాసకు పట్టం కడుతూ రాసిన 'సపారం, తెల్లె, సోచ్చరాలు, ఈసగాలి, కొరముట్లు' వంటి అనేక పదాలు మనల్ని సరికొత్తగా ఆకట్టుకుంటాయి. కథనంలోనూ పల్లె దృశ్యాలే ప్రత్యక్షమవుతాయి. ఊరి తాలూకు సహజ ఒనరులే అక్షరాల్లో ఒదిగిపోతాయి. కొన్ని వాక్యాలు చూడండి...

*కడిగేసిన బానలా ఖాళీ అయ్యింది కదుపు (అంతరం).*

*పెండ్లీడు కొచ్చిన ఆడకొమ్మలు నిండుగా సింగారించుకొని రాగిచేలో పూతకొచ్చిన ఆవాల కొమ్మల్లా పచ్చగా కళకళలాడు తున్నారు (ఆడపిల్ల).*

*గతిలేనపుడు గంజే పానక మనుకోవాల (బతుకు వాన).*

*మానవులు తెలివిమీరి ప్రవర్తించి మానుకొట్టి మీదేసు కున్నారు (వైతరణి).*

■■■

మొత్తం మీద ఈ కథలన్నీ మట్టివాసనతో గుబాళిస్తాయి. పల్లెదుఃఖాన్ని పట్టిస్తాయి. స్థానీయ సంస్కృతిని, సంక్షోభాలను బలంగా వినిపిస్తాయి. మొద్దు నారాయణ అన్నట్లు 'ఒక రైతు కట్టం జేస్తే పదిమందికి అన్నం బెడతడు. అట్లాంటి రైతును సంపితే పదిమంది ఆకలితో సచ్చిపోతరు. రైతనేవోడు ఎప్పుడూ బతికే ఉండాల సోమీ' అని సూత్రీకరిస్తాయి. ఇవే అంశాలను ప్రసిద్ధ రచయితలు కేతు విశ్వనాథరెడ్డి, సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి, పాలగిరి విశ్వప్రసాద్ గార్లు (ముందుమాటల్లో) రమణారెడ్డి కథలకోణంలోంచి సమగ్రంగా విశ్లేషించారు. అదే సమయంలో విలువైన సూచనలు చేశారు. అవి రచయితకు శిరోధార్యం.

రమణారెడ్డికి జర్నలిస్టుగా పరిశీలనాత్మక/ పరిశోధనాత్మక దృష్టి ఉంది. అనేక ప్రాంతాలు తిరిగిన అనుభవముంది. ఆ అనుభవంలోంచి తన ఊరిని దర్శించటం లేదా పోల్చుకోవటం ద్వారా కథను మరింత వైవిధ్యంగా సృజించే అవకాశముంది. విస్తృత అధ్యయనం ద్వారా తన కంఠస్వరాన్ని ఇంకా పదునుగా వినిపించవచ్చు. ఆ పని చేస్తారన్న నమ్మకం నాకుంది.

సాధారణంగా సంపుటిలోని ఏదో ఒక కథ శీర్షికనే పుస్తకానికి మకుటంగా పెడతారు. ఈ సంపుటిలో మాత్రం ఏటి జేడెలు శీర్షికతో కథలేదు. కానీ, దాని తాలూకు ప్రతిఫలనాలు ప్రతి కథలోనూ కనిపిస్తాయి. ఇంతకీ, 'ఏటి జేడెలు' అంటే ఏమిటి? కచ్చితంగా తెలుసుకోవాల్సిందే. తెలుసుకోవాలంటే 'ఏటి జేడెలు' కథాసంపుటి చదవాల్సిందే. బిజివేముల రమణారెడ్డి (8125507590) కలం నుంచి మరిన్ని మంచి కథలు ఆశిస్తున్నాను. ■

## డా. వేదగిరి రాంబాబు
## కథానికా పురస్కారం - 2023

**డా.** వేదగిరి రాంబాబు ప్రముఖ రచయితే కాదు, కథానికా జీవి. కథానికే ఆయన శ్వాస, ధ్యాస, తపన, ఆరాటం, పోరాటం - సమస్తమూనూ. కథానికకు పట్టాభిషేకం చేసేందుకు ఒక ఉద్యమాన్నే నిర్మించిన ఘనులు. వారి కథానికా సేవకు చిన్న గుర్తింపుగా ప్రతి సంవత్సరం డా. వేదగిరి రాంబాబు కథానికా పురస్కారాన్ని యువ రచయితలకు ఇస్తున్నాము. ఇందు నిమిత్తం 14-10-2023 నాటికి 40 ఏళ్లు మించని రచయితల నుంచి ప్రచురించబడిన కథానికా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము. ఒక్కొక్కటి ఒక కాపీ చొప్పున 14-8-2023 లోపల అందేలా పంపించాలి. ఒక ప్రఖ్యాత రచయిత, విమర్శకులు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తారు. 14 -9 -2023 న విజేతని ప్రకటిస్తాం. 14 -10 -2023 న హైదరాబాదులో జరిగే డా. వేదగిరి రాంబాబు జన్మ దినోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేయబడుతుంది. ఆ రోజున పురస్కార విజేత తప్పనిసరిగా హైదరాబాద్ వచ్చి పురస్కారం స్వీకరించాల్సి ఉంటుంది. పురస్కారంగా 5000 నగదు, జ్ఞాపిక ఇవ్వబడతాయి . ప్రముఖుల సమక్షంలో శాలువాతో ఘన సత్కారం ఉంటుంది. పుస్తకాలు పంపాల్సిన చిరునామా **: simhaprasad, 401, Mayuri estates, MIG-2-650, KPHB colony, Hyderabad -500072.**



# అప్రకటిత 'ఎమర్జెన్సీ'పై ఐక్య పోరాటం

- తెలకపల్లి రవి

పాట్నాలో జయప్రదంగా ముగిసిన 17 ప్రతిపక్షాల శిఖరాగ్ర సమావేశం దేశ రాజకీయాల్లో, అందులోనూ లోక్‌సభ ఎన్నికల ముంగిట్లో కీలక ఘటన అని చెప్పొచ్చు. దీని కొనసాగింపుగా సిమ్లాలో తదుపరి సమావేశం జరపాలని హాజరైన నేతలు నిర్ణయించారు. అంటే ఈ ప్రక్రియను కొనసాగించాలని కూడా వారు ఏకాభిప్రాయానికి వచ్చారు. 450 నియోజక వర్గాలలో బిజెపికి వ్యతిరేకంగా ఒకే అభ్యర్థిని ప్రతిపక్షాల తరపున నిలబెట్టాలని భావిస్తున్నట్టు సమావేశానికి ముందు వార్తలు వచ్చాయి. వివిధ రాష్ట్రాల్లో పోటీలు ఎలా ఉంటాయనే అంశాన్ని వచ్చే సమావేశంలో చర్చించాలని కూడా అంగీకారానికి వచ్చాయి. బిజెపి తర్వాత పెద్ద పార్టీగా వున్న కాంగ్రెస్ నుంచి రాష్ట్రాలను పాలించే ప్రాంతీయ పార్టీల వరకూ ఈ సమావేశానికి హాజరైనాయి. ముగ్గురు ముఖ్యమంత్రులు స్వయంగా పాల్గొనగా కాంగ్రెస్, సిపిఎం అగ్రనేతలు హాజరవడం తో దేశంలో దాదాపు గణనీయమైన భూభాగానికి, రాజకీయ బలానికి ప్రాతినిధ్యం లభించినట్లయింది. అలా అని హడావుడిగా ఏదో ఒక ప్రకటన చేసి ప్రచారంలో పెట్టడం గాక హాజరైన పార్టీలు తమ తమ అభిప్రాయాలు సూటిగా చెప్పడం, ఆచరణయోగ్యం కాని అభిప్రాయాలను ముందే తోసిపుచ్చడం మంచి విషయమే. ఉదాహరణకు కాంగ్రెస్ పెద్దన్న పాత్ర వహించాలనే కొందరి మాట, లేదంటే ఎక్కడ ఎవరు బలంగా వుంటే వారి మాట అందరూ వినాలనే వాదన ఇక్కడ రాలేదు. బిజెపి, కాంగ్రెస్‌లను ఒకే గాట కట్టే ధోరణి కూడా కనిపించలేదు. అదే సమయంలో కాంగ్రెస్ పట్ల తమకున్న అభ్యంతరాలనూ మిగిలిన పార్టీలు దాచిపెట్టుకోలేదు. ఏది ఏమైనా మతతత్వ రాజకీయాలు, రాష్ట్రాలపై దాడి, జాతీయ రాజ్యాంగ సంస్థల దుర్వినియోగంతో విపక్షాలపై దాడి, భావ ప్రకటనా స్వేచ్ఛ పరిరక్షణ వంటి అంశాలు కీలకమనే అవగాహన అక్కడ ద్యోతకమవడం హర్షణీయం.

**బీహార్ ఉద్యమం - ఎమర్జెన్సీ**

ఇప్పటి సమావేశాన్ని కాసేపు పక్కనపెట్టి గత చరిత్రలోకి తొంగిచూస్తే బీహార్ రాజధాని పాట్నా లేదా పాతకాలపు పాటలీపుత్ర ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటాన్ని గుర్తు చేస్తుంది. యాభై ఏళ్ల కిందట జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో ఇక్కడే ప్రతిపక్షాల ఐక్య పోరాటం మొదలవడం, అది విస్తరించిన కొద్దీ ప్రతిస్పందనగా ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించడం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక పీడకల. పౌరహక్కులు కాలరాచి, ప్రభుత్వాలను కూలదోసి పత్రికలపై సెన్సార్‌షిప్ విధించి ప్రతిపక్ష నాయకులను ఖైదు చేసిన ఆ రోజులు ఎన్నటికీ మర్చిపోకూడనివి. అందుకు వ్యతిరేకంగా జయప్రకాశ్ నాయకత్వంలోనే ప్రతిపక్షాలు ఏకమై జనతా పార్టీగా ఏర్పడ్డాయి. అయితే అందులో చోటు సంపాదించిన నాటి జనసంఘం మతతత్వ పోకడలు జనతా ప్రభుత్వ విచ్ఛిన్నానికి దారితీశాయి. ఆ జనసంఘమే బిజెపిగా అవతరించి సర్వ ప్రతిపక్షాల ఐక్యత మంత్రంతో పెరుగుతూ 1990లో వచ్చిన వి.పి.సింగ్ నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని కూలదోసింది. అప్పుడు కూడా అద్వానీ రథయాత్రను బీహార్‌లోనే అడ్డుకోవడం యాదృచ్ఛికం కాదు. ఈ క్రమం 1992 అయోధ్య బాబ్రీ విధ్వంసం వరకూ నడిచి దేశ రాజకీయాల్లో మతతత్వం పరాకాష్టకు చేర్చింది. 1996లో ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ కూటమిని కూడా బిజెపి, కాంగ్రెస్ కూలదోశాయి. 1996 నుంచి 2004 వరకూ వాజ్‌పేయి ప్రభుత్వం పాలన సాగడానికి టిడిపి, జెడియు వంటి పార్టీల ఫిరాయింపు కారణమైంది. 2004లో వామపక్షాల మద్దతుతో యుపిఎ1 ఏర్పడినా అమెరికా అణు ఒప్పందానికి వ్యతిరేకంగా అవి వ్యతిరేకించాక ఫిరాయింపుల సహాయంతో 2013 దాకా పాలన సాగించింది. కాని 1991లో మొదలైన సరళీకరణ

విధానాలు ఒకవైపు, బిజెపి రగిలించిన మత రాజకీయాలు మరోవైపు దేశ రాజకీయ దృశ్యాన్ని కకావికలు చేశాయి. 2014 నుంచి పాలన లోకి వచ్చిన మోడీ ప్రభుత్వం దీన్ని పరాకాష్టకు చేర్చింది. ఆయన పాలనలో మతతత్వం, నిరంకుశత్వం కలయికలో ఈ ప్రభుత్వ పాలన అప్రకటిత ఎమర్జెన్సీగా పేరు తెచ్చుకుంది. అప్పటికంటే దారుణంగా పత్రికల పీకనొక్కడం, స్వేచ్ఛను హరించడం, మతశక్తుల విజృంభణ, అమెరికాకు దాసోహమనడం, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టడం... ఒకటేమిటి ఫాసిస్టు తరహా పోకడలతో సంఘ పరివార్ అనబడే ఆర్ఎస్ఎస్ కూటమి రెచ్చిపోతున్నది. సుప్రీంకోర్టుతో సహా దేశంలోని అన్ని రాజ్యాంగ వ్యవస్థలూ ఒత్తిడికి లోనవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలను నామకార్థంగా మార్చి మోడీ ప్రధాని కార్యాల యమే ఏకైక శాసన కేంద్రంగా మారింది. ఈ పరిస్థితుల కారణంగానే లౌకిక ప్రతిపక్షాలు మళ్లీ ఒక తాటి మీదకు రావలసిన అగత్యమేర్పడింది. మొత్తానికి పాట్నా మరోసారి ప్రతిపక్ష ఐక్యతకు కేంద్రమైంది. విశేషమేమంటే ఈ యాభై ఏళ్లలోనూ భాగస్వాములుగా తప్ప నేరుగా కాంగ్రెస్, బిజెపిలు ఇక్కడ దాదాపు అధికారంలోకి రాలేకపోయాయి.

**వివిధ పార్టీల సంకేతాలు**

బిజెపిని ఓడించడమే ఏకైక లక్ష్యంగా వుండాలని సమావేశా నికి హాజరైన సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. వివిధ రాష్ట్రాలలో పరిస్థితులను బట్టి చర్చలు జరగాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ అన్నారు. ఢిల్లీ ఆర్డినెన్సును కాంగ్రెస్ వ్యతిరేకిస్తేనే దాంతో తాము ప్రతిపక్ష వేదికలో వుంటామని ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఈ విధంగా షరతులు పెట్టడం సరికాదనే అభిప్రాయం కాంగ్రెస్ వ్యక్తం చేసింది. బెంగాల్‌లో కాంగ్రెస్ సిపిఎంతో కలవకుండా వుంటేనే తాము పాలుపంచుకుంటామని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ షరతు పెట్టారు. అయితే మళ్లీ బిజెపి గెలిస్తే ఎన్నికలు జరిగే అవకాశం కూడా వుండదని ఆమె అన్నారు. తాము బిజెపి వ్యతిరేకం తప్ప కాంగ్రెస్ వ్యతిరేకులుగా పరిగణించరాదని సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్ వెల్లడించారు. బిజెపితో ఒకసారి కూడా కలవని ఆర్‌జెడి వ్యవస్థాపక నేత లాలూ ప్రసాద్ యాదవ్ ఈ సమావేశంలో ఒక ఆకర్షణ.అయితే వారితో కలసి చేతులు కాల్చుకున్న నితీష్ కుమార్ అతిథేయ పాత్ర పోషించారు. సిపిఐ డి.రాజా కూడా అదే సందేశమిచ్చారు. శివసేన నాయకులూ దేశం ముందున్న ప్రమాదాన్ని గుర్తుచేశారు. ఈ విధంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా బిజెపి నిరంకుశత్వాన్ని ఓడించాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించడం పెద్ద మలుపు. సిమ్లా సమావేశంలో ఇది మరింత ముందుకు సాగి మరింత స్పష్టమైన కార్యాచరణకు దారితీస్తుందని ఆశించవచ్చు.

గతంలో బిజెపితో చేతులు కలిపి ఈ పరిస్థితికి దోహదం చేసిన కొన్ని పార్టీలూ ఇప్పుడు ఇందులో పాల్గొనగా టిడిపి, బిజెడి వంటి పార్టీలు ఇప్పటికీ కళ్లు తెరవని స్థితి. ఇక ఎ.పి ని పాలించే వైసిపి బిజెపి కేంద్ర ప్రభుత్వానికి విధేయ పక్షంగా వత్తాసునిస్తుంటే తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్, బిజెపిలకు ప్రత్యామ్నాయ విధానాలు కీలకమంటున్నారు గనక బిఎస్‌పితో సహా వీరందరికీ ఆహ్వానాలు పంపలేదు. గతంలో బెంగాల్ బీహార్, యు.పి లతో పాటు ప్రతిపక్ష కూటమికి ఒక ముఖ్య కూడలిగా ఉమ్మడి ఎ.పి వుండిన పరిస్థితి ఇప్పుడు లేదు. బిజెపిపై తీవ్రంగా విమర్శలు కార్యక్రమాలు చేసిన బిఆర్ఎస్ భవిష్యత్ వ్యూహ మేమిటో అస్పష్టం. ఈ ఐక్యవేదికలు, కూటములతో ప్రయో జనం లేదని కెటిఆర్ ప్రకటించారు.

**బిజెపి అక్కసు**

ఇక బిజెపి సమావేశాన్ని జీర్ణం చేసుకోలేకపోవడమే గాక వేయి రకాల దాడిచేసింది. పాట్నా గోడలను వ్యతిరేక పోస్టర్లతో కార్టూన్లతో నింపేసింది. మిమ్మల్ను అరెస్టు చేసిన కాంగ్రెస్‌తో కలుస్తారా అని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసింది. ప్రతిపక్షాలతో సమావేశానికి హాజరవడం ద్వారా కాంగ్రెస్ తను గెలవలేనని ఒప్పుకుందని అతి తెలివితో వాదించింది. ప్రజాస్వామ్యంలో పొత్తులు, సర్దుబాట్లు అపరాధమో అవమానమో కాదు. కాకుంటే భావసారూప్యత, ప్రజాస్వామ్య ప్రయోజనాలు ఉమ్మడి ప్రమాదంపై అవగాహన వుండాలి. ఆ మాటకొస్తే మోడీ ప్రభుత్వం కూడా పొత్తులు లేకుండా పోటీ చేసి ఏర్పడిందా? వంటరిగా మెజార్టీ వుండొచ్చు గాని ఎన్నికల్లో కలిసే పోరాడింది కదా. గుజరాత్, యు.పి వంటి వాటిని మినహాయిస్తే మరెక్కడా బిజెపి కేవలం తన బలంతోనే గెలిచింది లేదు. ఫిరాయింపులు, మిశ్రమ కూటములతోనే పాలిస్తున్నది. పరోక్షంగానూ ఒత్తిళ్లతో ప్రలోభాలతో బెదిరింపులతో కొన్ని పార్టీలను లోబర్చుకున్నది. ఈ అక్రమ పొత్తులకన్నా సూటిగా రాజకీయంగా అవగాహనకు రావడం రాజ్యాంగ బద్ధం.

**రేపటి పోరాటానికి సిద్ధంగా..**

రెండు కారణాల వల్ల ఈ సమావేశాలు లౌకిక పక్షాల అవగాహన త్వరితంగా పూర్తి కావలసి వుంది. లోక్‌సభకు ఎన్నికలు ముందుగా రావచ్చని బిజెపి కావాలనే సంకేతాలిస్తున్నది. నిజంగా వచ్చేట్టయితే సిద్ధం కావలసి వుంటుంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ముందే అవగాహన వుందన్న సంకేతాలు స్పష్టం చేస్తేనే ఫలితాల తర్వాత కలసి వ్యవహరించే చట్టబద్ధ అనుకూలత వుంటుంది. ఎందుకంటే

# చిరునవ్వు దారుల్లో ...

- ఈతకోట సుబ్బారావు
94405 29785

**తు**లసికోట గూట్లో
చందమామ ప్రమిదలో వెలిగించిన
చిన్ని దీపమే చిరునవ్వంటే!

శత్రువు కత్తివాదర లాంటి కోపం
మిత్రుడి మైనపు అలక
అమ్మ ఆకపట నాటకంలోని
చిరబుర అన్నిట్నీ
సుతారంగా కడిగేసే సుధాంశుధార
చిరునవ్వు!

పూల సువాసనకీ
వర్షం కురిసినప్పటి
మట్టితల్లి పేగువాసనకీ
ముడివేసి పక్షిని ఆకాశంలోకి విసిరేసినట్టు
అధరంపై ఎగిరే సీతాకోక చిలుక చిరునవ్వు
ఎన్ని జీవితపు రంగులో!
చిరునవ్వటమంటే పలకరించటమే

మనసునిండా ప్రేమ అగరొత్తుల్ని వెలిగించి
గుండె గుడిలోకి ఎదుటివారిని ఆహ్వానించటమే
వొక ప్రశాంత చందన శాలలోకి
విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రోది చేసి
ప్రపంచాన్ని లోపల సమావేశ పరచటమే!

ప్రపంచ మలిన సందర్భాలన్నిటినీ
చిరునవ్వు గంగలో అభ్యంగనం చేయించి
ప్రతి మనిషికో ...
అరవిరిసిన పుష్పం బహూకరిస్తూ
కులమతాల కాలుష్యం సోకని ఆత్మద్వారం ముందు
నిత్యనూతనంగా మోకరిల్లటమే!

రండి ...
బుడి బుడి బుడతల్ని
పిల్ల కుందేలు పిల్లల్నీ,
లేత లేడి కూనల్నీ
చిన్ని చిట్టి చేపల్నీ,
బుల్లిబుల్లి మొగ్గల్ని
మమతల కొలువుకి పిలిచి
చిరునవ్వుల పండగ చేసుకుందాం!


సహజీవన సమభావన పాఠాలు నేర్చుకుందాం
విద్వేష తరంగ దైర్ఘ్యాన్ని తగ్గించుకుందాం
రావి గింజంత మార్పుని ప్రసాదించమని
సాష్టాంగ పడదాం
ఆ బొన్సాయ్ మహా వృక్షాల ముందు
హృదయంపైన కాసింత ..
అమృతజలం చిలకరించమని
కల్మష విముక్తి కోసం ప్రార్థిద్దాం !
ప్రపంచ ప్రదర్శన శాలలో
ప్రతి పెదవిపైన ఇంద్రధనువు విరిసే
పరుసవేది విద్యని
బాలబ్రహ్మల్ని నుంచి ఆవిష్కరించుకుందాం
విశ్వద్వారం ముందు నిల్చొని
మానవ సమూహాల్ని ఆత్మలింగనం చేసుకుందాం
చిరునవ్వు దీపాలని వెలిగించి
సౌభ్రాతృత్వపు దారుల్లో నడిచి వెళదాం ! ■

---

పూర్తి మెజార్టీ గల పార్టీ లేదా ఎన్నికలు ముందు ఏర్పడిన కూటమికి మొదటి అవకాశం, ఎన్నికల తర్వాత ఏర్పడినా పూర్తి మెజార్టీ గల కూటమి ఈ క్రమంలో అవకాశం ఇవ్వాలని గతంలో కొన్ని స్థూలమైన సూచనలు వచ్చాయి. సిపిఎం ఎప్పుడూ చెబుతున్నట్టు భిన్నమైన పరిస్థితులు, రాజకీయ శక్తులు వున్న ఈ దేశంలో ఎన్నికల ముందే సంపూర్ణమైన అవగాహనకు రావడం, కాబోయే ప్రధాని ఎవరో నిర్ణయించుకోవడం జరగని పని. గతంలో జరగలేదు కూడా. అది ఎన్నికల అనంతర (పోస్ట్ పోల్) ప్రక్రియగానే వుంటుంది. అయితే ఇలాంటి ముందస్తు చర్చలు, ఉమ్మడి అవగాహన ఆ క్రమాన్ని సులభతరం చేస్తాయి. అంతకు మించి లౌకిక ప్రజాస్వామ్య రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలనే చైతన్యాన్ని పెంచుతాయి. అవకాశవాద శక్తులను, బిజెపికి అనుబంధ శక్తులుగా వ్యవహరిస్తున్న వారిని ప్రజల ముందు నిలబెడతాయి. ఒకే దేశం-ఒకే మతం-ఒకే పార్టీ-ఒకే మోడీ అనే ఏకపక్ష నిరంకుశత్వాన్ని ఓడించే కర్తవ్యానికి ప్రజలను సిద్ధం చేస్తాయి. ఈ ఐక్యతా కృషిని అపహాస్యం చేసే వారి కుటిల ప్రచారాలను బేఖాతరు చేస్తూ ఈ కర్తవ్యాన్ని జయప్రదం చేసేట్టయితే అది దేశ చరిత్రలో మరో చారిత్రక మలుపుగా నిలిచిపోతుంది. ■

# ఇది రక్త సమ్మిశ్రిత యుగం

నేల నెర్రలిచ్చి దాహం కోరుతుంది
గుహలో సింహం కూడా
తన తోకను తానే నాకుతుంది
ఆ వేటగాడు గురి చూసి జింకను కొట్టాడు
కొండలు వాటి అంతట అవే కరిగి
తరుగుతున్నాయి
భూమి ఉడికి ఉడికి ఏదో చేప ముక్కలా ఏగుతుంది
నిజమే! దేవాలయాలకు సందు లేదు
ఆ స్వామి దర్శనానికి పోయి
బస్సు కూలి ఎందరో అసువులు బాశారు
వారు స్వర్గగాములయ్యారని
వారి ఊళ్లో చెప్పుకుంటున్నారు
వివేచన రానురానూ అడుగంటుతుంది కదా!
నిజమే! అంతరాలు అందకుండా పోతున్నాయి
అంతర్మధనంలో మనిషి మార్మికుడవుతున్నాడు
తోడు నిలుపుకోలేక మోడు వారుతున్నాడు
అభివ్యక్తి శూన్యతను
నలుగుతున్న భావ ఘర్షణగా చెపుతున్నాడు
స్పష్టతకు అస్పష్టతకు మధ్య పెనుగులాట
జీవితాన్ని అద్దంలో చూసుకోలేక
దానికి మసి పూసి చూస్తున్నాడు
గుంపు జీవనమంటే
ఆ గిరిజన స్త్రీల పట్టీలకు కట్టిన
గజ్జలు ఒకే మోత మోగినట్లు కాదా!
ఆ డప్పుల నుండి ధ్వనులేరుకుని
నీటి అలల తుంపరలో
చెంపలను తడుపుకుంటున్న ఆ జవ్వని వనమాతే
ఆమె అడుగుల చప్పుడు లేని చోట
మొక్క మొలవడానికి వెనకాడుతుంది సుమా!
ఊటీలో మబ్బుల్ని తుంచి
పడవలు కడుతున్న ఆ బుడ్డోడు
మొలతాడుకు కట్టిన గజ్జల మోతకు
పున్నాగ పూలు రాలుతూ
నేలకు సువాసనలను అద్దుతున్నాయి
త్రివేణి సంగమం దగ్గర నిలబడతారు
జాతుల సమ్మిశ్రితాన్ని గుర్తించరు
మానవజాతులన్నీ అగడ్తలు దాటిన
మిశ్రమ రూపాలేగా!
ఆ చామనఛాయ పిల్లలో
సౌందర్యం దాగుందని ఎందరికి తెలుసు?



అందరూ భూమి పుత్రికలే
వాళ్ళు ఎవరో భూమి నేలిన
కులాలమని చెప్పుకుంటున్నారు?
శాసనాలు వెదికి చూపిస్తున్నారు
వాళ్ళ అమ్మాయి ఎవరో
రాజవంశ కుమారుడిని వరించింది
అన్నీ రాజవంశాలే అయినప్పుడు
అంతా వర్ణాంతర కథేగా!
చక్రవర్తులకే మీ పిల్లలను ఇస్తారా?
మామూలు సేనాధిపతులకు ఇవ్వరా?
రాజ్యం వీరభోజ్యం కదా!
ఆ కాశ్మీరు లోయలో వికసిస్తున్న కలువలు
నీటికి సౌగంధ్యాన్ని అద్దుతున్నాయి
ఎందుకు బంగారంలో
రత్నాలు పొదుగుతున్నారు?
రస సమ్మేళమే కాదు
భౌతిక బౌద్ధిక సమ్మేళన రసాయనమే భౌతిక శాస్త్రం
వీరెవ్వరూ?
శాస్త్ర విదూరులు?!
జీవ శాస్త్రానికి ఎదురు నిలబడి
రక్త స్వచ్ఛతను భాసిస్తున్నారు
అవును! రిస్లే జాతుల చరిత్రను ఒకసారి చదవండి
ఒక మార్క్స్ – ఒక రస్సెల్
ఒక వాల్టేర్ – ఒక రూసో
ఒక అంబేద్కర్
ప్రపంచ మానవులుగా ఎలా ఆవిర్భవించారు?!
ఇది రక్త సమ్మిశ్రిత యుగం
ఈ యుగ చైతన్యం ప్రజ్వలిస్తుంది
సమతా జీవన సౌధ నిర్మాణానికి కలసి రండి!

- డాక్టర్ కత్తి పద్మారావు
98497 41695



# పెళ్లి పిలుపు

– ప్రగతి
94407 98008

**మా** యావిడ పాతికేళ్లకు పైన మూడేళ్ల క్రితం ఇరవై లక్షలు పెట్టి నన్ను కొనుక్కుంది. అలాగని మేమేదో లేనివాళ్లమని, మా యావిడది మాకంటే గొప్పగా సంపాదించిన కుటుంబమని అంచనాకు రావొద్దు. ఆవిడ కంటే స్థితిమంతులైన కుటుంబం మాది. మా ఆస్తిపాస్తులు చూసే యావిడ వొప్పుకుంది, వాళ్ల నాన్న కూడా తమ కంటే గొప్ప సంబంధం అని వెతికి మరీ చేశాడు. మా అన్నలిద్దరి భార్యలు మాకంటే స్థితిమంతులైన కుటుంబాల నుంచి వచ్చారు. కాకపోతే నేను ముందుచూపుతో సాఫ్ట్వేర్ భార్య కావాలనుకున్నాను గనుక కాస్త తగ్గాను, తర్వాత యెలాగూ యావిడ సంపాదిస్తుంది కదా అని. అన్నట్టుగానే మా అన్నదమ్ముల అందరికీ ఆస్తి పంపకాలు కాకముందు యెంత ఆస్తి వుండేదో పదేళ్లకే మేము దాన్ని దాటేసాం. మా అన్నలు కూడా సాఫ్ట్వేర్ యింజనీర్లు కాకపోయినా రియల్ యెస్టేట్, ఫైనాన్స్ బిజినెస్సులతో బాగానే సంపాదించుకున్నారు. ముగ్గురిలో యెవరెక్కువ సంపాదించారంటే చెప్పలేము. ఆడవాళ్లు పోటీలు పడి నగల ప్రదర్శన చేసుకుంటుంటారు గానీ మేము మాత్రం మా ఆస్తుల విషయాల్లో అస్సలు బయటపడము. అయినా యెవరో వొకరి ద్వారా యెవరు యేం కొన్నదీ, యెంత సంపాదించిందీ మిగతావాళ్లకు తెలిసిపోతూనే వుంటుంది.

అందరి గురించి చెప్పి వొక్కడి గురించి చెప్పకపోతే కథ పూర్తిగాదు. మళ్లీ మీరే అంటారు, మీ అన్నల గురించి చెప్పావు కానీ నీ తర్వాతి వాడి గురించి చెప్పలేదే అని. అయినా వాడి గురించి చెప్పడానికేముంది? భూములా, బంగారమా? భవంతులా, కార్లా? యేమీ లేని వాడి గురించి యేమి చెప్తాం? అయినా చెప్పాలి, వాడు మాతో పుట్టిన పాపానికైనా! మాకు ఉపయోగపడతాడని సివిల్ యింజనీరింగ్లో వొదిలితే అది అర్ధాంతరంగా వొదిలేసి, సోషియాలజీ చదివి సామాజిక బాధ్యత అంటూ వాడి భాగానికి వచ్చిన ఆస్తి నమ్మి ప్రజాసేవ మొదలెట్టాడు. సంఘసేవ పేరుతో బాగానే సంపాదిస్తాడులే అని మేమూ ముందు మాకంటే వాడే తెలివైనవాడని అనుకుంటిమి గానీ వాడు పైసా వెనకేయకుండా ప్రజాసేవలోనే తరించిపోతాడని అనుకోలేదు. వాడి పెళ్ళాం వాడికి తగ్గ బొంత. వాడు తానా అంటే ఆమె తందానా. యింకేం చెప్తాం? వాడికి వొక్కటే ఆడపిల్ల. యీ విషయంలో మాత్రం వాడు అదృష్టవంతుడు. ఆస్తులు సంపాదించి పెట్టలేదని నిష్టూరమాడే కొడుకుల్లేరు. అయినా ఆడపిల్లను ఖర్చు పెట్టుకోవాలి కదా! అసలే మాది ఆధిపత్యం చెలాయించడానికి అర్హత వుందనుకుంటున్న కులాల్లో వొకటి. మనకంటే యెక్కువ అర్థబలం, అంగబలం వున్న వాళ్ళనే కదా చూసుకోవాలి. వాళ్ళిద్దరికీ ఆ ధ్యాసే లేదు. సరేలే యిప్పుడు యీ వుపోద్ఘాతమంతా యెందుకు చెబుతున్నానంటే నా కూతురికి పెళ్లి కుదిరింది.

రెండొందల యాభై కోట్ల వారసుడికి యిరవై కోట్ల కట్నం సమర్పించుకొని చేస్తున్నాము. మా అన్నల కూతుళ్ళకి యిచ్చిన దాని కంటే యిది చాలా యెక్కువే మరి. అదే లెవెల్లో యిచ్చిచేస్తే మా గొప్పేముంది! యెన్ని సంబంధాలు వెతికాం, చదువుంటే ఆస్తి తక్కువ. ఆస్తి వుంటే చదువు తక్కువ. ఆ రెండూ వుంటే అబ్బాయి అందం తక్కువ. యివి మూడూ వుండే కుర్రాడికి స్టైల్ తెలియదు. మొత్తానికి యెలాగైతేనేం అన్నీ వున్న వాణ్ని వెతికి తెచ్చేసరికి పిల్లకు పాతికేళ్లు దాటిపోయాయి. అయినా వయసుదేముంది, ఇప్పుడీ వయసు పెళ్లికి మామూలే. పెళ్లి ఖర్చు పది కోట్లు. యెలా చేస్తున్నామనేది నేను వర్ణించను, మీరే వూహించుకోండి.

ఇప్పుడు నా సమస్యేంటంటే యింత రిచ్‌గా చేసే యీ పెళ్ళికి నా తమ్ముణ్ని, వాడి కుటుంబాన్ని పిలవాలా వద్దా అని.

పిలవకపోతే బంధువులందరూ గుచ్చిగుచ్చి అడుగుతారు. పిలిస్తే, వాళ్ళు వస్తే నాకున్న సర్కిల్లో వీడి గురించి తెలిస్తే నాకు అవమానం. మధ్యేమార్గంగా మాయావిడ సలహా యిచ్చింది,

"మనం పిలుద్దాం. యెలా పిలిస్తే వాళ్ళు రారో అలా పిలుద్దాం."

యెంతైనా నాకంటే తెలివైంది మరి!

అన్నట్టుగానే యిద్దరం కలిసి ఆదివారం సాయంత్రం వాళ్ళింటికెళ్ళాం, పెళ్లికి పిలవటానికి. మేము వెళ్ళేసరికి బయట మొక్కలకి పాదులు చేస్తున్నారిద్దరూ. చాలా కాలం తర్వాత తమ యింటికి వేంచేసిన మమ్మల్ని చూసి కాస్త ఆశ్చర్యపోయారు. ముందు వాడి భార్య తేరుకొని లోపలికి ఆహ్వానించింది,

"రండి, రండి.. బాగున్నారా బావా? రా అక్కా!" అంటూ లోపలికి తీసుకెళ్ళింది.

కూర్చోమని కుర్చీలు చూపించి లోపలికెళ్లి చేతులు కడుక్కుని, చెంబులో మంచినీళ్లతో పాటు రెండు గ్లాసులతో వొచ్చింది. మెత్తని సోఫాలకు అలవాటుపడిపోయిన మాకు గట్టి కుర్చీల్లో కూర్చోవడం యిబ్బందిగా వుంది. యింట్లో ఫర్నిచర్ కోసం చుట్టూ కలియజూసాం. యిల్లంతా పుస్తకాలు, చిన్న చిన్న సామాన్లు తప్ప ఖరీదైన వస్తువులు కనిపించలేదు.

"పాప కనపడదే?" మాయావిడ అన్నది నీళ్ల గ్లాసు తీసుకుంటూ.

"తనిప్పుడు యిక్కడ లేదు. యెమ్మే చదవడానికి కేంబ్రిడ్జి యూనివర్సిటీకెళ్ళింది."

తోటికోడలి జవాబుతో నీళ్లు తాగుతున్న నా భార్య గొంతు పొలమారింది. నాకు నీళ్లు గొంతు దిగలేదు. బలవంతంగా దిగమింగి,

"యెప్పుడూ చెప్పలేదే, వాడూ అనలేదు." నాకు తెలియ కుండా యెలా వెళుతుందన్నట్లుగా అన్నాను.

"యీ మధ్య మనం కలవలేదు కదన్నా. మేమూ అటువైపు రాలేదు." బయటే చేతులు కడుక్కొని న్యాప్కిన్‌తో తుడుచుకుంటూ లోపలికి వస్తూ అన్నాడు తమ్ముడు.

దూరం పెరిగిందని చెబుతున్నాడా వీడు?

"డబ్బులెలా చేశారు?" మా యావిడ ఆసక్తి.

"అదే అరేంజ్ చేసుకుంది. ఎడ్యుకేషన్ లోన్, మెరిట్ స్కాలర్షిప్. యెన్ని అవకాశాలుంటే అన్నీ వుపయోగించుకుంది." కుర్చీ లాక్కుంటూ అన్నాడు నా తమ్ముడు. ఒకే ఒక్క క్షణం పాటు నా భార్య ముందు నా తమ్ముడి కుటుంబం గొప్పగా కనిపించడం నాకు గర్వంగా అనిపించింది. అది బయటికి కనిపించనీయకుండా,

"యెమ్మే చదువుకు యేమవకాశాలుంటాయి?" సంపాదన గురించి ప్రశ్న లాంటి స్టేట్మెంట్ వొదిలాను.

"యెమ్మే ఎకనామిక్స్ చదువుతోందన్నా. రీసెర్చ్ చేయాలను కుంటోంది. బహుశా టీచింగ్ వైపు పోతుందేమో!" నా తమ్ముడి ముఖంలో యే కోశానా యెమ్మేలో వొదిలి తప్పు చేశాననే ఫీలింగ్ కనబడటం లేదు.

లోపలికెళ్ళిన ఆడాళ్లిద్దరూ ప్లేట్లలో బిస్కెట్లతో, టీ కప్పులతో వచ్చారు.

"చదువుదేముందిలే, యిప్పుడు మగపిల్లలంతా అందం ఆస్తి వుండే అమ్మాయిల కోసమే చూస్తున్నారు. గ్లామర్ బాగా మెయింటెయిన్ చేస్తే చాలు." మాయావిడ దెబ్బకొట్టాననుకుంది. నా తమ్ముడు కూతురు కాస్త చామనఛాయగా వుండటం, అందం గురించి పట్టించుకోకపోవడం యీవిడ ఆనందానికి అదనపు కారణమైంది.

"చూద్దాం! మేం పిల్లను బాగా చదివించి, ముందు దాని కాళ్లమీద అది నిలబడేలా చేయాలనుకుంటున్నాం. పెళ్లి దానిష్టం." తమ్ముడి భార్య మాయావిడ అస్త్రానికి తిరుగు అస్త్రం వదిలింది.

"అదీ నిజమేలే! అంతంత ఖర్చు పెట్టి చేయాలంటే కావద్దూ. హనీకి నాలుగేళ్ల నుంచి సంబంధాలు చూస్తే యిదిగో యిప్పటికి కుదిరింది. మూడొందల కోట్ల ఆస్తి వున్న సంబంధమొకటి వచ్చింది, అబ్బాయి నల్లగా వున్నాడని వద్దనుకున్నాం. మరో అబ్బాయికి మంచి హోదా వుంది, అందంగానూ వున్నాడు. ఆస్తిలో మనకంటే తక్కువ. పెళ్లన్నాక అన్నీ చూసుకొని చేయొద్దూ!" అందానికి వంక పెట్టి, ఆస్తి తక్కువని మా పిల్లను కాదన్న సంబంధాల గురించి తెలివిగా దాటేసింది మాయావిడ.

వచ్చిన అన్ని గొప్ప సంబంధాల్లో అత్యంత గొప్ప సంబంధాన్ని యెంపిక చేయడానికి తామెన్ని తిప్పలు పడింది పూసగుచ్చినట్టు చెబుతోంది యేదీ వదలకుండా.

"సర్లే యింక కార్డివ్వు.. వాళ్ళకు" అన్నాను. యిన్కమ్ టాక్స్ వాళ్లెవరన్నా వింటారేమోనన్న భయం నాది.

"కళ్యాణమండపం వూరికి దూరమని రాకుండా వుండేరు. కార్ల పార్కింగ్‌కు అనుకూలంగా వుంటుందని దూరమైనా, ఖరీదైనా అక్కడే పెట్టాము." తోటి కోడలికి బొట్టు పెడుతూ అంది. పెళ్లికి రాకుండా చేయడానికి ఆవిడ యెత్తుగడలు నాకర్థమవుతున్నాయి.

"యెంత దూరమైనా కచ్చితంగా వస్తాం" అన్నారిద్దరూ.

"పెళ్లి ఖర్చు పదైదు దాటేట్లుంది. భోజనాలకే నాలుగు కోట్లు కేటరింగ్ వాళ్లకి." అన్నాను నేను మాయావిడకి కాస్త హెల్ప్ చేయాలన్నట్లుగా.

వీళ్ళని భయపెడుతూ, వాళ్ళ మనసులో పెళ్లికి రావాలని

ఆలోచన రాకుండా చేయడానికి యెన్ని మాట్లాడాలో అన్నీ మాట్లాడి,

"యిక బయలుదేరుతాం.. పెళ్ళికి కచ్చితంగా రండి." అంటూ బయలుదేరాం.

"యింతకాలానికొచ్చారు, భోంచేసి వెళ్లండి. అరగంటలో వంటయిపోతుంది" మరదలి మాటకు తోడుగా మా తమ్ముడూ అందుకున్నాడు,

"అవునన్నా యెన్నేళ్లయింది, మనం కలిసి భోంచేసి. కూర్చోండి భోజనం చేసి వెళ్దురు."

"లేదప్పా, యింకా పిలవాల్సిన యిళ్లు చాలా వున్నాయి. అయినా మేము రాత్రిపూట భోంచేయడం లేదు. ఫ్రూట్స్ మాత్రమే తింటున్నాము. ఆరోగ్యం కాపాడుకోవాలి కదా" ముఖం మీద జుట్టు సవరించుకుంటూ అంది మాయావిద.

నాకు తెలుసు కొత్తగా చేయించిన అరడజను బంగారు గాజులు తోడికోడలు దృష్టిలో పడాలని అలా సవరించుకుందని.

"పెళ్లి, అప్పగింతలు అయిపోయాక తీరిగ్గా వస్తాం లేరా" అంటూ బయలుదేరాం నేను మా ఆవిద.

❖❖❖

యెంత రాకూడదని పిలిచినా, వాళ్ళిద్దరూ పెళ్ళికొచ్చారు. ముఖాల మీద కొన్ని స్మైలీలు అతికించుకొని లోపలికి ఆహ్వానించాం. ఆశ్చర్యకరమైన విషయం పెళ్లిలో గొప్ప హోదాలో వున్నవాళ్లు నా తమ్ముడి తోటి, వాడి భార్య తోటి బాగా పరిచయమున్నట్లు మాట్లాడుతున్నారు, నేను పరిచయం చేయకపోయినా. తమ స్థాయికి యేమాత్రం వూహకందని యీ పెళ్లికి పిలిచినందుకు కృతజ్ఞత కానీ, మా స్థాయి పట్ల అసూయ గాని వాళ్ళ ముఖాల్లో చూద్దామని నా కోరిక నెరవేరకుండానే పెళ్లి తంతు ముగిసింది. వాళ్ళు మాట్లాడలేదు కానీ అంగరంగ వైభవంగా జరిగిన యీ పెళ్లి గురించి చాలామందే వ్యాఖ్యానించారు.

"పానీ పూరి కోసం మూడు వెరైటీల పానీలే పెట్టారు, మా అమ్మాయి పెళ్లి లో మేము యేడు రకాలు పెట్టాం తెలుసా?"

"మేమైతే పెళ్లికొచ్చిన వాళ్లకు రిటర్న్ గిఫ్ట్‌తో పాటు మంచి స్వీట్ బాక్స్ కూడా యిచ్చాము."

"ఉలవచారుతో పాటు గడ్డపెరుగు లేకపోతే ఏం బాగుంటుంది?"

"పెళ్లికూతురు మెడలో నెక్లెస్‌లో వొరిజినల్ డైమండ్సే అంటావా?" మా అమ్మాయి వొంటి మీదున్న బంగారాన్ని తప్ప, ముఖంవైపు చూడని ఆమె తోడికోడళ్ల సంభాషణ.

ఆపైన వినడానికి నా వల్లే కాలేదు. మొత్తం మీద పెళ్లి తంతు పూర్తయి అరవై లక్షల ఖరీదైన కారులో హనీ అత్తగారింటికి వెళ్ళింది.

❖❖❖

వెళ్ళింది వెళ్ళినట్లే గోడకొట్టిన రబ్బరు బంతిలా నెల రోజులకే వాడిన ముఖం వేసుకొని యింటికి తిరిగొచ్చింది. విషయం అర్థం కాక అయోమయంలో పడిన నాకు రెండ్రోజుల టెన్షన్ తర్వాత మాయావిద 'అసలు' విషయం చెప్పింది. యెన్ని కోట్లు గుమ్మరించినా యే అమ్మాయీ 'అతనికి' పనికిరాదని.

నెల రోజుల క్రితం వెలుగులు చిమ్మిన యిల్లు కాంతి విహీనమైపోయింది. యెవరికి చెప్పుకోవాలో తోచని పరిస్థితి. యెలా యీ సమస్యలోంచి బయట పడాలో తెలియని స్థితి. డబ్బులూ పోయె, పిల్ల బతుకు ఆగమైపోయె. నెలలు గడుస్తున్నా సమస్యకు పరిష్కారం వొక్కంగుళం కూడా ముందుకు కదల్లేదు.

సరిగ్గా అప్పుడే మా బాధకు తోడు కడుపు మంట రాజేయడానికి అన్నట్టు మా తమ్ముడూ, మరదలూ వచ్చారు వాళ్ల బిడ్డ పెళ్లికి పిలవడానికి.

"గొప్పగా చేయట్లేదన్నా. అది వాళ్ళ క్లాస్మేట్‌ని యిష్టపడింది, రిజిస్టర్ మ్యారేజ్ చాలన్నది. పరిచయ కార్యక్రమం వుండాలని రిసెప్షన్ పెడుతున్నాం సింపుల్‌గా."

సింప్లిసిటీలో కూడా గొప్పతనమున్నట్టు చెబుతున్నాడు కానీ నాకివేం పట్టే స్థితిలో లేను నేను. యింట్లో ఏదో తేడా వుందని వాళ్లకు అర్థమైనట్లు మాకు తెలుస్తోంది కానీ మేము బయటపడలేదు.

మరుసటి రోజు వాడు మళ్ళీ వచ్చాడు, "సారీ అన్నా, పరిస్థితి యిదీ అని నాకు తెలియదు. హనీ విషయం పాప చెప్పింది." వాడి మాటలు నా కూతురి జీవితం యిలా అయిపోయిందనే బాధ కంటే ఎక్కువ బాధ పడుతున్నట్లు గుచ్చుకున్నాయి. కానీ కొన్ని క్షణాలే.

"నాకు తెలిసిన మంచి లాయరున్నాడు, యే గొడవలు లేకుండా విడాకులిప్పించి ముందు హనీని బయటికేద్దాం..." యింకా ఏదో అంటున్నాడు గానీ నేనేం వినే స్థితిలో లేను.

అన్నట్టుగానే మూడు నెలలు తిరిగేలోగా ఆ వివాహ బంధంలో నుంచి యెటువంటి యిబ్బంది లేకుండా బయట పడేయించాడు.

"యికపైన హనీ భవిష్యత్తు నీ చేతుల్లోనేప్పా..." మాయావిద అంటోంది.

"యెవరి భవిష్యత్తయినా యింకొకళ్ల చేతుల్లో పెట్ట కూడదొదినా... వాళ్ళ చేతుల్లోనే వుండాలి."

మా తమ్ముడి ధోరణి మారదుగా!

■



# నివారణ

- అవ్వారు శ్రీధర్ బాబు
85001 30770

"ఎలా ఉందమ్మా బాబుకి" అడిగాడు రఘురామ్.

"ఇంకా ఐసీయూలోనే ఉన్నాడండి" కళ్ళనిండా నీళ్లతో సమాధానమిచ్చింది బాబు వాళ్ళ అమ్మ.

వద్దంటున్నా వినకుండా ఆమె చేతిలో డబ్బులు పెట్టి వెనుతిరిగాడు రఘురామ్

నుదురుని చేత్తో నొక్కుకుంటూ ఆటో ఎక్కాడు.

ఇంటికి బయలుదేరుతున్నాడే కానీ....దారంతా ఒకటే ఆలోచనలు... 'నావల్లనేనా...! నేనేనా కారణం...! నన్ను నమ్మినందువలనే అనుకుంటా ఇప్పుడు ఆ పిల్లవాడు అంత బాధ పడుతున్నాడు....! అమ్మకి అంత వేదన....! అవును కారణం నేనే...!'

❖❖❖

రఘురామ్ తండ్రి సిద్ధేశ్వర ఆచారి.

ఆచారి అన్నది ఇంటిపేరా లేక ఆయన కోసం వచ్చిన వాళ్ళు పెట్టిన పేరో తెలీదు కానీ ఆయన మాత్రం అలాగే ఉంటారు. పూజారి కాదు కానీ అచ్చు పూజారి మాదిరిగానే నుదురుపై విభూదీ.... పెట్టుకుంటాడు. అవి అతనికి హుందాతనాన్ని తెచ్చిపెట్టాయి. అతన్ని చూస్తే ఎవరికైనా దండం పెట్టాలనిపిస్తుంది. ఉదయం నాలుగు గంటలకే స్నానాదులు పూర్తిచేసి బయట అరుగు మీద ఏర్పాటు చేయబడిన ఆసనంలో కూర్చుంటాడు. ముందు ఒక పెట్టె ఉంటుంది. అప్పటికే అక్కడికి జనాలు వచ్చి అరుగు మీద కూర్చుని ఉంటారు. ఆయన ఒక్కొక్కరిని పిలిచి వారు చెప్పేది విని... పెట్టెలో తాయత్తు తీసి.. మంత్రాలు ఏదో చదువుతూ... వారి చేతికి కడతాడు. దానిని అక్కడివారు అంత్రం అంటారు. కట్టించుకునేవారు భక్తితో అక్కడ ఉన్న హుండీలో తమకు తోచినవి వేసి వెళ్తుంటారు. తను ఇంత ఇవ్వండంటూ ఎపుడూ అడిగింది లేదు.

సిద్ధేశ్వరాచారి అంత్రం కడితే ఇక తిరుగులేదు అని అక్కడి వారి నమ్మకం. ఈ కార్యక్రమం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు సాగుతూనే ఉంటుంది. ఆయనన్నా... ఆయన వేసే అంత్రమైన అక్కడ వారికి నమ్మకం ఎక్కువే.

❖❖❖

కాలేజీ నుండి ఇంటికి వచ్చిన రఘురామ్ ని చూసి "ఇక ఈ తాయెత్తులు కట్టే విషయం నువ్వు చూసుకోవాలిరా..... నాకు వయసు అయిపోయింది. మన అంత్రాల మీద ప్రజలకు మంచి గురి ఉంది. ఇంతవరకు నేను మా నాన్న నేర్పిన విద్యతో నా దగ్గరికి వచ్చిన వాళ్లను సంతృప్తిగా పంపించాను."అన్నాడు సిద్దేశ్వరాచారి.

"నాన్నగారు నాకు వీటి గురించి ఏమీ తెలీదు. నేను ఎలా చేయగలను"అన్నాడు రఘురామ్.

" మా నాన్న నాకు నేర్పిన విద్య నీకు నేను నేర్పుతాను." అన్నారు ఆచార్యులు.

ఈ మాట అన్నందుకు నన్ను క్షమించండి నాన్నగారు నాకు ఈ అంత్రాల్లో ఏముందో తెలియదు. ఇది ఎంతవరకు రోగాన్ని నయం చేస్తుందో తెలియదు. "రఘురామా" గట్టిగా అరిచాడు సిద్దేశ్వర ఆచారి.

"ఇది తాతల కాలం నుండి వస్తుంది. మన మీద ఎంత నమ్మకం లేనిదే ఇంతమంది వచ్చి మన తాయత్తుని తీసుకుంటారు చెప్పు. ఆ నమ్మకమే సగం జబ్బులు తగ్గిస్తుంది రా" అన్నాడు.

నమ్మకమే జబ్బుని తగ్గిస్తుందేమో నాన్నగారు అంత్రం కాదేమో...నసిగాడు, రఘురామ్

కోపంగా అరవబోయాడు సిద్దేశ్వర ఆచారి. దానితో

విపరీతమైన దగ్గు వచ్చింది.

రఘురామ్ అమ్మ "అవతలికి పోరా....!అంటూ భర్తకు నీళ్ళు తెచ్చి తాగించి పడుకోబెట్టింది.

కొన్నాళ్ల తర్వాత సిద్దేశ్వరాచారి కాలం చేశారు. నమ్మకం లేకపోయినా.. తండ్రి వారసత్వాన్ని రఘురామ్ తీసుకోక తప్పింది కాదు. తను బాధపడుతూనే అక్కడ వచ్చిన వారికి అంత్రం కడుతూ..... దీనితోపాటు డాక్టర్ దగ్గరికి వెళ్లి చూపించండమ్మ అంటూ సలహాలు ఇస్తుండేవాడు.

ఓ రోజు ఒక ముసలావిడ ఒక చిన్న పిల్లవాడిని తీసుకువచ్చింది. వాడు సోలిపోయి ఉన్నాడు. వెనకాల పిల్లవాని అమ్మేమో... ఏడుస్తూ పవిటతో కళ్ళుఒత్తుకుంటుంది. అబ్బాయి చేతికి అంత్రం కడుతూ... ఆమె బాధ చూసి..." బాధపడకమ్మ వ్యాధి తగ్గిపోతుంది" అంటూ అనునయంగా అన్నాడు, రఘురామ్.

అప్పుడు ముసలావిడ ..."అవును బాబు మీ తాతల కాడ నుండి పిల్లలకు ఇక్కడే అంత్రాన్ని కట్టించుకునే వాళ్ళం"... అంటూ కూతురు వైపు తిరిగి "ఇంకేమీ పర్లేదు బిడ్డ గట్టెక్కినట్లే" అంది.

బాబుని తీసుకెళ్తున్న పిల్లవాని అమ్మని చూసి.. "డాక్టర్ కు చూపించండమ్మ" అంటూ గొనిగాడు. వినబడిందో లేదో ఏడుస్తూనే వెళ్ళిందామె.

❖❖❖

పిల్లవాణ్ణి చూసి ఇంటికి వచ్చిన రఘురామ్‌కి రాత్రి నిద్ర పట్టలేదు. ఆలోచిస్తూనే ఉన్నాడు.

మరుసటి రోజు ఉదయం అంత్రం కోసం రఘురామ్ ఇంటికొచ్చిన వాళ్లు ఆశ్చర్యంగా చూడసాగారు.

"ఇక్కడ ఏ అంత్రాలు ఇవ్వబడవు. అంత్రాలకు జబ్బులు తగ్గవు" అని రాసి ఉన్న బోర్డు తగిలించబడి ఉంది అక్కడ.■


చదువుల బాబు


జానీ తక్కెడశిల

**2022 సంవత్సరపు కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్యం, యువ సాహిత్య పురస్కారాలను ప్రకటించారు. తెలుగులో బాల సాహిత్య పురస్కారానికి డి.కె. చదువుల బాబు (వజ్రాల వాన కథలు), యువ సాహిత్య పురస్కారానికి జానీ తక్కెడశిల (వివేచని - సాహిత్య విమర్శ) ఎంపికయ్యారు.**

## కవి - పుస్తకం

**అ**క్కడ తన పుస్తకం కనిపించగానే
కవి మొహం ముకుళించబోయి, వికసించింది
అవును మరి ...
ఫుట్‌పాత్ మీద పుస్తకం
ఒక రకంగా కవి పాపులారిటీకి రాజపథం కదా!
ఎంతమంది కళ్లు దాని మీద పడతాయని...
ముద్దొచ్చిన పాపాయిని ఎత్తుకున్నట్లు
ఎవరో ఒకరు దాన్ని చేతుల్లోకి తీసుకోరూ !
ఎగ్జిబిషన్‌లో ఏ మాడుగుల హల్వా శాంపిల్ ముక్కనో
రుచి చూసినట్టు
పుస్తకంలోని పదాన్నో పాదాన్నో చదవకపోరు...
ఏ రకంగానైనా
ప్రజల్లోకి వెళ్లడమే కదా
కవి కర్తవ్యం... కవి లక్ష్యం ...
సమాజాన్ని సరిదిద్దాలనుకుంటున్న కవి
తనకి తాను సర్దుకుపోవటం తప్పట్లేదు
నాయకుడో, సినిమావాడో, క్రికెట్ వీరుడో కాదు కదా!...
కవి... లోకానికి దిక్సూచిలాంటి కవి ...
ఎవరూ పట్టించుకోకపోయినా
తీరంలో ఓ మూల ఎండావానల్లో అలా నిలబడి
తన పని తాను చేసుకుపోవడం లేదూ, లైట్ హౌస్!

ఇక పుస్తకానికీ సుఖమే ఫుట్‌పాత్
అలంకరణ కోసం అమర్చుకున్న
నేల టిక్కెట్ క్యూలాంటి కిక్కిరిసిన
పుస్తకాల ర్యాక్‌లో ఇరికే కంటే నయం కదా!
ఆన్‌లైన్లో టికెట్ బుక్ చేసుకున్నట్లు
అలా కులాసాగా వెచ్చటి వెలుతుర్లో వుండొచ్చు
సరైన నిర్వహణ లేని
చీకటి కొట్టు లాంటి
దుమ్ము దుకాణం లాంటి
ఏ లైబ్రరీలోనో ఊపిరాడకుండా వుండే కంటే
రొచ్చు కంపు పీల్చుకుంటూనైనా
ఫుట్‌పాత్ మీద పవ్వళింపు పూలపాన్పు
పరవశమే పుస్తకానికి...
రోడ్డు జరీ చీర
మెరిసే మామిడి పిందెల అంచు
ఫుట్‌పాత్ మీద పుస్తకాలు ...!

– ఎస్.హనుమంతరావు
88978 15656

# సాహితీ ప్రజ్ఞ

నిర్వహణ : కుమార స్వామి

**1. ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్‌గా పిలువబడే భాష ఏది?**
ఎ. ఆంగ్లం బి. ఫ్రెంచ్ సి. తెలుగు డి. సంస్కృతం

**2. తెలుగు భాష దినోత్సవం ఏ రోజున జరుపుకుంటాం?**
ఎ. ఆగస్టు 28 బి. ఆగస్టు 29 సి.ఆగస్టు 1 డి. జనవరి 1

**3. 'తెలుగు' అనే పదం ఏ పదం నుంచి వచ్చిందని వాడుకలో ఉంది?**
ఎ. త్రిలింగం బి. శివలింగం సి. త్రినేత్రం డడి. పైవన్నీ

**4. 'పాకుడురాళ్లు' నవలా రచయిత ఎవరు?**
ఎ. రావూరి భరద్వాజ బి. రంగనాయకమ్మ సి. దాశరథి రంగాచార్య డి. జాషువా

**5. మైదానం నవల రచయిత?**
ఎ. వడ్డెర చండీదాస్ బి. శ్రీదేవి సి. యద్దనపూడి సులోచనారాణి డి. చలం

**6. తెలుగు ఏ భాషా కుటుంబానికి చెందినది?**
ఎ. సంస్కృత బి. ద్రావిడ సి. ఇండో ఆర్యన్ డి. ఇండోద్రవిడియన్

**7. 'దృక్పథం', 'కలం సాక్షిగా', 'కర్పూర వసంతరాయలు' తదితర రచనలు చేసిన ప్రముఖ తెలుగు సాహిత్యవేత్త ఎవరు?**
ఎ. కాళోజీ నారాయణరావు బి. విశ్వనాథ సత్యనారాయణ సి. బోయి భీమన్న డి. సి. నారాయణరెడ్డి

**8. నీతిశాస్త్ర ముక్తావళి' రచన ఏ భాషలో వెలువడింది? దీనిని రాసిన రచయిత ఎవరు?**
ఎ. సంస్కృతం, భర్తృహరి బి. ప్రాకృతం, గుణాఢ్యుడు సి. తెలుగు, బద్దెన డి. తమిళం, సుబ్రమణ్య భారతి

**9. క్రీ.శ. 1వ శతాబ్దిలో గుణాఢ్యుడు పైశాచీ ప్రాకృత భాషలో రాసిన పెద్ద కథా కావ్యం**
ఎ. బృహత్కథ బి. మణికుల్య సి. గాథాసప్తశతి డి. బాహుబలి

**10 మనకు లభిస్తున్న మొదటి పూర్తి తెలుగు శాసనం**
ఎ. ధనంజయుని కలమళ్ళ శాసనం బి. జయసింహ వల్లభుని విప్పర్ల శాసనం
సి. యుద్ధమల్లుని బెజవాడ శాసనం డి. విరియాల కామసాని గూడూరు శాసనం

**11. తెలుగు భాష' అను సమాసానికి విగ్రహ వాక్యం?**
ఎ. తెలుగు అనే పేరు గల భాష బి. తెలుగు యొక్క భాష సి. తెలుగు నందలి భాష డి. తెలుగైన భాష

**12. రేనాడు (కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలు) ఏడు వేల గ్రామాల సీమ అని చెప్పబడిన శాసనమేది?**
ఎ. మాలెపాడు శాసనం బి. కలమళ్ళ శాసనం సి. ఎర్రగుడిపాడు శాసనం డి. అద్దంకి శాసనం

**13. తెలుగు భాష మనది రెండుగ వెలుగు జాతి మనది అన్న కవి ఎవరు?**
ఎ. సినారె బి. శ్రీ శ్రీ సి. సిరివెన్నెల సీతారామశాస్త్రి డి. ఆత్రేయ

**14. తెలుగు లిపి ఏ లిపి నుండి పరిణామం చెందింది?**
ఎ. బ్రాహ్మి లిపి బి. వేంగీ లిపి సి. వాగ్దేవి లిపి డి. కన్నడ లిపి

**15. ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకు ఆద్యుడు**
ఎ. కట్టమంచి రామలింగారెడ్డి బి. కందుకూరి వీరేశలింగం సి. రాచమల్లు రామచంద్రారెడ్డి డి. చిలకమర్తి

**16. కవిత్వవేదిగా పేరు గాంచిన విమర్శకుడు**
ఎ. కట్టమంచి బి.కల్లూరి వెంకట నారాయణరావు సి. కల్లూరి సుబ్బారావు డి. వేల్చేరు నారాయణరావు


**17. 'మందార మకరంద మాధుర్యమున దేలు/ మధుపంబు వోపునే మదనములకు?' అన్న కవి ఎవరు?**
ఎ. పోతన బి. వేటూరి సుందర రామమూర్తి సి. నన్నయ డి. తెనాలి రామలింగడు

**18. 'ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాససంత్రస్తులై' అన్న కవి.....**
ఎ. ఏనుగు లక్ష్మణ కవి బి. బద్దెన సి. గోన బుద్ధారెడ్డి డి. నన్నయ

**19. 'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు' అన్న కవి ఎవరు?**
ఎ. త్యాగయ్య బి. అన్నమయ్య సి. క్షేత్రయ్య డి. మొల్ల

**20. బాలరసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకం... గూళలకిచ్చి యప్పడుపు గూడు భుజించనన్న కవి**
ఎ. ధూర్జటి బి. పోతన సి. వేమన డి. కవి చౌడప్ప

జవాబులు : **1. సి 2. ఎ 3. ఎ 4. ఎ 5. డి 6. బి 7. సి 8. సి 9. ఎ 10. ఎ**
**11. ఎ 12. ఎ 13. ఎ 14. ఎ 15. ఎ 16. బి 17. ఎ 18. ఎ 19. ఎ 20. బి**





# బాలల సినిమాలపై బహు విలువైన పుస్తకం

- సమ్మెట ఉమాదేవి
98494 06722

ఏ దేశమైతే పిల్లల ఆనందాలకు, విజ్ఞానానికి వినోదానికి ప్రాధాన్యతనిస్తుందో.. ఆ దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందనడంలో సందేహం లేదు. 'నేటి బాలలే రేపటి పౌరులు' అని నినదిస్తున్న మనం పిల్లల అవసరాలకు, ఆనందాలకు, వినోదాలకు విజ్ఞానానికి ఎంతటి ప్రాధాన్యతనిస్తున్నాం అన్న విషయాన్ని ప్రశ్నించుకోవల్సిన అవసరం ఉంది. ఎప్పుడైతే పిల్లలు స్వేచ్ఛాపూరిత వాతావరణంలో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఎదుగుతారో అప్పుడేవాళ్ళ మానసిక వికాసం సహజంగా, అద్భుతంగా పెరుగుతుంది. పిల్లలకోసం పెద్దలు కానీ, ప్రభుత్వం కానీ ఏదైనా చేయడమంటే కేవలం పాఠశాలలు స్థాపించడం మాత్రమే కాదు; పిల్లల శారీరక ఎదుగుదలకు సరైన క్రీడలు, ఆట వస్తువులు, క్రీడా స్థలాలు, కోచ్‌లు, స్విమ్మింగ్ పూల్స్ ఎంతో అవసరం. అలాగే వారిని వినోదపరిచే ఆటలు, పాటలు, కథలు, నాటికలు, పుస్తకాలు, సినిమాలు వంటివి కూడా ఎంతో అవసరం. పిల్లలు సాహిత్యాన్ని చదివి అర్థం చేసుకుని స్థితి కంటే ముందు.. వారు కార్టూన్ షోలు, సినిమాలు చూసి ఆనందించగలుగుతారు. మరి పిల్లలను అలరించడానికి సినిమాలంటూ ఏమైనా వస్తున్నాయా? వస్తే ఎటువంటి సినిమాలు వస్తున్నాయి? ముఖ్యంగా భారత దేశంలో పిల్లలకోసం ఎన్ని సినిమాలు తీస్తున్నారు? ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పిల్లల కోసం అసలు సినిమాలు తీసే ప్రయత్నం ఏమన్నా జరుగుతుందా? ఇవన్నీ మన ముందున్న ప్రశ్నలు .. ఇప్పుడు ఇన్ని ప్రశ్నలు రేకెత్తడానికి కారణం ప్రముఖ రచయిత్రి, సినీ విశ్లేషకురాలు శివలక్ష్మి పట్టేం రాసిన 'చిగురంత ఆశ' అన్న పుస్తకం.

"పిల్లల కంటే ప్రపంచంలో విలువైంది మరేది లేదు. బాలలందరూ భావితరాల సంపదలు" అన్న ఖలీల్ జిబ్రాన్ మాటలను రచయిత్రి గుర్తుచేసారు.. బాలల హక్కుల మొదటి ప్రకటనను 'జెనీవా డిక్లరేషన్' అంటారు కానీ, దాని వెనక ఉన్న గొప్ప దార్శనికురాలు, బాలల హక్కుల ప్రథమ రూపకర్త అయిన 'ఎగ్లాంటైన్ జేబ్' గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఈ పుస్తకంలో ప్రత్యేకంగా ఒక విలువైన వ్యాసం రాశారు. ఇంగ్లాండ్‌కి చెందిన ఎంగ్లాంటైన్ జేబ్ అనే మహిళ 1923లో బాలల హక్కుల గురించి కొన్ని మౌలికమైన డిమాండ్లతో అంతర్జాతీయ పత్రాన్ని రూపొందించింది. 'జెనీవా ఇంటర్నేషనల్ యూనియన్' సమావేశానికి హాజరై 'బాలలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజానిదే' అని ప్రప్రథమంగా బలంగా చెప్పిన వనిత ఈమె. ఫలితంగా 1923, ఫిబ్రవరి 23 న జెనీవా సదస్సులో 'అంతర్జాతీయ బాలల రక్షణ యూనియన్' దాదాపు పది హక్కులను ప్రకటించింది. ఈ పది హక్కులను ఈ వ్యాసంలో ఉటంకిస్తూ ఆ హక్కుల పట్ల కేవలం పిల్లలకూ, తల్లిదండ్రులకూ మాత్రమే కాకుండా మొత్తం సమాజం అవగాహన కలిగి ఉండాలని, ఈ హక్కుల పత్రాన్ని అన్ని పాఠశాలలు ప్రదర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేస్తారు రచయిత్రి.

1950 నుంచి.. జూన్ 1వ తేదీని ప్రపంచవ్యాప్తంగా 'పిల్లల రక్షణ దినం'గా అనేక దేశాలు పాటిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి కూడా సిఫార్సు వల్ల నవంబర్ 20ని 'యూనివర్సల్ చిల్డ్రన్స్ డే'గా నిర్ణయించారు. తర్వాత 1954 నుంచి బాలల కోసం ఒక ప్రత్యేకమైన రోజు కేటాయించారు. దీన్ని 1959లో ఐక్యరాజ్య సమితి అధికారికంగా అంగీకరించింది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి 1989లో బాలల హక్కుల అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించింది.

భారత్ 1992 డిసెంబర్ 11న బాలల హక్కుల ఒడంబడికను అంగీకరించి సంతకం చేసింది. చట్టాల రూపంలో ఆర్టికల్ 1 నుంచి 41 వరకు బాలల హక్కుల్ని రాజ్యాంగంలో పొందుపరిచారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి

ఒక్కరూ ముఖ్యంగా ప్రభుత్వంలో పరిపాలనలో భాగస్వాములైన వారందరూ ఈ హక్కులను గుర్తెరిగి పిల్లల కోసం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ పుస్తకం గుర్తు చేస్తోంది.

పిల్లల కోసం సాధించిన హక్కుల్లో భాగంగా మన దేశంలో 'చిల్డ్రన్ ఫిలిం సొసైటీ ఆఫ్ ఇండియా' 1955లో చాచా నెహ్రూ చిల్డ్రన్ ఫిలిం సొసైటీకి రూపకల్పన చేశారు. (అది నెహ్రూ జన్మదినం నవంబర్ 14న ప్రారంభమైంది) అప్పటినుంచి ప్రతి రెండేళ్ళకు ఒకసారి దేశంలోని వివిధ నగరాల్లో అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. 1995 నుంచి ఈ ప్రతిష్ఠాత్మకమైన చిత్రోత్సవాలకు హైదరాబాదును శాశ్వత వేదిక చేసి.. దాదాపు 12 సార్లు అంతర్జాతీయ చిత్రోత్సవాలను నిర్వహించారు. 2013లో జరిగిన 18వ అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల్లో రచయిత్రి శివలక్ష్మి పాల్గొని, ఆ చిత్రాలను తిలకించారు. 2015లో 19వ, 2017లో 20వ అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవాలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక హైదరాబాదులోనే జరిగాయి.

ఇక పిల్లల కోసం తెలుగు సినిమాల విషయానికొస్తే ... అక్కినేని కుటుంబం కుటుంబరావు గారి 'భద్రం కొడుకో' తర్వాత చెప్పుకోదగ్గ బాలల చిత్రాలు రాలేదని, 2013లో మద్దాలి వెంకటేశ్వరరావు తీసిన 'చదువుకోవాలి', అయోధ్య కుమార్ కృష్ణ శెట్టి తీసిన 'మిణుగురులు' అనే పిల్లల చిత్రాలు మాత్రమే వచ్చాయని తెలుపుతారు. ఎంతోకాలం నుంచి హైదరాబాదులో చిత్రోత్సవాలు జరుగుతున్నప్పటికీ ఇంతవరకు పోటీకి ఎంపికైన తెలుగు చిత్రం 'మిణుగురులు' ఒక్కటే! పిల్లలకోసం సినిమాలు తియ్యడం అంటే అది అనేక కష్టనష్టాలను ఓర్చుకొని శ్రమించడమే. ప్రభుత్వము నుంచి ఎటువంటి చేయూత, ప్రోత్సాహం లేకపోతే దర్శకులు నిర్మాతలు ఏమీ చేయలేరు. అందువల్లే ఫిలిమ్ ఫెస్టివల్స్ లో శతాబ్ద కాలం నుంచి గడిచిన 'బంగారు ఏనుగు' లాంటి అవార్డులు సాధించిన భారతీయ బాలల సినిమా ఒక్కటి కూడా మనకు రాని దురవస్థ గురించి శివలక్ష్మి విచారాన్ని వ్యక్తం చేశారు.

ఈ పుస్తకంలో ఇందులో ప్రస్తావించ బడ్డ 25 సినిమాలు వేటికవే ప్రత్యేకమైనవి. ఒక్కొక్క సినిమా గురించి క్లుప్తమైన వివరణ ఇస్తూ... ప్రతి సమీక్షకు ఒక చిన్న చిత్రాన్ని జోడించారు. చివరి పేరాల్లో ఆ సినిమాలు పొందిన పురస్కారాల వివరాలను ఇచ్చారు. ఈ 25 సినిమాల్లో మహిళా దర్శకులు నిర్మించిన ఆరు చిత్రాలు, వివిధ దర్శకుల 19 చిత్రాలను సవివరంగా సమీక్షించారు. కథాపరంగా, పిల్లల మానసిక అవసరాలపరంగా ప్రత్యేకంగా మలచబడ్డ ఈ సినిమాలు పిల్లలూ పెద్దలూ అందరూ చూడతగ్గవి.

ఒక్కొక్క సినిమా రూపొందించడానికి సంవత్సరాల తరబడి సమయం తీసుకుంటున్న మన దర్శక నిర్మాతలు.. ప్రముఖ హీరోలకు కోట్ల రూపాయలను పారితోషికాలుగా ధారపోస్తున్న నిర్మాతలకు.. ఒక్కొక్క సినిమాని మొదటి భాగం, రెండో భాగం అంటూ తీస్తున్నా.. ఓపికగా వేచిచూస్తూ తమ కష్టార్జితాన్ని వెచ్చించి చూస్తున్న ప్రేక్షకులకు.. పిల్లల వినోదాల గురించిన స్పృహ ఏనాడూ ఉండదు. గతంలో తీసిన పౌరాణికాలో.. పిల్లలు ప్రధాన పాత్రలు పోషించిన కొన్ని పెద్దల సినిమాలో తప్ప ఇది పిల్లల సినిమా అని చెప్పుకోతగ్గ సినిమాలు వేళ్ళ మీద కూడా లెక్కించలేము. అసలు మనం కూడా పిల్లల కోసం మంచి సినిమాలు తీయాలని దర్శక నిర్మాతలకు, పిల్లల కోసం బాధ్యతగా ఏదైనా చేయాలని పెద్దలకూ, ప్రభుత్వానికి అనిపించి.. పిల్లల కోసం అందమైన సినిమాలు తీస్తే ఎంత బాగుంటుంది! పిల్లలకు దసరా సెలవులు, సంక్రాంతి సెలవులు, వేసవి సెలవులు ఇన్ని రకాల సెలవులు ఉంటాయి. పిల్లల కోసం మాత్రమే కాస్త సొమ్ము వెచ్చించి, పిల్లల కోసం మాత్రమే చక్కని సినిమాలు రూపొందించి, పిల్లలకు ఆ సినిమాలు పాఠశాలల్లో చూపించడం అనేది బహుశా నాలాంటి వారికి ఒక అందమైన కలని కలగానే మిగిలి పోతుందేమో!

'చిగురంత ఆశ'కు సినిమా రీల్‌ని అందమైన కవర్ పేజీగా ముద్రించిన ఈ పుస్తకం తెరవగానే ఎడమ పక్కన శివలక్ష్మిగారి చిత్రంతో వారి క్లుప్త పరిచయం కనబడుతుంది. చివరి అట్టమీద కొందరు చిత్ర దర్శకులు, పిల్లలు చెప్పిన అమూల్యమైన మాటలను ముద్రించారు. క్రౌన్ సైజ్‌లో 174 పేజీలున్న కుహు ప్రచురణల ఈ పుస్తకం చాలా తేలికగా ఉండి చేతుల్లో అందంగా ఇమిడిపోతుంది. పిల్లల మనసెరిగిన పిల్లల వైద్యులు డాక్టర్ నళిని.. అనేక విషయాలను ప్రస్తావనకు తెస్తూ ఈ పుస్తకానికి సవివరమైన ముందుమాటను అందించారు.

"బాలబాలికలు సృజనాత్మకంగా ఎదగడానికి, మనుషుల పట్ల ప్రేమాభిమానాలతో పెరగడానికి, పెద్దల పట్ల గౌరవ మర్యాదలతో మెలగటానికి, మంచి స్నేహాన్ని, స్నేహితులను సంపాదించుకోవడానికి, పరిసరాలను, దేశవిదేశ సంస్కృతులను అర్థం చేసుకోవడానికి, వారి అవగాహనను పెంచి చైతన్యాన్ని ఇచ్చే ఇటువంటి మంచి సినిమాలను చూడగలిగేలా వారిని ఎదుగుతున్న చిన్నవయసు నుంచే ప్రోత్సహించాలి.' అన్న అభిప్రాయం కలిగి ఉన్న శివలక్ష్మి రాసిన 'చిగురంత ఆశ' పిల్లల సినిమాల సమీక్షా పుస్తకంగా మాత్రమే కాకుండా.. పిల్లల భవిష్యత్తు సినిమాల పట్ల మనలో సరికొత్త ఆశా భావాలను రేకెత్తిస్తుంది కూడా. పిల్లలపై అమితమైన ప్రేమతో కుహు ప్రచురణల ద్వారా ఇంత మంచిపుస్తకాన్ని అందించిన రచయిత్రి శివలక్ష్మి అభినంద నీయులు. రచయిత్రి వద్ద, అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాల్లో ఈ పుస్తకాలు లభ్యమవుతాయి. రచయిత్రి మొబైల్: 94418 83949. పుస్తకం వెల : రూ. 150. ■



# కాలం వెంట నడిచిన కవి తుమ్మల

- డా. డి. ఉదయ కుమారి
94913 11049

"రాష్ట్రసిద్ధి కొరకు రక్తమ్ము గార్చిన
కవిని నేను గాంధి కవిని నేను
బడలి బడలి తల్లిబాన కూడెము సేయు
కవిని నేను దేశికవిని నేను" అని సగర్వంగా చాటుకున్న తుమ్మల సీతారామమూర్తి నాటి తరం కవుల్లో మేటికవి. "కళకొరకే కవిత్వమని గంతులు వేయక, రోత రోతగా వలపులు నింపి కబ్బములు వ్రాయక, విశ్వజనీనోద్ధృతా లలితమూ, ఉదార వృత్తమూ, సంస్కృతీ ప్రభా మిళితము'లైన కావ్యాలు రచించి జాతి జనులకు కాన్కలిచ్చిన మహాకవి రాతకూ, చేతకూ, మాటకూ భేదం కన్పించని ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపినవారు.

తుమ్మల రచనా వ్యాసంగం వారి ఎనిమిదో యేటనుండే ప్రారంభమైంది. లఘుకావ్యాలు మొదలు మహావీర కావ్యాలదాకా విభిన్న వస్తువైవిధ్యం గల 26 కావ్యాల్ని 'రాష్ట్రగానము' ఆంధ్రరాష్ట్రోద్యమంతోనూ, ఆంధ్రరాష్ట్రావతరణంతోనూ ముడిపడిన ప్రఖ్యాత కావ్యాలు. 'పరిగపంట' 'శబల', 'పైరపంట', 'సమదర్శి', 'కందబ కైత' మొదలైన ఖండకావ్యాలతో పాటు కొన్ని ఆంధ్రీకృత కావ్యాలు వెలువరించారు. తుమ్మల సీతా రామమూర్తి తమ జీవన రీతిని, స్వీయ చరిత్రలోని కొన్ని ఘట్టాలను, సాహిత్య తత్త్వాన్ని ఆశల్ని ఆశయాల్ని, 'నేను', 'నా కావ్యాలు' పేరిట అక్షరీకృతం చేశారు. ఇవిగాక మరో రెండు కావ్యాలు 'ఎక్కట్లు', 'సందేశ సప్తశతి' రచించారు. ఈ రెండూ సమకాలీన సమాజంలోని ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాహిత్య రంగాలకు అద్దాల వంటివి. భారతదేశ పరిణామ క్రమాన్ని ఎంతో హృద్యంగా, వ్యంగ్యంగా, రసవత్తరంగా చిత్రించారు. 'ఆత్మకథ', 'మహాత్మ కథ' అనే రెండు మహాకావ్యాలను కూడా రచించారు. అవి తుమ్మలకు గొప్ప కీర్తి ప్రతిష్టలను సంతరించి పెట్టాయి. 'ఆత్మకథ', గాంధీజీ స్వీయచరిత్ర పద్యీకరణ 'మహాత్మ కథ' స్వాతంత్ర్య సంగ్రామ సారథియైన గాంధీజీ చరిత్ర, రాశిలోనూ, వాసిలోనూ ఇంత గొప్ప సాహిత్య సృష్టి చేసిన తుమ్మల సిద్ధాంతాలేమిటి? ఆశయాలేమిటి? ఏ సామాజిక, సాంఘిక ప్రయోజనాలను ఆశించి ఈ సాహిత్య ప్రస్థానం సాగించారు? అనే ప్రశ్నలు సహజంగానే పాఠకుల్లో ఉత్పన్నమౌతాయి. వీటికి వారి కావ్యాల్లోనే దొరుకుతుంది.

"ఏనూరినో పేరినోనుబ్బినో నిల్పి
వచ్చిసింగారంబు పల్కుకంటే
హేతువాదమ్మునకింత నిల్వగలేక
బూతుల బుంగలై జాతివైర
ములకు మతద్వేషములకుపాధ్యాయులై
యౌదార్యమునకు దవ్వగుచు నీతి
రీతుల కెంతయురోత రాజేయునట్టిపు
రాణమ్ములన్ బూసి వ్రాయుకంటే
కాసులకు దాసుడగుచు మ్రొక్కడిని బొగడి
కల్లకైతలనల్లుటకంటెనిట్టి
గుణరిష్టుల దేశభక్తుల చరిత్ర
చెప్పుట జగద్ధితంబైన చేతగాదె" అని 'ఆత్మకథ' కావ్యావ తారికలో చెప్పిన ఈ పద్యం తుమ్మలకు కవితావస్తువు విషయంలో గల అభిప్రాయాన్ని, కావ్యసృజన పట్ల ఆయనకు గల సిద్ధాంతాన్ని, వ్యక్తిత్వాన్ని విశదపరుస్తోంది. అంతేగాక సంఘ గతికి దూరమై నేలవిడిచి సాము చేస్తున్న సమకాలీన కవుల సాహిత్య ధోరణులనూ వైయక్తిక రాగద్వేషాలనూ, సంయోగ వియోగాలనూ, 'రోత రోత వలపులను' పద్యాల కెత్తుకున్న విధానాలను ఎంతో వ్యంగ్యంగా, గుప్తంగా నిరసించటం కూడా ఇందులో మనం గమనించవచ్చు.

కవిత్వానికి, సంఘానికీ అవినాభావ సంబంధం ఉందన్న విషయాన్ని తుమ్మల గట్టిగా నమ్ముతారు. సాంఘిక ప్రయోజనం లేని సాహిత్యసృష్టిని వారెన్నడూ ఆహ్వానించరు. కవిత్వంలో వాక్చమత్కారం గాక యుగలక్షణం గుబాళించాలని వీరి ప్రగాఢ విశ్వాసం. 'కృతిని జీవగగ్రగతి నుపదేశమ్ము కుదురుకొనుట

మేటిగుణము'గా భావిస్తారు.

"ఈ మేనెంతనలంగిన
నామనుగడలోక సేవనమ్మునకిడెదన్
సామాజిక కల్యాణము
కామించెద నవ్యభవ్య కవితాసృష్టిన్"

అని వీరొకచోట చెప్పిన మాట నూటికి నూరుపాళ్లు నిజం. తుమ్మల ప్రతిపద్యం వెనుక సాంఘిక నేపథ్యం ఉంటుంది. వారి ప్రతి కావ్యంలోనూ సామాజిక జీవన చిత్రణ కన్పిస్తుంది.

తుమ్మల కవిత్వం ఆంధ్రత్వ, భారతీయత్వ, విశ్వమానవత్వాల త్రివేణీ సంగమం. ఈ సంగమంలో గాంధేయవాదం అంతర్లీనంగా ప్రవహిస్తూ ఉంటుంది. "నైతిక పునరుజ్జీవన, జాతీయ వికాస విశ్వజనతా శ్రేయ: ప్రతిమ మతేచ్ఛ" మని చెప్పుకున్న తుమ్మల … తమ కవిత్వంలో ఈ మూడింటిని ప్రతిబింబింపచేవారు. 'తుమ్మలవారి కవితా భావనలో, భావాభిష్కరణంలో, వాక్య విన్యాసంలో ఆంధ్ర సంప్రదాయం మూర్తీభవించి ఉంటుంది. పూర్వ మహాకవులను తలపిస్తూ పులుముడూ, అన్వయక్లిష్టతా, వెలితి లేక, సర్వాంగ సుందరమైన తుమ్మల కవిత్వం చదువుతూ ఉంటే ప్రాణాలు లేచివస్త'వని ప్రశంసించిన కాటూరి గారి మాటలు అక్షరసత్యాలు.

భావ వ్యక్తీకరణ మూలం భాష మానవుడు తన హృదయగత అభిప్రాయాలను వ్యక్తం చేయటానికి భాషను ఆశ్రయిస్తాడు. కవికీ, సామాన్యవ్యక్తికీ ఈ భాషా వినియోగ విషయంలో చాలా భేదం ఉంటుంది. భాషా విషయానికొస్తే తుమ్మల సిద్ధాంతాలు నేటి అభ్యుదయ వాదుల అభిప్రాయాలకు పూర్తిగా భిన్నంగా కన్పిస్తాయి. భావ విప్లవాన్ని అంగీకరించినంతగా ఆయన భాషా విప్లవాన్ని అంగీకరించలేదు. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన మున్నగు ప్రాచీన కవుల ముద్రపడని భాషను ఉపయోగించడాన్ని ఏమాత్రం అంగీకరించదు. చిన్నయసూరి జీవిత్మకగా దీపించే 'సమున్నిద్ర సంప్రయోగ నిష్ఠ' వారిది 'ఎవ్వరెందరెంత దవ్వైన నేను భాషా విపర్యయమ్ము సైపలే'నని నొక్కివక్కాణించారు. భాషాపరంగా ఇంత కరుడుగట్టిన వీర గ్రాంధిక భాషావాదిగా కన్పించే తుమ్మల భావనాపరంగా అత్యంతాధునీకరంగా కనిపిస్తారు.

"ప్రాతదన్నది సర్వంబు రోతగాదు
క్రొత్తదన్నది సర్వంబు గుణము గాదు
ప్రాతక్రొత్తలలో మేలి రీతులెరిగి
చేయవలయును సాహితి సృష్టి సుకవి"

అని పాతకొత్తల మేలు కలయిక క్రొమ్మెరంగులు చిమ్మగా కావ్యసృజన చేస్తూ, సామాజిక పరిణామక్రమంలో సంభవించే మార్పు చేర్పులకు ఎప్పటికప్పుడు స్పందిస్తూ ముందుకు సాగిన పరిణామశీలి తుమ్మల. కాలంతో కదులుతూ, కాలంకంటే ముందుగా తన కలాన్ని పరుగెత్తిస్తూ ఉద్యమాలే ఊపిరిగా జీవించిన కవియోధుడు తుమ్మల. కాలం పరిణామశీలియని కాలచక్ర గమనంలో సంభవించే సామాజిక మార్పులకు అనుగుణంగా జీవితాల్ని మలచుకొంటూ ముందుకు సాగిపోవాలని తుమ్మల భావించారు. ఈ సామాజిక పరిణామాన్ని వారివలె గుర్తించి స్వాగతం ఇచ్చిన వారు ఎందరోలేరు. వేదాలను, స్మృతులను, పురాణాలను ఉల్లంఘిస్తూ మనం జీవించరాదని బెదిరించే తిరోగమన వాదులను 'మార్పు వలదనువారు గోమాంసమేల మెక్కరొకనాడు మన ఋషుల్ మెక్కిన'ట్లని ప్రశ్నించారు తుమ్మల. మనువు నీతి మనువు కాలానికేనంటూ–

"చొంగకార్చునాటి చొక్కాయకుర్రకు
నడక నేర్చినపుడు తొడుగు జిరుగు
తాతనాటి సంఘనీతి మన్నని వేళ
నడుపజూతురేని బెడిసికొట్టు"

అని వారన్నమాట అభివృద్ధికరమైంది. పరిణామశీలమైంది.

నేటి సమాజంలో జరుగుతున్న దోపిడీలను, అన్యాయాలను, అక్రమాలను, కుట్రలను, దొరతనాలను ఈనాటి అభ్యుదయ కవుల కంటే ఎంతో ముందుగా చిత్రీకరించారు. అసమ సమాజంలో 'ఒక యింట సిరులు మూల్గుట యొక యింటన్ బ్రేవులరచుచుండుట గమనించి తుమ్మల శ్రీమంతుల్ని గట్టిగా హెచ్చరించారు.


"అంతుపొంతు లేని యాస్తులనార్జింప
గడుగువారిపప్పులుడుకవికను
జడతవీడినారు కడగొట్టు తుమ్ములు
కదిలినారు నొసటి కన్నువిప్పి
బొర్రబలిసి నేడు విర్రవీగుచునున్న
సాహుకార్లయాట సాగిదిట్లే
రుద్రమూర్తియై దరిద్రుండు చిచ్చర
కన్నువిప్పి గజ్జెగట్టునెపుడొ'

అన్నారు.

"ఎముకల గుడులై బ్రతకునీడ్చుట కొల్లక త్రెళ్ళలేక శోషముల దపించుచున్ సెగలు క్రక్కు దరిద్రు"లంతా ఒక్కటై విప్లవిస్తారని, ఆ విప్లవాగ్ని "హేరాళ జ్వాలా చక్రవిక్రమ క్రీడా చాతురి మాన్పజాలుటయసాధ్య"మని, ఆ సమయం రాకముందే అందలాలమరిన వారి మేల్కొనుట మంచిదని హెచ్చరించారు. గాంధేయవాదియైన తుమ్మల హృదయ పరివర్తనను మాత్రమే కోరుకుంటారు. వర్గ సంఘర్షణ ఆయన కవిత్వంలో కనిపించదు. అయితే ఈనాటి అభ్యుదయ కవులు కోరుతున్న సాంఘిక వ్యవస్థను తుమ్మల కూడా గట్టిగానే ఆకాంక్షిస్తారు. సామ్యవాద సమాజాన్ని ఒక్కొక్క కవి ఒక్కొక్క రకంగా దర్శించాడు. తుమ్మల దృష్టిలో అది –

"బిచ్చగాడు లేని ముచ్చులేని కటారి
లేని దొరతనమ్ము లేని కుట్ర
లేని యీరసమ్ము లేని దేశావధి
లేని పందువిది ఫలింపవలయు".

■






# మనకు తెలిసీ తెలియనట్టుండే జీవితాల కథలు

- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
తెలుగు శాఖాధ్యక్షులు
హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు
91826 85231

**ఆ**చార్య మ(దై)బోయిన జయదేవ్ గారు ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా, శాఖాధ్యక్షులుగా సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. మంచి అధ్యాపకులుగా పేరు తెచ్చుకున్నారు. ప్రాచీన, ఆధునిక, జానపద సాహిత్యాలపై లోతైన అధ్యయనం ఉన్నవారు. ఈ విషయాలు అక్కడక్కడ సదస్సులు జరిగినప్పుడు కలిసిన అధ్యాపకులు, ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థుల ద్వారా వినేవాడిని. ఆయన దగ్గర నుంచి నాకు ఒక పరిశోధన గ్రంథం వచ్చింది. అది చూసిన తర్వాత దానిలో పాటించిన పరిశోధనా పద్ధతి, ప్రతిపాదించే అంశాన్ని తార్కికం గా, శాస్త్రీయంగా ముగించే తీరు నాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఆ పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించిన తర్వాత ఆయనతో మాట్లాడాను. పరిశోధన చాలా బాగా చేయించారని, రిపోర్టులో అన్ని రాయలేమని, నాకు బాగా నచ్చిన అంశాల్ని ఆ సంభాషణలో ప్రస్తావించాను. ఆయన కూడా రిపోర్ట్ బాగా రాశారని మెచ్చుకున్నారు. కొన్నాళ్ళ తరువాత ఆయన రాసిన ***'మహా భారతంలో జానపద కథాంశ కథలు'*** పరిశోధనా గ్రంథాన్ని పంపించారు. ఆ గ్రంథం ఆయనపై నాకున్న గౌరవాన్ని మరింతగా రెట్టింపు చేసింది. ఇదంతా ఎందుకంటే– జయదేవ్ గారు తాను మంచి పరిశోధన చేయడమే కాకుండా తన విద్యార్థుల చేత కూడా మంచి పరిశోధనలు చేయించిన ఉత్తమ పరిశోధకుడు అని చెప్పడానికే.

అలాంటి పరిశోధకుని కలం నుంచి ఇప్పుడు కథలు వెలువడుతున్నాయంటే కొంచెం ఆశ్చర్యానికి గురైన మాట నిజమే!

జయదేవ్ గారు మహాభారతంలోని జానపద కథాంశాలను గురించి ***'మహా భారతంలో జానపద కథాంశ కథలు'*** అనే తమ గ్రంథంలో విపులంగా చర్చించారు. సంప్రదాయ సాహిత్యాన్ని, జానపద సాహిత్యాన్ని ఎంతో లోతుగా పరిశీలిస్తే తప్ప అది సాధ్యం కాని విషయం. అలా పరిశీలన చేసినప్పుడే ఆచార్య జయదేవ్ గారు కథానిర్మాణంలోని మెలకువలను కూడా గుర్తించి ఉంటారు. ఆ అధ్యయనాన్ని ఇప్పుడు రాసిన కథానికలకు బాగా ఉపయోగించుకున్నారనిపించింది. తన నిత్యజీవితంలో గమనించిన అనేక జీవన సత్యాలను సుమారు 20 కథలుగా రాసి వాటిని ***'జయదేవ్ కథలు'*** అనే పేరుతో ఒక కథా సంపుటిని 2022లో తీసుకొచ్చారు. ఇప్పుడు మళ్లీ మరో 20 కథలను ***'అనుభవాల కథలు'*** పేరుతో ఒక కథా సంపుటిని తీసుకొచ్చారు.

**పిసినారి దాతృత్వం** కథలో వెంకట్రావు ఒక ఉద్యోగి, పరమ పిసినారి, పెళ్లి కూడా చేసుకోలేదు. తన జీతమంతా బ్యాంకులోనే దాచి పెట్టాడు. తన జీతంలో ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టుకోలేదు. మరి ఆ డబ్బు ఎవరికోసం దాస్తున్నాడు? ఆ డబ్బు ఏం చేశాడు అనేది ఈ కథలో ఒక ట్విస్ట్. ఈ కథలో ఇతను ఒక రేర్ క్యారెక్టర్. తన భోజనాన్ని గుడుల దగ్గర పెట్టే ప్రసాదంతోనే సరిపెట్టుకోవడం, సెకండ్ హ్యాండ్ బట్టలు కొనుక్కోవడం, నడిచి వెళ్లడం లేదా తన పాత సైకిల్ మీదనే ఆఫీసుకు వెళ్లడం ఇవన్నీ అతని పాత్రను శాశ్వతంగా గుర్తుండిపోయేలా చేస్తాయి. అతని పిసినారితనాన్ని గురించి అతని సహోద్యోగులు రకరకాలుగా చెప్పుకునేవారు. అతను చనిపోయిన తర్వాత బ్యాంకు మేనేజర్ చెప్పిన విషయం విన్న ఆ సహోద్యోగులు ఆశ్చర్యానికి గురవుతారు. బ్యాంకులోని తన డబ్బు మొత్తాన్ని భారత సైనికనిధికి దానంగా ఇచ్చిన గొప్ప దేశభక్తుడని తెలుసుకున్నారు. దానం చేసే వాళ్ళుంటారు, కానీ ఇంతలా తన జీతం మొత్తాన్ని సైనికనిధికి దానం చేసే వాళ్ళుంటారా? అని ఆశ్చర్యపోయే ఒక గొప్ప కథ ఇది.

**'కూతురు కథ'**లో రామారావు భార్య సీత ప్రసవ సమయంలో చనిపోతుంది. కడుపులో పిల్ల అడ్డం తిరగడం, ఆ బిడ్డను బయటకి తీయడానికి వైద్యులు సిజేరియన్ చేయడం, దానివల్ల విపరీతంగా రక్తస్రావం కావడంతో ఆమె చనిపోతుంది. భార్య చనిపోవడానికి

తన కూతురే కారణమని భావిస్తున్న రామారావుకు కూతురంటే ఇష్టముండదు. తన భార్య మీద ఉన్న ప్రేమతో మళ్లీ పెళ్లి చేసుకోడు. రామారావు తల్లి అన్నపూర్ణ ఆ పిల్లను పెంచి పెద్ద చేస్తుంది. ఆ పిల్లకు చనిపోయిన కోడలు పేరుతో సీత అనే పేరు పెడుతుంది. కొన్నాళ్లకు రామారావుకు పక్షవాతం రావడం, ఆ పరిస్థితిలో అతని కూతురు సీత అన్ని సపర్యలు చేయడానికి దిక్కవడంతో తండ్రి రామారావు పశ్చాత్తాపానికి గురవుతాడు.

కొన్ని యాదృచ్ఛికంగా జరిగే సంఘటనలకు మనం ఎవరెవరి నో బాధ్యులను చేస్తూ ఉంటాం. దాని వల్ల చాలామంది మానసికంగానూ భౌతికంగానూ ఎన్నో సమస్యలకు గురికావాల్సి వస్తుంది. ఆ తప్పు తెలుసుకునేసరికి జరక్కూడని నష్టం జరిగి పోతుంది. ఆవేశంతో తీసుకునే నిర్ణయాలు కొంతమంది మానసిక సంఘర్షణకు, మానసిక అశాంతికి, అనేక సమస్యలకు ఎలా దారి తీస్తాయో తెలియాలంటే ఈ కథ చదివి తీరాలి.

**'ఆడపిల్ల పుట్టిందని'** కథ కొన్ని కరుడు కట్టిన మూర్ఖపు భావాలున్న కొంతమంది మనస్తత్వాల్ని మన కళ్ళ ముందు నిలుపుతుంది. సాధారణంగా తనకు పుట్టేది ఆడపిల్లో మగపిల్లోడో తల్లికి తెలియదు. ఏ స్త్రీ అయినా తాను కావాలని అలా కనలేదు. కానీ, మన సమాజంలో కొందరు మూర్ఖపు పురుషులు ఆడపిల్ల పుట్టడంలో తల్లిని మాత్రమే బాధ్యురాలిగా చేయడం, తన భార్య కొడుకునే కనాలని పట్టుపట్టడం, కూతురును కంటే ఆమెను రకరకాలుగా భౌతిక మానసిక హింసలకు గురిచేయడం సమాజంలో కనిపిస్తున్న ఒక దారుణం. అలాంటి పరిస్థితి తనకు ఎదురైనప్పుడు ఒక భార్య ఎలా ప్రతిస్పందిస్తుందో ఈ కథలో రచయిత చెప్పారు. ప్రస్తుత సమాజానికి ఇలాంటి స్ఫూర్తి అవసరం.

**'పెళ్లి వద్దు నాన్న'** కథలో పెళ్లికి ఉన్నత చదువులకు మధ్య నలిగిపోయే ఒక ఆడపిల్ల, తనకు తల్లిదండ్రులకు మధ్య జరిగిన సంఘర్షణే వస్తువు. యుక్త వయసులో ఉండగానే తమ కూతురు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు అనుకోవడం సహజం. ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరిగితే బాగుంటుందని వాళ్లు భావిస్తారు. కానీ, పెళ్లి ఒక్కొక్కసారి ఆడపిల్ల ఆశయాలను చంపేస్తుంది. తన ఆశయాలను నిలబెట్టుకోవడం కోసం ఒక యువతి తీసుకున్న నిర్ణయమే ఈ కథ.

యుక్త వయసులో వివాహం జరగకపోవడం వల్ల, వాళ్లు స్థిరపడిన తర్వాత వివాహం చేసుకోవడం వల్ల, పిల్లలను కనడం వారిని పెంచడం వంటి వాటిలో చాలా సమస్యలున్నాయి. అలాగే ఎంతో తెలివితేటలున్నప్పటికీ ఆడపిల్లలైతే వెంటనే పెళ్లి చేసి తమ బాధ్యతను వదులుకోవాలనే తల్లిదండ్రుల యొక్క దురాలోచనలు కూడా ఉన్నాయి. స్త్రీకి ఆర్థిక స్వావలంబన ఎంత అవసరమో, జీవితాన్ని ఆనందంగా గడపడం కూడా అంతే ముఖ్యం. ఈ రెండింటిని సమన్వయం చేసుకోవడం అనేది అంత సులభమైన విషయం కాదు. ఎంతో సాదాసీదాగా కనిపించే ఈ సమస్య చాలా తీవ్రమైంది. ఆ సమస్యను అంతే సహజంగా రచయిత కథగా మలచి, మన ముందుంచారు. రచయిత పరిష్కారాన్ని చెప్పకుండా పాత్ర ఇలాంటి పరిష్కారం తీసుకున్నది, దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో మీరే ఆలోచించండి అన్నట్లుగా కొన్ని కథలున్నాయి. అలాంటి కథల్లో ఇది ఒకటి.

**'గర్భవతి'** కథ అంతా ఒక కల. గర్భంతో ఉన్న స్త్రీ రకరకాల ఊహలలో విహరిస్తుంది. రకరకాల కలలు కంటుంది. ఈ కథలో రాణి కూడా ఒక సామాన్యమైన యువతి. గర్భవతిగా ఉన్నప్పుడు మంచి కల కంటుంది. రచయిత చివర కొసమెరుపు చాలా బాగా పెట్టారు. 'కల నిజమైతే ఎంత బాగుంటుందని అనుకుంది' అని ముగించారు. కలలో గర్భవతిగా ఉన్న ఆమెను ఇంట్లో వాళ్ళందరూ మహారాణి లాగా చూస్తూ ఉంటారు. ఆమెకు అన్నం తినిపిస్తున్న భర్త రాజు పొరపాటున నీళ్లు ఆమె ఒంటి మీద పోస్తాడు. వెంటనే ఆమె అతని చెంప చెల్లుమనిపిస్తుంది. ఆడవారికి కొన్ని కోరికలుంటాయి. కానీ, ఆ కోరికలు తీరడం అంత సులభం కాదు. భర్తకు అన్నం తినిపిస్తూ ఆమె పొరపాటున భర్త మీద నీళ్లు పోస్తే భర్త ఆమెను కొట్టడం అత్యంత సహజం. కానీ, భార్య ఆ పని చేసింది ఇక్కడ. అది సాధ్యమా? శిల్ప పరంగా కొంత పరిణతి కన్పించే మంచి కథ ఇది. కేవలం కథనంతా కలగా వర్ణించి చివరకు అలా జరిగితే బాగుండునని అనడం ద్వారా ఆమె భర్త ఎటువంటి వాడో తెలుసుకోవాలని పాఠకులు కథను మళ్ళీ వెనక్కి వెళ్లి చదువుతారు. కథలో ఆ వివరాలు ఏవీ ఉండవు. ఈ కథ శిల్పపరంగా గొప్పది కావడానికి ఆ వివరాలు లేకపోవడమే ప్రధాన కారణం.

కథకైనా, సినిమా కైనా, సీరియల్ కైనా, నవలకైనా సంఘర్షణ ముఖ్యం. ఆ సంఘర్షణ కోసం రచయిత కొన్ని సన్నివేశాలను కల్పిస్తారు. కథను చెప్పడంలో జరిగిపోయిన దాన్ని ముందు చెప్పడం 'ఫ్లాష్ బ్యాక్' కథనంలో ముందు జరగబోయే దాన్ని ఊహించేలా చెప్పడం, ఇవన్నీ రచయిత ప్రతిభకు సంబంధించిన విషయాలు. కథను సుఖాంతం చేయాలా? కథను ముగించే టప్పుడు ఆ ముగింపును పాఠకులకే వదిలివేయాలా? కథకుడే చెప్పాలా? అనే విషయాలు శిల్పానికి సంబంధించినవి. కూతురు తన కులం కాని అబ్బాయిని ప్రేమించింది. ఆ విషయం తల్లిదండ్రులకు చెప్పింది. వాళ్ళు అంగీకరించలేదు. తన కులం వ్యక్తితో ఆమెకు బలవంతంగా పెళ్లి చేశారు. ఈవిషయం ఆమె తన ప్రేమికుడికి ఫోన్ చేసి చెప్పింది. "నువ్వు పెళ్లి చేసుకున్నా *పర్వాలేదు, నిన్ను నేనూ మా కుటుంబమంతా కలిసి బంగారంలాగా చూసుకుంటాం, నువ్వు నాతో రా"* అని అతడు ఆమెకు చెప్పాడు. ఆమె వెళ్ళిపోయింది. ఆ ఇంట్లో వాళ్ళందరూ ఆమెను బాగా చూసుకున్నారు. ఈ విషయం ఆమె తన కుటుంబానికి, తనను పెళ్లి చేసుకున్న వ్యక్తికి చాలా మర్యాద పూర్వకంగా చెప్పింది. కూతురు జీవితం బాగుండాలని భావించిన ఆమె తల్లిదండ్రులు ఆమె ప్రియునితో వెళ్లిపోవడాన్ని

అంగీకరిస్తారు. కథ సుఖాంతం. ఈ **ప్రేమకథ** ద్వారా రచయిత యువతీ యువకులు కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నా వాళ్లు సుఖసంతోషాలతో ఉంటారని, తల్లిదండ్రులు వారిని అర్థం చేసుకొని సహకరించాలని చెప్పినట్టు అర్థమవుతుంది.

**'భార్యాభర్తలు'** కథలో భార్య, భర్త ఇద్దరూ ఉద్యోగస్తులయితే ఉండే సమస్యలు వాటి పరిష్కారాలను రచయిత చెప్పారు. **'సంతానం'** కథ ఒక నవలకు ఉన్నంత కాన్వాస్ ఉన్న కథ. సంతానం కోసం భర్త తన భార్య మరొక వ్యక్తి దగ్గరకు వెళ్ళడానికి అంగీకరిస్తాడా? మహా భారతం నాటి కథను గుర్తుచేసే కథ ఇది. **'నాన్న బరువయ్యాడు'** కథలో ఈనాడు తల్లిదండ్రుల పట్ల పిల్లలు వ్యవహరిస్తున్న తీరుతెన్నులను మన కళ్ళ ముందు నిలుపుతుంది. కథను ఆశావహంగా ముగించడం బాగుంది. **'అనాయాస మరణం'** కూడా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పరిస్థితులను వర్ణించిన కథ. చాలా ఆధ్యాత్మిక గ్రంథాలను చదివిన ప్రధాన పాత్రకు తాను కోరుకున్న అనాయాస మరణం వచ్చిందా? లేదా? అనేది చర్చకు పెట్టారు రచయిత. ఈ కథ చదివిన తర్వాత గుండె బరువెక్కి పోతుంది.

**'పల్లెటూరు మనిషి'** కథ చదువుతుంటే పాలగుమ్మి పద్మరాజు గారి **'గాలివాన'** లీలగా గుర్తుకొస్తుంది. మానవుల మనస్తత్వాలను, వారి ప్రవర్తనను అవగాహన చేసుకోవడానికి ఈ కథ రాశారనిపిస్తుంది. చిన్నదే కానీ శిల్పపరంగా మంచి కథ. **'నేటి ప్రొఫెసర్'** విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధనల తీరుతెన్నులను ఎండగట్టిన కథ. **'దురాశ'** కట్నకానుకల కోసం ఎదురుచూసే యువకులను దారిలో పెట్టేలాగా రాసిన కథ.

ఆ మధ్య ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పేరుతో ప్రభుత్వం అత్యంత చౌకగా కొంతమందికి భూములను కట్టబెట్టడం, అక్కడ పరిశ్రమలు రాకపోగా వాటిని ప్రైవేటు వ్యాపారానికి వినియోగించుకున్న వైనాన్ని తెలియజేసిన కథ **'మాయ సెజ్ కంపెనీ'**. ఈ కథ చదివిన వారికి ఆనాడు ప్రభుత్వాలు ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన సెజ్‌ల ద్వారా నిరుద్యోగ సమస్య తీరిందా? నిజంగా కంపెనీలు స్థాపించారా? మరి ఆ సెజ్‌ల ద్వారా ఇచ్చిన భూములేమయ్యాయి వంటి ప్రశ్నలు ప్రజల్లో కొత్త ప్రశ్నలను పుట్టిస్తాయి.

**'వివక్ష'** ఒక సామాజిక సమస్యను చర్చించే ఒక మంచి కథ. సమాజంలో కొన్ని కులాల వారికి ఎక్కడలేని గౌరవాన్ని ఆపాదిస్తారు. కొన్ని కులాల వాళ్లను వాళ్ళు ఎంత ప్రతిభావంతులైనా వారిని సరిగా గౌరవించరు. జంతువుల్లోనూ, పక్షుల్లోనూ కూడా ఈ వివక్ష కనిపిస్తుందని ఒక పరిశోధనాత్మక విషయాలతో కొనసాగిన కథ. ఒక దుర్మార్గున్ని ఎదిరించలేక చస్తూ బతకడం కంటే అతన్ని చంపడమో, తాను చావడమో ఏదో ఒకటి జరగడమే దీనికి సరైన పరిష్కారం అని చెప్పే కథ **'తెగింపు'.** దుర్మార్గుడైన ఒక రెడ్డిని, తాను మానసికంగా, శారీరకంగా పెట్టే బాధలను భరించలేక ఒక మాదిగ యువతి తన భర్తతో కలిసి చంపడానికి చేసిన సాహసాన్ని రాయలసీమ మాండలికంలో అత్యంత సహజంగా వర్ణించిన కథ ఇది. కథకుడిగా ఆచార్య జయదేవ్ గారు తెలుగు కథా సాహిత్యంలో ఒక ముద్రతో తన స్థానాన్ని నిలుపుకోగలుగుతారని చెప్పడానికి ఈ ఒక్క కథ చాలు.

ఇంట్లో ఏదైనా వస్తువు పోతే పని మనుషుల మీద యజమానులు తొందరపాటుతో అనుమానిస్తారని చెబుతుంది **'తొందరపాటు'** కథ. అసలు ఒకరి ఎంగిలి కంచాన్ని మరొకరు కడగడం అనేది దయనీయమైన పని. పని మనుషులు ఎంగిలి కంచాలను కడగటం వారి పనిలో భాగంగా ఉంటుంది. అలా కడగడం అనే ఒక్క పని కోసం వాళ్లను తల్లిలా భావించాలి. కానీ కొందరు యజమానులు వాళ్లను తమకు సేవ చేయడం కోసమే పుట్టారన్నట్లుగా ఎంతో అవమానకరంగా చూస్తుంటారు. ఒక పని మనిషిని కేంద్రంగా చేసుకొని రచయితఈ కథను రాశారు.

ఈ కథలన్నీ చదివిన తర్వాత మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మనం గమనిస్తే... ప్రతి జీవితమూ, ప్రతి సంఘటన ఒక కథలా రాయొచ్చు అనిపిస్తుంది. రచయిత శిల్పం కోసం ప్రాకులాడలేదు. తన చుట్టూ ఉన్న సమాజాన్ని చెప్పాలనుకున్నారు. మన చుట్టూ సమాజం ఎలా ఉందో గమనిస్తున్నారా? అని మనలను ప్రశ్నించినట్లుగా ఈ కథలున్నాయి. ఈ కథల్లో మరో విశేషమేమిటంటే, విద్యాసంస్థల్లో జరుగుతున్న లొసుగులను చెప్పి వాటికి తీసుకోవలసిన పరిష్కారాలను మనకు సూచిస్తున్నారు రచయిత. మనం ఎలాంటి విద్యావ్యవస్థలో ఉన్నామో గమనించమంటున్నారు. ప్రభుత్వాలు తీసుకునే కొన్ని నిర్ణయాలు ... ఒకటి రెండు కుటుంబాలకు మాత్రమే ప్రయోజనకరంగా మారిపోతున్న విధాన నిర్ణయాలను పునఃసమీక్ష చేసుకోవల్సిన అవసరాన్ని ఈ కథలు మనకు సూచిస్తున్నాయి. సమాజంలో ఉన్న వర్గాధి పత్యాన్ని, భూస్వామ్య స్వభావాన్ని ఈ కథల్లో రచయిత చాలా స్పష్టంగా చెప్పారు. ఎన్నో ఉన్నత చదువులు చదివి ఉన్నతోద్యోగాలు చేస్తూ కూడా తనతో సమానంగా ఉద్యోగం చేస్తున్న స్త్రీల పట్ల పురుషులు వ్యవహరిస్తున్న తీరును, వాళ్లలో రావలసిన మార్పును చెప్పేటప్పుడు రచయిత ఒక స్త్రీవాదిలాగా కనిపిస్తారు.

ఈ కథలను చదవకముందు ఆచార్య జయదేవ్‌గారిని ఒక పరిశోధకుడుగా, ఒక ఆచార్యుడిగా మాత్రమే చూశాను. కానీ, ఈ కథలు చదివిన తర్వాత మన చుట్టూ సమాజంలో జరుగుతున్న సంఘర్షణలకు ఆయన ఎంతగా స్పందిస్తున్నారో, ఎంతగా సంఘర్షణకు గురవుతున్నారో తెలుసుకోగలిగాను. విశ్వవిద్యాలయాల్లో జరిగే విషయాలను చెప్పేటప్పుడు ఎంతో సాధికారికంగా చెప్పగలిగారు. దీనికి కారణం ఆయన విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా ఉండి అక్కడ జరుగుతున్న అనేక విషయాలను బాగా గమనించిన అనుభవం కావొచ్చు.

■

# వానా .. స్వాగతం!



నువ్వు కనిపించాలి
నిత్యం నీ శబ్దంతో వినిపించాలి
మేం ఊగుతాం ఊరేగుతాం
ఎప్పటికప్పుడు
నీ ఊపిరి ఉద్యమం కావాలి
నీ ఉనికి ఊర్వికి ఉపకారం కావాలి
అందరూ నీకోసం నిరంతర నిరీక్షితులే!
రైలు రాకకి ప్రయాణికులు ఎదురు చూస్తున్నట్టు
నీ రాకకై చూస్తూ పరితపిస్తూ ...
ఎక్కడున్నా నీవు రావాలి !

మమ్మల్ని
పరీక్షించేంత కాలం పరీక్షించావు
శిక్షించేంత కాలం శిక్షించావు
ఇంకా మోరాయింపులా?
దయతో మా మొరలు ఆలకించు!
నువ్వొస్తావు తప్పక వస్తావు
నీది మానవీయ దృక్పథం
నీది సమతా వీక్షణ భావజాలం
గుడిసెలు మేడలు పుట్టలు గుట్టలు
నిన్ను చూస్తే పులకిస్తాయి
నువ్వు తాకితే పరిమళిస్తాయి
అందరి మన్ననలు అందుకోవడానికి
అందరి ప్రేమాభిమానాలు పొందడానికి
నువ్వు పరుగున రావాలి
పగడాల వానై కురవాలి !

ఈ భూమి ప్రగతి చక్రమై సాగడానికి
నీ భాగం కావాలి నీవే సగం కావాలి
అతుకు గతుకులో మెతుకు నీవు
మెతుకు మెతుకులో బతుకు నీవు
చినుకుతో చిగురాకును వొణికిస్తూ వస్తావో
పదనుతో పచ్చదనాన్ని పూయిస్తూ వస్తావో
కరువుకి ఉరివేస్తూ ఆకలిని చెరిపేస్తూ వస్తావో
రంగుల్ని జల్లి హెూలీ ఆడుతూ వస్తావో
ఎలా వస్తావో రా !
ఒక దృశ్యం జీవం పోసుకోవడానికి నెపమవుతూ వస్తావో
ఒక చిత్రం రూపం దాల్చడానికి కారణమవుతూ వస్తావో
ధరణి ధగధగల బాధ్యత మోస్తూ
అభయహస్తంగా వస్తావో
ధాత్రిని ప్రేమిస్తూ దీవిస్తూ అమృత నేస్తంగా వస్తావో
ఎలా వస్తావో రా !

నీ ముసురు మమ్మల్ని పోటేస్తుంది
ఉసురు తీయక
నీ ముసురు విసురు పాటేస్తుంది
నీవిచ్చే భరోసా మాకు కులాసా
పైర్లు ఎండిపోతే చూడలేం
పంటలు మాడిపోతే చూడలేం
దిగుబడులు గండిపడి గంపలు
నిండకపోతే చూడలేం
రకరకాల విపత్తులో మేం
ఒక బాధ గాదు అనేక గాథల్లో మేం
విభేదించకు ఏ ఘడియలోనూ
విస్మరించకు
నువ్వు రావాలి
దుర్భర దారిద్ర్యం సవాళ్ళని ఢీకొంటూ
సర్వతోముఖ వికాసానికి సై అంటూ
స్వప్నం నీవు స్వర్గం నీవు
బీళ్లను పొలాలు చేసే
పొలాల్ని సుక్షేత్రాలుగా మలిచే
సృజన నీవు చేతన నీవు
వానా స్వాగతం ...
వాన జానా, సుస్వాగతం ..!

- కోటం చంద్రశేఖర్
94920 43348



మహాకవి శ్రీశ్రీ 40వ వర్ధంతి సందర్భంగా ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సంస్థ నెలకొల్పిన శ్రీశ్రీ సాహిత్య పురస్కారాన్ని ప్రజానాట్యమండలి వ్యవస్థాపక సభ్యులు, సీనియర్ కళాకారుడు, దర్శకుడు నల్లూరు వెంకటేశ్వర్లు (అన్న)కు ప్రదానం చేశారు. 15.6.2023 సాయంత్రం విజయవాడలోని ఘంటసాల సంగీత కళాశాల వేదికపై పురస్కార ప్రదాన సభ జరిగింది. మాజీ మంత్రి డొక్కా వరప్రసాద్, ఎక్స్‌రే సంస్థ వ్యవస్థాపకులు ఎస్ఆర్ కొల్లూరి, గోళ్ల నారాయణ రావు, శ్రీశ్రీ సాహిత్య నిధి నిర్వాహకులు సింగంపల్లి అశోక్ కుమార్, లక్ష్మీనారాయణ (అరసం), అరసవిల్లి కృష్ణ (విరసం), దివికుమార్ (జనసాహితి), సత్యాజీ (సాహితీ స్రవంతి) తదితరులు పాల్గొన్నారు. పురస్కార గ్రహీత అన్న మాట్లాడుతున్న దృశ్యం పై చిత్రంలో చూడొచ్చు.

## ఉద్యమాలకు ప్రేరణ 'ది మ్యాంగో లేడీ'

**'ది** మేంగో లేడీ' నవల ఉద్యమాలకు ప్రేరణగా తోడ్పడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. హిందూ సబ్ ఎడిటర్ మల్లాజోస్యుల అనుపమ పద్మజ రాసిన 'ది మేంగో లేడీ' ఆంగ్ల పుస్తకావిష్కరణ కార్యక్రమం విశాఖ నగరంలోని పౌర గ్రంథాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో **2.7.2023** ఆదివారం జరిగింది. తొలుత ఈ పుస్తకాన్ని సోంపేట థర్మల్ ప్లాంట్ వ్యతిరేక పోరాట యోధురాలు జ్యోతి అతిథులతో కలిసి ఆవిష్కరించారు.


అనంతరం ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ కెఎస్.చలం మాట్లాడుతూ.. 'ది మేంగో లేడీ' పుస్తకంలో ఒక సాధారణ మహిళ ఎదుర్కొన్న సమస్యలనూ, జీవిత అనుభవాలను చెబుతూ అద్భుతంగా 250 పేజీలు రాయడం గొప్ప విషయమన్నారు. నెలసరి అయ్యిందన్న కారణంతో సదరు మహిళ ఊరు నుంచి గెంటివేయబడిన తరువాత అనుభవించిన కష్టాలను రచయిత్రి పుస్తకంలో పొందుపరిచారని తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నళిని మాట్లాడుతూ శ్రీకాకుళంలో ఒక మహిళకు జీవితంలో ఎదురైన సంఘటనలను ఆధారంగా తీసుకుని రాసిన ఈ పుస్తకం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. ఏ గ్రామస్తులయితే తనను ఊరు నుంచి గెంటివేశారో, అదే గ్రామస్తులకు తన పేరు మీద ఉన్న ఆస్తులు ఇవ్వడానికి వచ్చి.. ఆ గ్రామస్తుల్లో మార్పు తేవాలన్న ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయం ఆధారంగా ఈ పుస్తకం రూపుదిద్దుకుందని తెలిపారు.



'మ్యాంగోలేడీ' నవలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రచయిత్రి నుంచి ఇటువంటి మరిన్ని పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. సోంపేట థర్మల్ ప్లాంట్ వ్యతిరేక పోరాట యోధురాలు జ్యోతి మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని అనేక సమస్యలను పుస్తకాల రూపంలోకి తేవాల్సి ఉందన్నారు. 'ది మేంగో లేడీ' పుస్తకాన్ని తెలుగులోకి అనువదించాలని సూచించారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్, సాహితీవేత్తలు అట్టాడ అప్పలనాయుడు, శ్రీనివాసులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వర్తమాన, సామాజిక జీవితపు వాస్తవ చిత్రీకరణలను నవలలో పొందుపరిచారని తెలిపారు. పుస్తక రచయిత్రి అనుపమ పద్మజ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమస్యలను నిత్యం గ్రహిస్తూ పలువురితో మాట్లాడి ఓ మహిళ జీవితంలో జరిగిన సంఘటనలను ఆధారంగా తీసుకుని పుస్తకాన్ని రచించినట్టు చెప్పారు. కేన్సర్ బారిన పడి చనిపోయిన తన స్నేహితురాలు సంధ్యను స్మరణకు తెచ్చుకున్నారు. ఆమె జయంతిని పురస్కరించుకుని కార్యక్రమానికి ముందు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.





కథారచనలో మెలకువలను వివరిస్తున్న పాపినేని శివశంకర్; కార్యశాల ప్రతినిధుల ఫొటో

# 'సమన్విత' కథా కార్యశాల - 2023

**25.06.2017**న ఆవిర్భవించిన 'సమన్విత' తన తొలి అడుగును రచనా కార్యశాలతో వేసి, కవిత్వ రచన, అనువాదాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించింది. Where there is no reserch, there we ve to search అన్న సంకల్పంతో ముందుకు సాగుతున్న ఈ రచయిత్రుల సమాఖ్య, విజయవాడ కార్యక్షేత్రంగా గతంలో నిర్వహించిన తన కార్యకలాపాలను విస్తరిస్తూ ఉభయ తెలుగు రాష్ట్ర వర్ధమాన రచయితలకు ఈ ఏడాది జూన్ 24, 25 తేదీల్లో కృష్ణా జిల్లా చిన్న ముత్తేవిలో కథా కార్యశాల నిర్వహించింది. పత్రికల ద్వారా, సోషల్ మీడియాలో వినూత్నంగా ప్రచారం నిర్వహించడం ద్వారా 35 మందిని ఎంపిక చేశాము. అజయ్ భవన్‌లో నిర్వహించిన ఈ రెండ్రోజుల కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ఆర్ట్స్ అకాడమీ బాధ్యులు గోళ్ళ నారాయణరావు ప్రారంభించారు. సమకాలీన సమస్యలపై చైతన్యం చేయవలసిన గురుతర భాధ్యత రచయితలదేనని, ఆ దిశగా కృషి చేసి తమ పేరును సైతం చరిత్రలో శాశ్వతం చేసుకోవాలని ఆకాంక్షించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీత పాపినేని శివశంకర్ కథా వస్తువు ఎంపిక, శైలి, ఎత్తుగడ, ముగింపు అంశాలను వివరించారు. యువ పురస్కార గ్రహీత వేంపల్లి షరీఫ్ అనువాద సాహిత్యం, దాని ప్రభావం, రచనలలో మండలికాల ఆవశ్యకత, ఉపయోగించాల్సిన విధానం తెలియజేసారు. ప్రముఖ కథా రచయత ఖదీర్ బాబు ... ప్రస్తుత సమాజంలో నిత్య జీవితంలో ఎదురవుతున్న భిన్న సంఘటనల నేపథ్యంలో కథలు ఎలా రాయాలో వివరించారు. సమన్విత అధ్యక్షురాలు డాక్టర్ దుట్టా శమంతక మణి అధ్యయనం ఆవశ్యకత, పబ్లికేషన్ సమయంలో ఎదురయ్యే సమస్యలను వివరించారు. వడ్లమూడి పద్మావతి పబ్లికేషన్ సమస్యలు అధిగమించడానికి మార్గాలను, శాంతి శ్రీ కథా రచనపై మెలకువలను తెలిపారు. కామ్రేడ్ జిఆర్‌కె - పోలవరపు సాంస్కృతిక సమితి సహకారంతో నిర్వహించిన ఈ కథా కార్యశాల - 2023 బహుమతీ ప్రదాన సభకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ పూర్వ ఉప సభాపతి డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అరసం తెనాలిలో నిర్వహించిన తొలి కథా కార్యశాల నుంచి తెలుగు సాహిత్య లోకంలో జరిగిన కార్యశాలలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత దేశ పరిస్థితుల రీత్యా, సమాజాన్ని చైతన్యపరిచే రచనల ఆవశ్యకతను వివరించారు.

రెండు రోజుల కార్యక్రమాన్ని ఆద్యంతం పర్యవేక్షించిన రావెళ్ళ లక్ష్మి సమన్విత రచయితల పుస్తకాలు, సాహిత్య ప్రస్థానం 'కథా రచన'పై తెచ్చిన ప్రత్యేక సంచికను, మెడల్, సర్టిఫికెట్‌ను ప్రదానం చేయడంలో సహకరించారు. పాల్గొన్న సభ్యులు 31.08.23లోపు తమకు నచ్చిన అంశంపై కథలు పంపాలని, వాటితో పుస్తకం తెస్తామని ప్రజాశక్తి బుక్‌హౌజ్ పూర్వ సంపాదకురాలు కె ఉషారాణి తెలిపారు. కథా కార్యశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన సమన్విత వైస్ ప్రెసిడెంట్ వొర ప్రసాద్, కార్యక్రమ సమన్వయం చేయడమే గాక అనువాదం పై మరో కార్యశాల నిర్వహిస్తామని తెలియజేశారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యరంజన్, జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు గుండు నారాయణ, విజయవాడ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి డివిఎస్ రాజు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి, ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు స్వరూపరాణి, ఆర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

**- జిఎస్ సాహిత్య**

# పుత్తూరు పిల'గోడు' పుస్తక ఆవిష్కరణ

**ఆర్** సి కృష్ణస్వామి రాజు రచించిన పుత్తూరు పిల'గోడు' పుస్తక ఆవిష్కరణ 25.06.2023న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ సెక్రటరీ కె.ఎస్.శ్రీనివాస రాజు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సినీ నటుడు జెన్నీ, అచ్చంగా తెలుగు ప్రచురణల అధినేత్రి భావరాజు పద్మిని, రచయితలు పాణ్యం దత్త శర్మ, బత్తుల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



# తానా 'కథాసాహిత్యం' సదస్సు



ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) సంస్థ సాహిత్య విభాగం 'తానా ప్రపంచ సాహిత్య వేదిక' నెల నెలా తెలుగు వెలుగులో భాగంగా 2023 జూన్ 25న నిర్వహించిన 'కథా సాహిత్యం' సదస్సు విజయవంతంగా జరిగింది. తానా అధ్యక్షుడు లావు అంజయ్య చౌదరి ప్రజలపై కథల ప్రభావం ఎంతో ఉందని, సామాజిక ప్రయోజనం కల్గించే కథలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో యండమూరి వీరేంద్రనాథ్ లాంటి సుప్రసిద్ధ రచయితలు పాల్గొనడం ఆనందదాయకం అని తానా ప్రపంచ సాహిత్య వేదిక సమన్వయకర్త చిగురుమళ్ళ శ్రీనివాస్ అన్నారు. తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డా. ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ, ఉగ్గుపాలతో కథలు విన్న పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, దానికి పునాదులు వేయవలసింది తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులే అని అన్నారు. బాల్యంలో కథలు విన్న పిల్లల మానసిక వికాసం, తెలుగు భాష పట్ల అనురక్తి కలిగి పెరిగి పెద్దైన తర్వాత వారే భాషా ప్రేమికులుగా, సాహితీవేత్తలుగా రూపాంతరం చెందుతారని అన్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న సుప్రసిద్ధ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ మాట్లాడుతూ 'కథారచయితలు సమయం తీసుకుని, ఆలోచించి కథలు రాస్తే వాటిని చదివే పాఠకులను అవి ఆలోచింప జేస్తాయి. వర్ధమాన రచయితలు సామాజిక ప్రయోజనం కలిగించే కథా వస్తువులను ఎంచుకొని రచనలు చేయడం చాలా అవసరం.' అని అన్నారు. అయ్యగారి వసంతలక్ష్మి తన ప్రత్యేకమైన గళానుకరుణతో ప్రఖ్యాత రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి రాసిన 'సుఖాంతం' కథను హృద్యంగా వినిపించారు. ప్రముఖ కథారచయిత విహారి కాలానుగుణ అంశాలు అనే అంశంపై ప్రసంగిస్తూ రచయితలు కథాంశాన్ని ఎన్నుకునేటప్పుడు అది ఆ తరాన్ని ఆకట్టుకునే విధంగా ఉండాలని అన్నారు. సుప్రసిద్ధ కథారచయిత ద్విభాష్యం రాజేశ్వర రావు ... తాను చిన్నప్పటి నుంచే కథలు వినడం, అనేకమంది సాహితీవేత్తల సమక్షంలో తన జీవితం గడవడం వల్ల తన కథానేపథ్యం ప్రారంభమైందని అన్నారు.

సుప్రసిద్ధ రచయిత శ్రీ సింహ ప్రసాద్ మాట్లాడుతూ పోటీలో పాల్గొని బహుమతులు పొందాలంటే ఎంచుకునే కథాంశం మీద ధ్యాస, నియమ నిబంధనల మీద దృష్టి సారించాలని, మంచి కథకు ప్రమాణం కేవలం బహుమతి పొందడమే కాదని, బహుమతి పొందని కథలలో కూడా ఎన్నో అద్భుతమైన కథలు ఉన్నాయని అన్నారు. కథారచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి తాను రాసిన హాస్యకథలతోపాటు ఎంతోమంది రచయితలు రాసిన విషయాలను ప్రస్తావించి సభలో నవ్వులు పూయించారు.

కథారచయిత శరత్ చంద్ర మాట్లాడుతూ, ప్రతి కథ ఒక సామాజిక ప్రయోజనం కలిగిఉండి, మానవ సంబంధాలను మెరుగుపరచడంలో ముఖ్యభూమికను పోషిస్తూ, మానవీయకోణం కలిగి ఉన్నప్పుడే ఆ కథ పదికాలాల పాటు శాశ్వతంగా నిలుస్తుందని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ పిల్లలకు కథలు చెప్పడం చాలా అవసరమని, అవి వారి మానసిక పరిణితికి బాగా ఉపయోగపడతాయని అన్నారు. ఈ సాహిత్య సభలో పాల్గొని విజయవంతం చేసిన అతిథులకు, ప్రసారం చేసిన మాధ్యమాలకు, కార్యకర్తలకు తానా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసింది.

## శ్రీనివాస్ గౌడ్ కి కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారం

ప్రతిష్టాత్మక కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారం 2022కు గాను పి శ్రీనివాస్ గౌడ్ రచించిన చిన్ని చిన్ని సంగతులు సంపుటి ఎంపికైనట్టు అవార్డు నిర్వాహకులు శ్రీ కొత్తపల్లి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన పి.శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపాధ్యాయులుగా పని చేసి, ప్రస్తుతం నిర్మాణ రంగంలో వున్నారు. కవిత్వం, కథ, విమర్శ, అనువాదాలలో కృషి చేస్తున్నారు. ఇప్పటివరకు 9 కవిత్వ పుస్తకాలు వెలువరించారు. కవిత్వానికి, కథలకు పలు పురస్కారాలు అందుకున్నారు. విడి ఆకాశం, రెక్కల పతాక, కథాపురి, కథాప్రకాశం సంకలనాలకు సంపాదక బాధ్యతలు నిర్వహించారు. త్వరలో అనంతపురంలో అవార్డు ప్రదానోత్సవ సభ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

**పెనుమాక రత్నాకర్ రచించిన 'గౌతమీతీరం' కథాసంపుటి పరిచయసభ 11.6.2023 ఆదివారం కాకినాడ శాస్త్రి కళాపీఠం సాహితీస్రవంతి ఆధ్వర్యాన జరిగింది. డా.జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన సభలో సమీక్షకులు డా.కాళ్ళకూరి శైలజ మాట్లాడుతూ, రచయిత కథలను ఆసక్తిగా మలిచి, పాఠకులను రంజింపచేయడంలో కృతకృత్యులయ్యారని అన్నారు. రత్నాజయ్ మాట్లాడుతూ రచయిత తనదైన ముద్రతో మున్ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సాహితీస్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా మాట్లాడుతూ 'కళాశాల విద్యార్థులకు కథ సాహిత్యంపై త్వరలో ఒక కార్యశాల నిర్వహించనున్నట్లు' తెలియజేసారు. అనంతరం రచయిత రత్నాకర్ తన స్పందన తెలియజేశారు.**



రచయితను అభినందిస్తున్న దృశ్యం



## జన్యులిపి (కవిత్వం)

**రచన : డా.దేవరాజుమహరాజు**
**వెల : రూ.100, పేజీలు : 108**

**ప్రతులకు : 94906 79570**

**మా**నవతా పరిమళాల గుత్తి 'జన్యులిపి' కవితా సంపుటి. తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లో తనదైన రాజముద్రను వేసిన ప్రముఖ సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (2021) గ్రహీత డా.దేవరాజు మహరాజు గారి రచన ఏదైనా అది సమాజ హితమన్నది అందికీ తెలిసిన వాస్తవం. అందునా మానవతాపరిమళం నిండిన ఉద్వేగంతో సాగే 'జన్యులిపి' కవితలు పాఠకుల్ని ఊపిరి బిగబెట్టి మరీ పదాల వెంబడి పరుగులు పెట్టించి చదివిస్తాయి.



## యోధ

**(మల్లుస్వరాజ్యం స్మారక సంచిక)**
**వెల : 50 పేజీలు : 192**
**ఐద్వా ప్రచురణ**


**వీ**రనారి మల్లు స్వరాజ్యం సాయుధ తెలంగాణా పోరాట యోధురాలు. కడవరకు ఎర్రజెండా నీడన సమ సమాజం కోసం పోరాడిన ధీర. ఆమె సంస్మరణ సంచిక ఇది. సిపిఎం ఆల్ఇండియా నాయకత్వం నుంచి. రాష్ట్ర, జిల్లా నేతల వరకు అందరూ మల్లు స్వరాజ్యంతో పనిచేసిన నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రాసిన వ్యాసాలు సమాహారం ఇది. పార్వతీ మీనన్, బృందాకరత్, బి.విరాఘవులు, పుణ్యవతి, మరియం ధావలె, టి.జ్యోతి వంటి ఎందరో అర్పించిన అక్షర నివాళి ఈ పుస్తకం.



## అస్తిత్వ వాచకం (కవిత్వం)

**రచయిత : బాల సుధాకర్**
**వెల : 150 పేజీలు: 136**
**ప్రతులకు : 96764 93680**


**'లౌ**కికత్వం ఈ నేల రక్తం. భిన్నత్వం ఈ నేల సౌరభం. ఎవడి ఆకలి వాడిదనట్టు, ఎవరి ఆహారం వాడిదన్నట్టు, ఎవడి భాష వాడిది. భాష నా అస్తిత్వవాచకం' అంటారు కవి బాల సుధాకర్. ఇందులోనివి కొన్ని నిర్మొహమాటపు కవితలు. ఉత్తరాంధ్ర అస్తిత్వాన్ని చాటే అక్షర మాలికలు. భళ్లున బయటకు రాలేక మహిళల అంతరంగాల గోడలను అంటిపెట్టుకొని తరతరాలుగా దాగున్న భావోద్వేగాలు. చక్కని శైలితో సాగే సుధాకర్ కవితలు పాఠకులను ఆలోచింపజేస్తాయి. ఈ కవి ఇప్పటికే మూడు కవితా సంపుటాలు వెలువరించారు. కేంద్ర సాహిత్య అకాడెమీ యువ పురస్కారం పొందారు.



## ప్రమిద

(రావి రంగారావుగారి సాహిత్య స్వర్ణోత్సవ సంచిక)
**వెల : 50 పేజీలు : 191**
**ప్రతులకు : 9885459198**

**ఇది** ప్రఖ్యాత కవి రావి రంగారావు గారి సాహిత్య ప్రస్థాన అభినందన సంచిక. తొలినాళ్లలో తంతి తపాలా శాఖలో 'టెలిగ్రాఫిస్టుగా' కుదురుకున్న ఆయన ఒకానొక సినిమా పుణ్యమా అని సుకవిగా రూపాంతరం చెందాడు. ఆ సినిమా లవకుశ అయితే, ఆ యువకుడు రావి రంగారావు. మినీ కవితపై మక్కువ పెంచుకున్న ఒఆయన ఆ ప్రక్రియ వ్యాప్తికి విశేషమైన కృషిసల్పారు. ఆయన సాహిత్య కృషి గురించి, వ్యక్తిత్వం గురించి ఎందరో కవులూ రచయితలూ రాసిన వ్యాసాల సమాహారం ఇది.



## చారిత్రక గాథలు

(చారిత్రక సంఘటనల సమాహారం)
**రచయిత : యస్.డి.వి.అజీజ్**

**వెల : 100 పేజీలు : 90**
**ప్రతులకు : 91331 44138**

**'చ**రిత్రలోని ఘటనలను తీసుకొని వాటిని చారిత్రక కథలుగా అల్లిన పుస్తకమిది. రచయిత అజీజ్‌పేరు కర్నూలు జిల్లాలోనే కాదు; రెండు తెలుగు రాష్ట్రాల్లో సాహితీ ప్రియులకు సుపరిచితం. ఈ పుస్తకంలో మొత్తం 11 కథలు ఉన్నాయి. ఇందులో ఏ చారిత్రక గాథను తీసుకున్నా రచయిత కొత్తగా ఏదో మాయ చేశారని అనిపిస్తుంది. చారిత్రక విశేషాలను వివరిస్తూ కథలు ఆసక్తికరంగా సాగుతాయి.



## సూక్తి రత్నమంజరి

**(శ్లోకాలకు ఆటవెలదులు)**
**రచయిత : గార రంగనాథం**

**వెల : 50 పేజీలు : 70**
**ప్రతులకు : 98857 58123**

**150** సంస్కృత శ్లోకాలకు 150 ఆటవెలదులు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఇది 'రాజాం రచయితల వేదిక' ప్రచురణ. నీతి పద్యాల సముచ్చయం. సుప్రసిద్ధ శ్లోకాలకు అందమైన అనువాదాలు రాశారు రచయిత గార రంగనాథం. 'ఏ పద్యానికి ఆ పద్యం ఏనుగును పీటమీద కూర్చోబెట్టినట్టు పెద్ద జెమినీ సర్కస్సే. అలా శ్రమతో కూడుకున్న అనువాద ప్రక్రియతో పుస్తకాన్ని ఎంతో హృద్యంగా తీసుకువచ్చారు.



## విస్తృత కళింగాంధ్ర సాహితీ ప్రభ

**(వ్యాసాల సంపుటి)**
**సంపాదకుడు : గార రంగనాథం**
**వెల : 300 పేజీలు : 320**
**ప్రతులకు : 9885758123**

**ఉ**త్తరాంధ్రలో ప్రాచీనకాలంలో ఏ విధంగా తెలుగు సాహిత్యం ఆవిర్భవించి వికసించిందో ఈ పుస్తకం తెలియజేస్తుంది. ఆధునిక యుగంలో మహాకవి గురజాడ, యుగకర్త శ్రీశ్రీ, గిడుగు రామమూర్తి, ఆదిభట్ల నారాయణదాసు, తాపీ ధర్మారావు, ఆరుద్ర వంటి సాహితీస్రష్టలు వివిధ కోణాల్లో తెలుగు సాహిత్యానికి వెలుగుబాటలు వేసిన తీరును స్మరిస్తుంది. ఉత్తరాంధ్ర ప్రాంతానికి శాతవాహనులకంటే ప్రాచీన చరిత్ర ఉంది. కళింగ క్రమంగా ఆంధ్ర, ఒరియాగా విడివడిన రెండు సంస్కృతుల నేల. కనుక ఇక్కడి కవిత్వంపై రచనలపై ఒరియా ప్రభావాన్నీ ఈ పుస్తకంలోని వ్యాసాలు ప్రస్తావించాయి.



## మున్సిపల్ కథలు

**రచన : డా.దీర్ఘాసి విజయభాస్కర్**
**వెల : 150 పేజీలు: 144**
**ప్రతులకు : 94943 66698**


**సా**ధారణంగా ఇతరులు చూస్తూ కూడా పట్టించుకోని అంశాల్ని రచయితలు నిశితంగా గమనిస్తారు. తమకు తెలిసినట్టే ఉండి, తెలియని జీవితాన్ని చూసి కథల్లో విస్మయం చెందుతారు పాఠకులు. అలాంటి కథలే 'మున్సిపల్ కథలు'. తాను పనిచేస్తున్న రంగంలో తారసపడిన సంఘటనలను, సారాంశాలను, వాస్తవాలను కథలుగా అల్లారు రచయిత. వ్యవస్థలన్నవి ప్రజల సేవ కోసం రూపొందాయన్నది నేటి పాలకులు విస్మరిస్తున్నారు. సేవారంగంలోనూ లాభాపేక్ష, సంక్షేమ, సేవాభావాలు కనుమరుగవ్వడం వంటి అనేక కోణాలను ఈ కథలు ప్రశ్నిస్తాయి.



## దయాశోకం

**(దీర్ఘ కవిత్వం)**
**రచన : డా.మాటూరి శ్రీనివాస్**
**వెల : 150 పేజీలు: 144**
**ప్రతులకు : 98499 08929**

**'చ**క్రవర్తి అశోకుని జీవిత గాథే ఈ దీర్ఘ కవిత. ఇది ఒక కావ్యం లాంటిది. భారతావనిని ఎందరో చక్రవర్తులూ, రాజులూ పాలించినా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వారు అతి కొద్ది మందే. వీరిలో ప్రథముడు అశోకుడు. అశోకుడిని విస్మరిస్తే దేశ చరిత్రే లేదు. అందుకే ఆయన గుర్తుగా మన జాతీయ జెండాలో 'అశోకచక్రం' స్ఫూర్తి నింపుతుంది. అశోకుని జీవిత గాథపై రాసిన ఈ దీర్ఘ కవిత ద్వారా ఈ కవి 'మతములన్నీ మాసిపోయి మానవత విరిసి పూయాలి' అని ఆకాంక్షిస్తారు. ఇది అందరూ చదవదగిన పుస్తకం.



## మహిళోద్ధారకులు

(వ్యాసాలు)
**రచయిత :**
**కుమ్మమూరి (పొత్తూరి) సుబ్బాయమ్మ**
**వెల : పేజీలు: 126**
**ప్రతులకు : 99852 95605**

**ఆ**నాడు దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యాన ఏర్పడిన 'ఆంధ్ర మహిళా సభ', దాని విశిష్ట సేవలను తెలియజేసే పుస్తకం ఇది. 'వృక్షం త్యాగానికి ప్రతీక. 'ఆంధ్ర మహిళా సభ' ఒక పెద్ద వటవృక్షం లాంటిది. దయ, ప్రేమ సానుభూతి ఈ సేవా వృక్ష మూలాలు. ఈ వటవృక్ష సేవలు అందుకొని పైపైకి ఎదిగిన మహిళా సేవకులు కోట్లలో వున్నారు. అందులో ఒకరిగా నేను నేటికీ నిలబడివున్నాను. మహిళాసభ సేవలు చిర్మరణీయమైనవి. అందరూ స్మరించుకోదగినవి" అంటారు రచయిత సుబ్బాయమ్మ గారు.



## డ్రైవర్‌బాబు డాక్టరయ్యాడు

**రచన : కథల సంపుటి**
**రచయిత : పొత్తూరి జయలక్ష్మి**
**వెల : 100 పేజీలు : 118**
**ప్రతులకు : 9703491619**

**ఆ**ర్థిక, సామాజిక, సాంస్కృతిక సంబంధాలు.. మనుషుల మనస్తత్వాల్లో నడవడికలో ఎలాంటి వైరుధ్యాల్ని కల్పిస్తాయో, దానివల్ల వారి ప్రవర్తనలో ఎటువంటి అవాంఛితాలు నెలకొంటున్నాయో కళ్లకు కట్టే కథలివి. రచయిత ప్రతి కథనూ ఒక సామాజిక వాంఛితంపైపు, ఒక ఆరోగ్యకర ఆశయంవైపు నడిపారు. ఇవి ఆలోచింపజేస్తాయి. ఇది 14 కథానికల పేటి ఈ పుస్తకం. కథావస్తువు ఎంపిక నుంచీ అన్నీ ప్రత్యేక ఆసక్తికర తరహాలో సాగే ఈ కథలు పాఠకులు చదవదగినవి.



## సుమ సోయగాలు (కవిత్వం)

**రచన : పొత్తూరి సుబ్బారావు**
**వెల : రూ.100 పేజీలు : 114**
**ప్రతులకు : 99852 95605**

**ఈ** పుస్తకం పాఠకుల మదిలో మత్తయిన, గమ్మత్తైన పూల పరిమళా లను వెదజల్లుతుంది. సృష్టిలో అందునా మన తెలుగు నాట ఇన్నీ పూలున్నాయా? అనిపించేలా ఒక్కోపూల కొమ్మపై ఒక్కో కవిత కమ్మగా అద్భుతంగా సాగుతుంది. ప్రకృతి ప్రేమికులను పరశింపజేస్తుంది. మల్లెలు, మొల్లలు, బంతులు, చామంతులు, జాజులు, కనకాంబరాలు, పొగడపూలు, పారిజాతాలు, సంపెంగలు, మందారాలు, గులాబీలు, గన్నేరుపూలు, కలువలు, కాగితప్పూలు, లిల్లీలు, శంఖుపూలు, దిల్‌బహార్‌లు, గుల్‌మొహార్లు... ఇలా ఎన్నోపూలు కవితాత్మకంగా పాఠకులను పలకరిస్తాయి.


# దేవరకొండ బాలగంగాధర తిలక్

జననం : 21.08.1921     మరణం : 01.07.1966



'అమృతం కురిసిన రాత్రి' వీరి ప్రసిద్ధ కవితా సంపుటి.
గోరువంకలు, సీత కావ్యాలు రాశారు.
నల్లజెర్ల రోడ్, ఊరి చివరి ఇల్లు వీరి ప్రసిద్ధ కథలు.
కవిత్వంలోనూ, కథారచనలోనూ సమానస్థాయిలో
ప్రతిభ చూపిన రచయిత.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 4 ▪ SANCHIKA - 10 ▪ KRISHNA ▪ July 2023
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2023-25 PAGES : 68
Date of Posting : 2nd of Every Month ▪ Date of Publication : 27.06.2023



పోలవరం ముందుకురికి బతుకు మునిగిపోతుంటే...

ఈ బాలల భవితకు ఎవరిదండీ, బాధ్యత ?